www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 23-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 37

శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: ఏకాదశి రా.10:30 తదుపరి ద్వాదశి, నక్షత్రం: ఉత్తరాభాద్ర సా.4:02 తదుపరి రేవతి, వర్జ్యం: రా.2:55-4:22, దుర్ముహూర్తం: ఉ.8:19-9:11, మ.12:37-1:29, అమృతఘడియలు: ఉ.11:35-1:04, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 5:44, సూర్యాస్తమయం: 6:39

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



స్పోర్ట్స్

మార్ష్ శతక మోత

నేటి మ్యాచ్ వేదిక బెంగళూరు
బెంగళూరు x హైదరాబాద్ రా.7.30 నుంచి



ఆయుష్‌కు అండర్-19 పగ్గాలు

వైభవ్ సూర్యవంశీకి చోటు
ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు ఎంపిక

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో అదరగొడుతున్న యువ సంచలన బ్యాటర్లు ఆయుష్ మాత్రే, వైభవ్ సూర్యవంశీలపై సెలెక్టర్ల దృష్టి పడింది. వచ్చే నెలలో ఇంగ్లండ్‌లో పర్యటించే భారత అండర్-19 జట్టు కెప్టెన్‌గా మాత్రేను ఎంపిక చేశారు. జూన్ 24 నుంచి జూలై 23 వరకు ఇంగ్లండ్ అండర్-19తో భారత కుర్రాళ్లు ఐదు యూత్ వన్డేలు, రెండు నాలుగు రోజుల టెస్టులు ఆడనున్నారు. జట్టులో మొత్తం 16 మంది ఆటగాళ్లున్నారు. జట్టులో హైదరాబాద్‌కు చెందిన వికెట్ కీపర్ రాపోలు అలంకృత్ స్టాండ్‌బై ఆటగాడిగా ఎంపిక య్యాడు. కాగా వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలిన 17 ఏళ్ల మాత్రే చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గాయపడడంతో జట్టులోకి వచ్చి ఓపెనర్‌గా చెలరేగుతున్నాడు. ఆడిన ఆరు మ్యాచ్‌లోనే 206 పరుగులు సాధించాడు. ఇక 14 ఏళ్ల వైభవ్ విధ్వంసం అందరికీ తెలిసిందే. ఇప్పటికే ఓ మెరుపు శతకం కూడా బాదేయడంతో తనకు అండర్-19 జట్టులో చోటు ద్వారా ప్రమోషన్ లభించినట్టయ్యింది.

యూఏఈ కొత్త చరిత్ర

● బంగ్లాపై టీ20 సిరీస్ విజయం

దుబాయ్: బంగ్లాదేశ్‌పై టీ20 సిరీస్‌ను సొంతం చేసుకోవడం ద్వారా యూఏఈ జట్టు చరిత్ర సృష్టించింది. మూడు మ్యాచ్‌ల టీ20ల సిరీస్‌లో భాగంగా బుధవారం రాత్రి జరిగిన ఆఖరి మ్యాచ్‌లో యూఏఈ 7 వికెట్ల తేడాతో బంగ్లాను ఓడించింది. తొలుత బంగ్లా 20 ఓవర్లలో 162/9 స్కోరు చేసింది. జాకర్ అలీ (41), తన్జిద్ హసన్ (40) టాప్ స్కోరర్లు. హైదర్ అలీ మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో యూఏఈ 19.1 ఓవర్లలో 166/3 స్కోరు చేసి గెలిచింది. అలీషాన్ షరాఫు (68 నాటౌట్), ఆసిఫ్ ఖాన్ (41 నాటౌట్) తుదికంటా క్రీజులో నిలిచి జట్టును గెలిపించారు.

● లఖ్‌నవూ ఘనవిజయం ● పూరన్ హాఫ్ సెంచరీ
● గుజరాత్‌కు ఝలక్ ● రాణించిన షారుక్



మిచెల్ మార్ష్ (64 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్సర్లతో 117)

అహ్మదాబాద్: వరుసగా నాలుగు ఓటములతో ప్లేఆఫ్స్‌కు దూరమైన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఎట్టకేలకు అదరగొట్టింది. పట్టికలో అగ్రస్థానాన కొనసాగుతున్న గుజరాత్ టైటాన్స్‌ను వారి సొంతగడ్డపైనే దీటుగా ఎదుర్కొంది. ఓపెనర్ మిచెల్ మార్ష్ (64 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్సర్లతో 117) తొలి శతకం సాధించగా.. పూరన్ (27 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 56 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. ఆ తర్వాత బౌలర్లు కూడా కట్టడి చేయడంతో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో పంత్ సేన 33 పరుగుల తేడాతో టైటాన్స్‌ను మట్టికరిపించింది. అటు గుజరాత్‌కిది కేవలం నాలుగో ఓటమి కాగా.. లఖ్‌నవూ ఆరు విజయాలు, 12 పాయింట్లతో కాస్త మెరుగైంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 2 వికెట్లకు 235 పరుగులు చేసింది. మార్‌క్రమ్ (36) సహకరించాడు. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 202 పరుగులు చేసింది. షారుక్ (57), రూథర్‌ఫోర్డ్ (38), గిల్ (35), బట్లర్ (33) రాణించారు. ఓరౌర్కీకి 3, అవేశ్.. బదోనిలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మార్ష్ నిలిచాడు. ఇదిలావుండగా క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా గుజరాత్ జట్టు లావెండర్ రంగు జెర్సీలతో బరిలోకి దిగింది.

షారుక్ పోరాడినా..: గుజరాత్ బ్యాటింగ్ బలమంతా టాపార్డర్‌పైనే ఆధారపడి ఉంటుంది. కానీ 236 పరుగుల కష్టసాధ్యమైన ఛేదనలో వీరంతా ఓ మాదిరి స్కోరుకే పరిమితమయ్యారు. ఒక్కరు కూడా హాఫ్ సెంచరీ సాధించకపోగా.. తొలి పది ఓవర్‌లోనే ఈ త్రయాన్ని పెవిలియన్‌కు చేర్చి లఖ్‌నవూ బౌలర్లు పైచేయి సాధించారు. అయితే ఈసారి మిడిలార్డర్ ఆదుకునే ప్రయత్నం చేయగలిగింది. ఇన్నింగ్స్ తొలి బంతినే ఓపెనర్ సాయి సుదర్శన్ ఫోర్‌గా మలిచాడు. అటు మూడో ఓవర్‌లో మరో ఓపెనర్ గిల్ హ్యాట్రిక్ ఫోర్లతో ధాటిని కనబర్చాడు. సాయిని పేసర్ ఓరౌర్కీ పెవిలియన్‌కు చేర్చగా.. బట్లర్ ఆరో ఓవర్‌లో 4,6,6,4తో 21 పరుగులు రాబట్టి పవర్‌ప్లేను 67/1తో ముగించాడు. కానీ స్వల్ప వ్యవధిలో ఈ ఇద్దరూ పెవిలియన్‌కు చేరడంతో టైటాన్స్ షాక్‌కు గురైంది. ఇక కష్టమే అనుకున్న వేళ మిడిలార్డర్‌లో రూథర్‌ఫోర్డ్-షారుక్ జోడీ నుంచి ప్రతిఘటన ఎదురైంది. నాలుగో వికెట్‌కు వీరు 86 పరుగులు జత చేశారు. కుదురుకునేందుకు కాస్త సమయం తీసుకున్నా 14వ ఓవర్‌లో 17 రన్స్‌తో ఛేదన వైపు తీసుకెళ్లారు. స్పిన్నర్ షాబాజ్ ఓవర్‌లో రూథర్‌ఫోర్డ్ 4,6 షారుక్ 6తో 19 రన్స్ వచ్చాయి. తర్వాతి ఓవర్‌లోనే షారుక్ 4,6,4 బాదడంతో సమీకరణం 4 ఓవర్లలో 54కు చేరింది. దీంతో మ్యాచ్ ఇరువైపులా మొగ్గుచూపింది. కానీ ఓరౌర్కీ 17వ ఓవర్‌లో నాలుగు పరుగులే ఇచ్చి రూథర్‌ఫోర్డ్, తెవాటియా (2)ల వికెట్లు తీసి ఎల్‌ఎస్‌జీ శిబిరంలో జోష్ నింపాడు. 19వ ఓవర్‌లో షారుక్ కూడా వెనుదిరగ్గా, అప్పటికే సమీకరణం క్లిష్టంగా మారింది. ఆరు బంతుల్లో 38 పరుగులు చేయాల్సి రావడంతో టైటాన్స్ ఓటమి ఖాయమైంది.

టాపార్డర్ హవా: పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించడంతో టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఇన్నింగ్స్ దూసుకెళ్లింది. ఎప్పటిలాగే ఓపెనర్లు మార్ష్, మార్‌క్రమ్‌తో పాటు నికోలస్ పూరన్ అదరగొట్టాడు. ఆరంభంలో బంతి అనూహ్యంగా బౌన్స్ కాగా.. మార్ష్‌కు సైతం పలుమార్లు శరీరానికి బంతి తాకడంతో విలవిల్లాడాడు. పవర్‌ప్లేలో పెద్దగా మెరుపులు లేకపోవడంతో ఎల్ఎస్‌జీ 58 రన్స్‌తో ఫర్వాలేదనిపించింది. ఆ తర్వాత మార్ష్ జోరు పెంచాడు. ప్రసిద్ధ్ ఓవర్‌లో 4,6 బాదిన తను స్పిన్నర్ సాయి కిశోర్ ఓవర్‌లో సిక్సర్ సాధించాడు. అయితే చక్కగా కుదురుకున్న ఈ జోడీని పదో ఓవర్‌లో సాయి విడదీశాడు. మార్‌క్రమ్‌ను అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 91 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత మార్ష్-పూరన్ జోడీ టైటాన్స్ బౌలర్లపై విరుచుకుపడింది. పూరన్ తన తొలి బంతినే సిక్సర్‌గా మలిచాడు. ఇక స్పిన్నర్ రషీద్ తొలి ఓవర్‌లో మార్ష్ చెలరేగి 6,4,6,4,4తో 25 పరుగులు రాబట్టాడు. అటు కిశోర్ ఓవర్‌లో 4,6.. సిరాజ్ ఓవర్‌లో 4,6,4తో పూరన్ ఎదురుదాడికి దిగడంతో లఖ్‌నవూ స్కోరు రాకెట్ వేగంతో సాగింది. మరోవైపు మార్ష్ 56 బంతుల్లోనే శతకం పూర్తి చేసుకోగా.. 18వ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాది స్కోరును 200 దాటించాడు. ధాటిగా ఆడుతున్న ఈ ఓపెనర్‌ను అర్షద్ ఖాన్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 52 బంతుల్లోనే 121 పరుగుల మెరుపు భాగస్వామ్యానికి తెర పడింది. చివరి ఓవర్‌లో పంత్ (16 నాటౌట్) రెండు సిక్సర్లు బాది 20 రన్స్ అందించడంతో లఖ్‌నవూ స్కోరు 230 దాటింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	13	9	4	0	18	0.602
బెంగళూరు	12	8	3	1	17	0.482
పంజాబ్	12	8	3	1	17	0.389
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	13	6	6	1	13	0.019
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	13	5	6	2	12	0.193
హైదరాబాద్	12	4	7	1	9	-1.005
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: మార్‌క్రమ్ (సి) షారుక్ (బి) సాయి కిశోర్ 36; మార్ష్ (సి) రూథర్‌ఫోర్డ్ (బి) అర్షద్ ఖాన్ 117; పూరన్ (నాటౌట్) 56; **పంత్ (నాటౌట్) 16; ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 235/2.** వికెట్ల పతనం: 1-91, 2-212; **బౌలింగ్:** సిరాజ్ 4-0-37-0; అర్షద్ 3-0-36-1; రబాడ 4-0-45-0; ప్రసిద్ధ్ 4-0-44-0; సాయికిశోర్ 3-0-34-1; రషీద్ 2-0-36-0.

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) మార్‌క్రమ్ (బి) ఓ రౌర్కీ 21, గిల్ (సి) సమద్ (బి) అవేశ్ 35, బట్లర్ (బి) ఆకాశ్ సింగ్ 33, రూథర్‌ఫోర్డ్ (సి-సబ్) బిష్ణోయ్ (బి)ఓ రౌర్కీ 38, షారుక్ (సి-సబ్) బిష్ణోయ్ (బి) అవేశ్ 57, తెవాటియా (సి) హిమ్మత్ సింగ్ (బి) ఓ రౌర్కీ 2, అర్షద్ (సి) ఓ రౌర్కీ (బి) షాబాజ్ 1, రషీద్ ఖాన్ (నాటౌట్) 4, రబాడ (బి) బదోని 2, సాయి కిశోర్ (బి) బదోని 1, **ఎక్స్‌ట్రాలు 8, మొత్తం: 20 ఓవర్లలో 202/9; వికెట్లపతనం:** 1-46, 2-85, 3-96, 4-182, 5-186, 6-193, 7-197, 8-200, 9-202; **బౌలింగ్:** ఆకాశ్ సింగ్ 3.1-0-29-1, ఆకాశ్ దీప్ 4-0-49-0, ఓ రౌర్కీ 4-0-27-3, అవేశ్ ఖాన్ 3.5-0-51-2; షాబాజ్ 4-0-41-1, బదోని 1-0-4-2.

ఒకే సీజన్‌లో ఎక్కువ మంది (9) 500+ స్కోర్లు సాధించడం ఐపీఎల్‌లో ఇదే తొలిసారి.

1 ఓ సీజన్‌లో 25 అంతకంటే తక్కువ బంతుల్లోనే ఎక్కువ (5) ఫిఫ్టీలు సాధించిన బ్యాటర్‌గా పూరన్.

క్వార్టర్స్‌లో శ్రీకాంత్

కపిల-తనీషా జోడీ కూడా ● మలేసియా మాస్టర్స్





కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్‌లో భారత షట్లర్ కిడాంబి శ్రీకాంత్ క్వార్టర్స్‌కు చేరుకోగా.. హెచ్‌ఎస్ ప్రణయ్ రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో శ్రీకాంత్ 23-21, 21-17తో ఎన్‌గుయన్ (ఐర్లాండ్)పై చెమటోడ్చి గెలిచాడు. ప్రణయ్ 9-21, 18-21తో యుషి తనాక (జపాన్) చేతిలో, సతీష్ కుమార్ కరుణాకరన్ 14-21, 16-21తో క్రిస్టో పోపోవ్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం పాలయ్యారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో 21-17, 18-21, 21-15తో ఫ్రాన్స్‌కు చెందిన జూలియన్ మయోా-లి పలెర్మోపై గెలిచి ముందంజ వేసింది. మహిళల డబుల్స్‌లో ప్రేరణ అల్వేకర్-మృణ్మయి దేశ్‌పాండే జంట 9-21, 14-21తో హసు హుయ్-లిన్ జి యున్ చేతిలో ఓడింది.



రైజాకు రజతం

సుల్ (జర్మనీ): ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్‌కప్‌లో భారత షూటర్ రైజా దిల్లాన్ రజతం సాధించింది. గురువారం జరిగిన మహిళల స్కీట్ 60 షాట్ల ఫైనల్లో ఒలింపియన్ రైజా 51 టార్గెట్లను గురి చూసి కొట్టింది. ఫోబీ బాడ్లీ స్కాట్ (బ్రిటన్) స్వర్ణం, అనబెల్లా హెట్మర్ (జర్మనీ) కాంస్యం సాధించారు.

ముంబైకి పెనాల్టీగా నోబాల్

ముంబై: ముంబై ఇండియన్స్-ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య బుధవారం జరిగిన మ్యాచ్‌లో నోబాల్‌ను పెనాల్టీగా విధించారు. ఐదో ఓవర్ మూడో బంతి వేసే సమయంలో ఆఫ్‌సైడ్‌లో కేవలం ముగ్గురు ఫీల్డర్లు మాత్రమే ఉన్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. ఎంసీసీ నిబంధనల ప్రకారం బంతి వేసే సమయానికి లెగ్‌సైడ్ వైపు ఐదుగురికి మించి ఉండరాదు. అయితే ఆ సమయంలో ఆరుగురు ఫీల్డర్లు ఉండడంతో అంపైర్ నోబాల్‌ను పెనాల్టీగా విధించాడు.



ఒకే పార్శ్వంలో జొకో, సిన్నర్

25 నుంచి ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో మాజీ చాంపియన్ నొవాక్ జొకోవిచ్‌కు కఠినమైన డ్రా ఎదురైంది. వరల్డ్ నెం.1 జానిక్ సిన్నర్, గతేడాది రన్నరప్ అలెగ్జాండర్ జ్వెరెవ్, జొకోవిచ్ ఒక పార్శ్వంలో తలపడనున్నారు. గురువారం సింగిల్స్ మెయిన్ డ్రాను నిర్వాహకులు విడుదల చేశారు. డిఫెండింగ్ చాంప్, వరల్డ్ నెం.2 కార్లోస్ అల్కారజ్ (స్పెయిన్) తొలి రౌండ్‌లో నిషికోరితో, అమెరికా ఆటగాడు మెకెంజీ మెక్‌డొనాల్డ్‌తో జొకోవిచ్ తలపడనున్నారు. జొకో ముందంజ వేస్తే క్వార్టర్స్‌లో జ్వెరెవ్.. అదీ దాటితే సెమీస్‌లో సిన్నర్‌తో అమీతుమీ తేల్చుకోవాల్సి రావచ్చు. మహిళల డ్రాలో డిఫెండింగ్ చాంప్ ఇగా స్వియటెక్ తొలి రౌండ్‌లో రెబెక్కా శ్రమ్‌కోవాతో తలపడనుంది. అయితే, క్వార్టర్స్ చేరితే గతేడాది రన్నరప్ పౌలినీతో స్వియటెక్ ఆడే అవకాశం ఉంటుంది.

బిజినెస్



బజాజ్ చేతికి కేటీఎం?

మెజారిటీ వాటాల కొనుగోలుకు ప్రయత్నాలు

న్యూఢిల్లీ: రుణాల ఊబిలో కూరుకుపోయి కష్టాలు పడుతున్న ఆస్ట్రియాకు చెందిన బైక్‌ల తయారీ కంపెనీ కేటీఎంలో మెజారిటీ వాటాలు కొనుగోలు చేయాలనుకుంటున్నట్టు బజాజ్ ఆటో ప్రకటించింది. తమ పూర్తి యాజమాన్య సంస్థ బజాజ్ ఆటో ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ బీవీ ద్వారా ఈ కొనుగోలు చేయాలనుకుంటున్నట్టు వెల్లడించింది. ఇందుకోసం ఇప్పటికే 80 కోట్ల యూరోల (రూ.7,765 కోట్లు) రుణ ప్యాకేజి సమకూర్చినట్టు తెలిపింది. అన్ని రకాల అనుమతులు సాధించినట్టయితే కేటీఎంలో ప్రస్తుతం మైనారిటీ వాటాలున్న బజాజ్ మెజారిటీ వాటాలతో ఆ కంపెనీ యజమానిగా మారుతుందని ఆ ప్రకటనలో పేర్కొంది. ఉమ్మడి అభివృద్ధి కార్యక్రమం కింద భారత్ కేంద్రంగా నిర్వహిస్తున్న కేటీఎం వ్యాపారాల్లో వేగం పెంచే కృషిని కొనసాగిస్తామని బజాజ్ తెలిపింది. ఈ కార్యక్రమం కింద ఉభయ సంస్థలు ఉమ్మడిగా బైక్‌ల అభివృద్ధి, తయారీ, విక్రయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 80 దేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. కేటీఎం రుణ పునర్నిర్మాణానికి, వ్యాపారాల కొనసాగింపునకు తాము సమకూర్చిన నిధులు ఉపయోగపడతాయని కంపెనీ ఆ ప్రకటనలో తెలిపింది. ఆ 80 కోట్ల యూరోల్లో 20 కోట్ల యూరోలు ఇప్పటికే అందించామని, మిగతా సొమ్మును త్వరలో సమకూరుస్తామని కూడా పేర్కొంది. అత్యంత కీలక దశలో నిధులు సమకూర్చడంతో పాటు యాజమాన్య బాధ్యతలు కూడా చేపట్టడం ద్వారా కేటీఎం భవిష్యత్తును నిర్దేశించగల శక్తిగా బజాజ్ నిలుస్తుందని కంపెనీ తెలిపింది.

అదానీ లాభాల పంట



రూ.90,000 కోట్లకు చేరిన స్థూల లాభం

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ కంపెనీలు మార్చి 31వ తేదీతో ముగిసిన 2025 ఆర్థిక సంవత్సరంలో లాభాల మోత మోగించాయి. గ్రూప్ కంపెనీలన్నింటి స్థూల లాభం రూ.90,000 కోట్లకు చేరింది. 21 నెలల పాటు రుణాలు చెల్లించేందుకు అవసరమైన నగదు నిల్వ జమ అయింది. ఆరేళ్లలో గ్రూప్ స్థూల లాభాలు మూడింతలు పెరిగి రూ.24,870 కోట్ల నుంచి (2018-19) రూ.89,806 కోట్లకు (2024-25) చేరినట్టు కంపెనీ ప్రకటించింది. 2024 ఆర్థిక సంవత్సరంతో ఆర్జించిన రూ.82,976 కోట్లతో పోల్చితే లాభం 8.2% పెరిగింది. ఆరేళ్ల కాలంలో (2019-2025) 24% సమీకృత వార్షిక వృద్ధి (సీఏజీఆర్) నమోదయింది. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రూప్ కంపెనీలు రూ.40,565 కోట్ల నికర లాభం ఆర్జించాయి. నికర లాభం ఆరేళ్ల సీఏజీఆర్ 48.5% ఉంది. ఇదే కాలంలో కంపెనీ స్థూల ఆస్తులు 25% సీఏజీఆర్‌తో రూ.6,09.133 లక్షల కోట్లకు చేరాయి. స్థూల రుణాలు 2024 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే రూ.2.41 లక్షల కోట్ల నుంచి రూ.2.9 లక్షల కోట్లకు చేరాయి. రూ.53,843 కోట్ల నగదు నిల్వను కూడా పరిగణనలోకి తీసుకుంటే గ్రూప్ కంపెనీల నికర రుణభారం రూ.2.36 లక్షల కోట్లుగా నమోదయింది.

ఆస్తులపై రాబడులు (ఆర్‌ఓఏ) 16.5 శాతంగా ఉన్నాయి. ప్రపంచంలో మౌలిక వసతుల రంగంలోని కంపెనీల్లో గరిష్ఠ ఆర్‌ఓఏ ఇదేనని గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రాబీ సింగ్ తెలిపారు. లాభాల్లో అద్భుత వృద్ధి కారణంగా స్థూల లాభాల్లో రుణాల వాటా 2019 నాటి 3.8% నుంచి 2025 ఆర్థిక సంవత్సరం నాటికి 2.6 శాతానికి తగ్గింది. స్థూల లాభాల్లో 82% మౌలిక వసతుల విభాగం నుంచే వచ్చినట్టు ఆయన చెప్పారు. అదానీ గ్రూప్ మౌలిక వసతుల విభాగంలో యుటిలిటీ కంపెనీలు అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ పవర్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ టోటల్ గ్యాస్; రవాణా కంపెనీలు అదానీ పోర్ట్స్, సెజ్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఉన్నాయి. పన్ను చెల్లింపుల అనంతర నగదు నిల్వ 13.6% వృద్ధితో రూ.66,527 కోట్లున్నదని, భారీ నగదు ప్రవాహం కారణంగా రికార్డు స్థాయిలో రూ.1.26 లక్షల కోట్ల ఆస్తులు జోడయ్యాయని రాబీ సింగ్ తెలిపారు. అదానీ పోర్ట్‌ఫోలియోలో ఇంత భారీగా ఆస్తులు జోడు కావడం ఇదే ప్రథమమని పేర్కొంటూ దీని వల్ల మొత్తం ఆస్తుల విలువ రూ.6.1 లక్షల కోట్లకు చేరినట్టు ఆయన వెల్లడించారు. ఈ మొత్తంలో నాలుగింట మూడు వంతుల ఆస్తులు గల ఆరేళ్ల కాలంలోనే జోడయ్యాయన్నారు.

ఐటీసీ లాభాలు అంతంతే

క్యూ4 లాభం రూ.6,416.85 కోట్లు



న్యూఢిల్లీ: మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో ఐటీసీ లిమిటెడ్ లాభాలు నామమాత్రంగానే పెరిగాయి. ఈ కాలానికి కంపెనీ రూ.18,266 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.6,416.85 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 9.2 శాతం పెరిగినా నికర లాభంలో వృద్ధి మాత్రం రెండు శాతమే ఉంది. ఆదాయం భారీగా పెరగడానికి ఐటీసీ హోటల్స్ విభజన (డీమెర్జర్) ద్వారా సమకూరిన రూ.15,179 కోట్ల రాబడి ప్రధానంగా దోహదం చేసింది. అనుబంధ కంపెనీలను మినహాయించి (స్టాండ్ అలోన్) చూసినా క్యూ4లో ఐటీసీ ఆర్థిక ఫలితాలు అంత ఆశాజనకంగా లేవు. ఈ కాలానికి కంపెనీ రూ.17,248 కోట్ల ఆదాయంపై రూ.4,874 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 9.6 శాతం పెరిగినా నికర లాభం మాత్రం 0.8 శాతం మాత్రమే పెరిగింది.

ఆర్థిక సంవత్సరం మొత్తానికి

2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా రూ.73,465 కోట్ల ఆదాయంపై ఐటీసీ రూ.20,092 కోట్ల నికర లాభం నమోదు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయం 10.2 శాతం పెరిగినా, నికర లాభం మాత్రం నామమాత్రంగా రూ.182 కోట్లు మాత్రమే పెరిగింది. ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోవడం, డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండడం ఇందుకు ప్రధాన కారణమని కంపెనీ తెలిపింది.

ఒక్కో షేరుపై రూ.7.85 చొప్పున డివిడెండ్

ఆర్థిక ఫలితాలు అంతంత మాత్రంగానే ఉన్నా వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.7.85 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని ఐటీసీ బోర్డు సిఫారసు చేసింది. ఈ ఏడాది మార్చిలో ప్రకటించిన రూ.6.5 మధ్యంతర డివిడెండ్‌ను కూడా కలిపితే 2024-25 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ ఒక్కో షేరుపై వాటాదారులకు రూ.14.35 చొప్పున డివిడెండ్ చెల్లించినట్టవుతుంది. రూపాయి ముఖ విలువ ఉన్న కంపెనీ షేర్లపై ఇది 1,435 శాతానికి సమానం.

త్వరలోనే ఎన్ఎస్ఈ ఐపీఓ

న్యూఢిల్లీ: ఎన్ఎస్ఈ ఐపీఓకు త్వరలోనే మార్గం సుగమం అయ్యే అవకాశం ఉందని సెబీ చీఫ్ తుహిన్ కాంత పాండే చెప్పారు. అయితే ఎప్పటిలోగా సెబీ నుంచి ఇందుకు అనుమతి లభిస్తుందనే విషయాన్ని చెప్పేందుకు నిరాకరించారు. ఢిల్లీలో అసోచాం నిర్వహించిన ఒక సదస్సుకు హాజరైన ఆయన విలేకరుల ప్రశ్నలకు స్పందిస్తూ ఐపీఓకు నిరభ్యంతర పత్రం జారీ చేసేందుకు తాము లేవనెత్తిన అభ్యంతరాలపై ఎన్ఎస్ఈతో చర్చిస్తున్నామన్నారు. సెబీ అభ్యంతరాలతో ఎన్ఎస్ఈ ఐపీఓ గత ఎనిమిదేళ్లుగా పెండింగ్‌లో ఉంది.

13 కోట్లు దాటిన మార్కెట్ ఇన్వెస్టర్లు

దేశాభివృద్ధికి క్యాపిటల్ మార్కెట్ ప్రస్తుతం ఇంధనంలా మారిందని సెబీ చీఫ్ అన్నారు. దేశంలో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే మదుపరుల సంఖ్య ప్రస్తుతం 13 కోట్లు దాటిపోయిందన్నారు. 2019 మార్చితో పోలిస్తే ఇది మూడింతలు ఎక్కువన్నారు. 1996-2010 మధ్య పుట్టిన ప్రతి ముగ్గురు జనరేషన్-జెడ్ యువతలో ఒకరు ఈక్విటీ లేదా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెడుతున్నట్టు వెల్లడించారు. ఇండస్ఇండ్ బ్యాంకు ఉన్నతోద్యోగుల భారీ అక్రమాలపై తాము కూడా దృష్టి పెట్టినట్టు ఆయన తెలిపారు.



మార్కెట్లోకి కొత్త ఆల్ట్రోజ్

టాటా మోటార్స్ అత్యంత ప్రజాదరణ పొందిన ఆల్ట్రోజ్ కారు కొత్త వెర్షన్‌ను మార్కెట్లోకి తెచ్చింది. సరికొత్త హంగులతో తయారుచేసిన ఈ కారు ప్రారంభ ధర రూ.6.89 లక్షలు కాగా హై ఎండ్ వెర్షన్ ధర రూ.11.49 లక్షలు. ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఐదు ఆకర్షణీయమైన రంగుల్లో ఇది అందుబాటులో ఉంటుంది. ప్రీమియం డిజైన్, అసాధారణ భద్రతా ఫీచర్లు, అత్యాధునిక టెక్నాలజీ దీని ప్రత్యేకతలని కంపెనీ తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

23వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	530
వరంగల్	502	గోదావరి	517
చిత్తూరు	613	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	119
వరంగల్	120	గుంటూరు	122
కరీంనగర్	120	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	111
కర్నూలు	120	నెల్లూరు	116
విశాఖపట్నం	116	అనంతపురం	116
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,910 ▲	89,650 ▲	1,12,000 ▲
విజయవాడ	98,500 ▼	92,500 ▼	99,200 ▼
విశాఖపట్నం	99,020 ▲	89,750 ▲	1,12,000 ▲
రాజమండ్రి	97,910 ▲	89,750 ▲	1,00,300 ▼
ప్రొద్దుటూరు	96,600 ▲	88,770 ▲	1,00,000 ▲
ముంబై	95,516 ▲	87,493 ▲	96,519 ▼

అమ్మకాల ఒత్తిడితో కుంగిన మార్కెట్

ముంబై: అమెరికా, జపాన్ దేశాల బాండ్లపై రాబడులు పెరిగిన నేపథ్యంలో ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన ప్రతికూల సంకేతాల నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలను చవి చూశాయి. రిస్క్ తీసుకోవడానికి విముఖత ప్రదర్శించిన ఇన్వెస్టర్లు భారీ స్థాయిలో అమ్మకాలు సాగించారు. ఐటీ, ఆయిల్, ఎఫ్ఎంసీజీ షేర్లలో అమ్మకాల జోరుతో సెన్సెక్స్ 644.64 పాయింట్ల నష్టంతో 80,951.99 వద్ద ముగిసింది. ఇండస్ ఇండ్ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు మినహా సెన్సెక్స్‌లోని 27 కంపెనీల షేర్లు నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ ఒక దశలో 1106.71 పాయింట్లు నష్టపోయి 80,489.92 పాయింట్ల ఇంట్రాడే కనిష్ఠ స్థాయిని తాకింది. నిఫ్టీ 203.75 పాయింట్ల నష్టంతో 24,609.70 వద్ద ముగిసింది. అమెరికన్ బాండ్లపై రాబడులు 5% స్థాయిని, జపాన్ బాండ్లపై రాబడులు 3.5% స్థాయిని దాటడంతో రిస్క్‌తో ముడిపడి ఉన్న షేర్లను ఇన్వెస్టర్లు భారీ సంఖ్యలో విక్రయించడం ప్రపంచ మార్కెట్లన్నింటినీ కుంగదీసిందని విశ్లేషకులంటున్నారు.

బ్లూవాటర్ లాజిస్టిక్స్ ఇష్యూ ధర రూ.132-135: హైదరాబాద్‌కు చెందిన బ్లూవాటర్ లాజిస్టిక్స్ లిమిటెడ్ ఇష్యూ వచ్చే మంగళవారం ప్రారంభం కాబోతోంది. షేర్ల ధర శ్రేణిని కంపెనీ రూ.132-135గా ప్రకటించింది. ఇష్యూ ద్వారా రూ.40.50 కోట్లు సమీకరించాలన్నది లక్ష్యంగా తెలిపింది. షేర్లను ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫారంపై లిస్టింగ్ చేస్తారు. ఇష్యూ గురువారం ముగుస్తుంది. ఒక్కోటి రూ.10 ముఖవిలువ గల 30 లక్షల ఈక్విటీ షేర్లను బుక్ బిల్డింగ్ విధానంలో విడుదల చేస్తారు. రిటైల్ ఇన్వెస్టర్లకు 10.10 లక్షల ఈక్విటీ షేర్లను రిజర్వ్ చేశారు.

ఇండస్ ఇండ్‌ను ఆదుకునేందుకు సిద్ధం: అశోక్ హిందుజా

న్యూఢిల్లీ: ఉన్నతోద్యోగుల అక్రమాలతో కష్టాల్లో ఉన్న ఇండస్ఇండ్ బ్యాంకును ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు హిందుజా గ్రూప్ ప్రకటించింది. అవసరమైతే బ్యాంకుకు మరిన్ని నిధులు సమకూర్చేందుకూ సిద్ధంగా ఉన్నట్టు బ్యాంకు ప్రమోటర్ కంపెనీ ఐఐహెచ్ఎల్ చైర్మన్ అశోక్ హిందుజా ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల అక్రమాలతో బయటపడిన నష్టాన్ని సరిదిద్దేందుకు బ్యాంకు తాత్కాలిక మేనేజ్‌మెంట్ వేగంగా తీసుకుంటున్న చర్యలను ఆయన ప్రశంసించారు.

కోలుకున్న షేర్లు: క్యూ4 ఆర్థిక ఫలితాలతో ఇండస్ఇండ్ బ్యాంకు షేర్లు బీఎస్ఈలో గురువారం తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బ్యాంకును ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్న హిందుజా గ్రూప్ ప్రకటనతో కోలుకుంది. చివరికి 1.82 శాతం లాభంతో రూ.785.10 వద్ద ముగిసింది.

అమెరికాలో కొండెక్కిన వడ్డీ రేట్లు

న్యూయార్క్: అమెరికాలో వడ్డీ రేట్లు మరింత కొండెక్కాయి. ఆ దేశ కేంద్ర బ్యాంకు 20 సంవత్సరాల కాల పరిమితి ఉండే 1600 కోట్ల డాలర్ల కేంద్ర ప్రభుత్వ రుణపత్రాలను వేలానికి పెడితే మదుపరుల నుంచి పెద్దగా స్పందన లభించలేదు. దాంతో 30 ఏళ్ల కాలపరిమితి ఉండే ప్రభుత్వ రుణ పత్రాలపై వడ్డీరేటు 5.12 శాతానికి, ఇరవై సంవత్సరాల కాల పరిమితి ఉండే రుణ పత్రాలపై వడ్డీరేటు 5.13 శాతానికి చేరాయి. పదేళ్ల కాల పరిమితి రుణ పత్రాలపై చెల్లించే వడ్డీరేటు కూడా 4.6 శాతానికి చేరింది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



7

రాష్ట్రంలో మళ్లీ కరోనా

విశాఖలో తొలి కేసు నమోదు

28 ఏళ్ల మహిళకు కొవిడ్-19 నిర్ధారణ

శుక్రవారం | 23-5-2025 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

కిక్కుపై కట్టుకథలు!

స్కామే జరగలేదని బుకాయింపు

అసలు ప్రశ్నలకు జవాబివ్వని జగన్

జే-బ్రాండ్లతో జనాన్ని బాదింది ఆయనే

ఇప్పుడున్న బ్రాండ్లపై నానా యాగీ

అవన్నీ ప్రముఖ కంపెనీల ఉత్పత్తులే

రాజ్ కసిరెడ్డికి సంబంధమే లేదట?

మా వాళ్లంతా మంచోళ్లు!

- మద్యం స్కామ్‌తో వాళ్లకేం సంబంధం?
- అసలు.. కుంభకోణం ఎక్కడ జరిగింది?
- సాయిరెడ్డి చంద్రబాబుకు అమ్ముడుపోయాడు
- వాసుదేవరెడ్డిని బెదిరించి వాంగ్మూలం తీసుకున్నారు
- బాలాజీ గోవిందప్ప నాకోసం ఎందుకు పని చేస్తారు?
- పీఎస్సార్, ధనుంజయ్ రెడ్డి మంచి అధికారులు
- నేను ఇక్కడే ఉన్నా.. అరెస్టు చేసుకోవచ్చు
- వెన్నుపోటు దినంగా 'జూన్ 4': వైఎస్ జగన్

11



జగన్ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్స్ ఎందుకు స్వీకరించలేదు? కొన్ని డిస్టిలరీలకు మాత్రమే ఎక్కువ ఆర్డర్లు ఎందుకు వెళ్లాయి? పాపులర్ బ్రాండ్లు ఎందుకు మాయమయ్యాయి? మాయదారి మందు ఎందుకు ప్రత్యక్షమైంది? తెలంగాణలో పోల్చితే ఏపీలో కొనుగోలు ధర ఎక్కువ ఉండటానికి కారణమేవిటి? 'ఆటోమేటిక్'గా మద్యం ఆర్డర్లను పెట్టే సాఫ్ట్‌వేర్ తీసేసి.. మాన్యువల్ విధానం ఎందుకు తెచ్చారు? ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు! కానీ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ వీటన్నింటినీ పక్కన పెట్టేశారు. తన హయాంలో మద్యం స్కామే జరగలేదని చెప్పుకొచ్చారు.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

గురువారం రెండు గంటలకుపైగా సాగిన ప్రెస్‌మీట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుపై జగన్ అనేక ఆరోపణలు గుప్పించారు. సిరి క్లాసిక్ బ్లూ ఫైనెస్ట్ విస్కీ, గ్రేసన్స్ సిల్వర్ స్ట్రిప్స్, రాయల్ ప్యాలెస్ బ్రాందీ, ఓల్డ్ టైమర్ బ్లూ క్లాసిక్ విస్కీ, గ్రేసన్స్ కింగ్స్‌వెల్ బ్రాందీ... ఇలా ఊరూపేరులేని జే బ్రాండ్లను మద్యంప్రియులకు అంటగట్టిన జగన్... నేడు మార్కెట్‌లో ఉన్న మద్యం బ్రాండ్ల ఫొటోలు చూపిస్తూ

మిగతా 12వ పేజీలో...

అడ్డంగా.. అబద్ధాలు!

- భారతి సిమెంట్స్‌లో బాలాజీ ఫుల్‌టైమ్ డైరెక్టర్
- అయినా.. ఆయనెవరో తెలియనట్లు బిల్డప్
- 'ఉర్సా'కు అరకోటి, కోటి చొప్పున భూమి
- అది తెలిసీ.. ఇడ్లీ, వడ అంటూ కబుర్లు
- నాడు ఐఏఎస్, ఐపీఎస్‌లపై వేధింపులు
- అవి మరిచి.. నేడు ఆవేదన, ఆక్రోశం

11

నిజం దాచి.. నిందలు!

ప్రెస్‌మీట్‌లో జగన్ విన్యాసాలు

అప్పుల గొప్పలు.. జగన్ తిప్పలు!

- చంద్రబాబు ఐదేళ్లలో 2,49,530 కోట్లు తెస్తే నేను రూ.3,32,671 కోట్లు తెచ్చా: మాజీ సీఎం
- ఇందులో ఏది ఎక్కువో ఆయనకు తెలుసా?
- ఇంగ్లీషులో చదివేదొకటి.. వివరించేది మరొకటి
- వాస్తవాలు దాచి ప్రజలను మభ్యపెట్టే యత్నం



పాక్‌ను మోకాళ్లపై

కూర్చోబెట్టాం!

- ఇక ప్రతి ఉగ్ర దాడికీ మూల్యం చెల్లించక తప్పదు
- నా ఒంట్లో ప్రవహించేది రక్తం కాదు.. సిందూరం
- సిందూరం గన్‌పౌడర్‌గా మారితే ఏమవుతుందో మన శత్రువులు ప్రత్యక్షంగా చూశారు
- రహీంఖాన్ ఎయిర్‌బేస్ ఇంకా ఐసీయూలోనే..
- రాజస్థాన్ బికనేర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఎద్దేవా
- 'ఆపరేషన్ సిందూర్' తర్వాత తొలి బహిరంగ సభ

బికనేర్, మే 22: 'మన సాయుధ బలగాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. త్రివిధ దళాలు ఎలాంటి చక్రవ్యూహం పన్నాయంటే.. వాటి దెబ్బకు పాకిస్థాన్ మోకరిల్లింది' అని ప్రధాని మోదీ అన్నారు. ఇక ప్రతి ఉగ్రవాద దాడికి ఆ దేశం భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. తన ఒంట్లో ప్రవహించేది రక్తం కాదని.. వేడి సిందూరమని స్పష్టం చేశారు. మహిళల సిందూరం గన్‌పౌడర్‌గా మారితే ఏమవుతుందో శత్రువులు కళ్లారా చూశారని అన్నారు. 'ఆపరేషన్

మిగతా 9వ పేజీలో...

అమెరికాలో ఇజ్రాయెలీల కాల్చివేత

- యూదు మ్యూజియం వద్ద ఘటన
- మృతులిద్దరూ కాబోయే దంపతులు

9

లిక్కర్ సిరీస్‌పై జగన్‌కు

భయం పట్టుకుంది



- అందుకే మీడియా సమావేశం
- నిజాలు తేలేందుకు విచారణ కోరాలి
- ఆదాయం ఎటుపోయిందో చెప్పాలి
- దర్యాప్తునకు సిద్ధపడటం లేదంటే తప్పు చేశారనే అర్థం: షర్మిల

11



10

హస్తిన చేరిన చంద్రబాబు

- నేడు ఏడుగురు కేంద్ర మంత్రులతో భేటీలు
- రాష్ట్రాభివృద్ధికి సాయం కోరనున్న సీఎం
- రేపు నీతి ఆయోగ్ కౌన్సిల్ భేటీకి హాజరు

మద్యంలో మరో లీల

కాఫీ షాపు వర్కర్ 'లిక్కర్ కథ' ఇదీ

ఒక కాఫీ షాపులో 32 వేల జీతానికి పనిచేసే యువకుడు ఐదేళ్లలో ఏకంగా రూ.459 కోట్లు సంపాదించాడు! ఇది కలా...సినిమా కథా... అనుకుంటున్నారా!? ఇవేవీ కాదు! జగన్ హయాంలో జరిగిన మద్యం 'లీల'ల్లో ఇదీ ఒకటి. బాగా నడిచే 'లీల డిస్టిలరీస్'ను నాడు చెరబట్టారు. ఆ తర్వాత... తమ చెత్త బ్రాండ్ల ఉత్పత్తులకు దానిని కేరాఫ్‌గా మార్చారు. ఆ డిస్టిలరీస్ ఏపీ ఇన్‌చార్జిగా కాఫీషాప్ వర్కర్‌ను నియమించారు. అతని పేరే... పురుషోత్తం వరుణ్ కుమార్! ప్రస్తుతం అతను అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు!

32 వేల జీతం.. 459 కోట్ల అక్రమార్జన!

- అందులో అత్యధికం నాటి ప్రభుత్వ పెద్దలకే
- ఎన్ఆర్ఐ డాక్టర్ ద్వారా మద్యం మాఫియాలో
- లీలా డిస్టిలరీస్‌లో చేరి.. ఏపీ ఇన్‌చార్జిగా ఎదిగి!
- మాఫియా అండతో చెత్తబ్రాండ్ల అమ్మకాలు
- ప్రభుత్వం మారగానే పరార్.. గాలిస్తున్న సిట్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒక సాధారణ యువకుడిని తెరపైకి తెచ్చి... అతని ద్వారా వేలకోట్ల వ్యాపారం చేయించి... వందల కోట్లు ఆర్జించి... అందులో అత్యధికం తామే మింగేయడం! ఇది... లిక్కర్ స్కామ్‌లో మరో కోణం. ఇందుకు... హైదరాబాద్‌కు చెందిన పురుషోత్తం వరుణ్ కుమార్ అనే యువకుడిని వాడుకున్నారు. గత ప్రభుత్వంలో ఓ డిస్టిలరీ బాధ్యతలు అప్పగించడంతో అతను చెలరేగిపోయాడు. ఐదేళ్లలో వరుణ్ ఏకంగా రూ.459 కోట్లు ఆర్జించాడు. ఇందులో

మిగతా 12వ పేజీలో...

తెలుగు మేజర్‌కు కీర్తిచక్ర

- సిక్కోలు వాసి రాంగోపాలనాయుడుకు అరుదైన గౌరవం
- నేవీ అధికారి కపిల్ యాదవ్‌కు శౌర్యచక్ర
- రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా ప్రదానం

6



రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా కీర్తిచక్ర అవార్డు అందుకుంటున్న మేజర్ రాంగోపాలనాయుడు



9

బీజేపీపై రెండే నిమిషాలా?

బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌కు కవిత 7 పేజీల లేఖాస్త్రం

- వరంగల్ సభలో ఆ పార్టీని ఇంకా టార్గెట్ చేసి ఉండాల్సింది డాడీ
- అలా చేయకపోవడం వల్ల భవిష్యత్తులో వారితో పొత్తు పెట్టుకుంటారనే ఊహాగానాలు వస్తున్నాయి
- బీజేపీ మనకు ప్రత్యామ్నాయం అవుతుందేమో అని మన పార్టీ కార్యకర్తలే అనుకుంటున్నారు
- ధూం ధాం విఫలమైంది.. 2001 నుంచి మీతో ఉన్నవారితో సభలో మాట్లాడించాల్సింది
- కొందర్నే మీరు కలుస్తున్నారు.. అందర్నీ కలవండి



టాలెంట్ ఫినాలే సందర్భంగా డాన్స్ చేస్తున్న ప్రపంచ సుందరి పోటీదారులు

ఐటీ ఇలాకాలో బ్యూటీల తడాఖా

- శిల్పారామంలో ప్రపంచ సుందరి పోటీదారుల ఆటాపాటా
- టాలెంట్ ఫినాలేలో 24 మంది ఫైనలిస్టుల పోటాపోటీ
- 'ఢోల్ బాజే'.. పాటకు ఆకట్టుకున్న నందినీ గుప్తా నృత్యం
- 'రాను.. బొంబైకి రాను' పాటకు నైజీరియా భామ స్టెప్పులు

9



శ్రీకాకుళం జిల్లా రావివలస గ్రామస్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్

గ్రామాభివృద్ధిలో భాగస్వాములవ్వండి

- ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ పిలుపు.. రావివలస గ్రామస్థులతో 'మాటామంతీ'
- వివిధ సమస్యల పరిష్కారానికి చర్యలు.. అభివృద్ధి పనులకు రూ.15 కోట్ల నిధులు

టెక్కలి, మే 22 (ఆంధ్రజ్యోతి): 'గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం. ఉన్నత స్థాయిలో ఉన్న స్థానికులు ఊరిని మర్చిపోకూడదు. గ్రామాభివృద్ధికి కృషి చేయాలి' అని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం

మిగతా 10వ పేజీలో...

సనాతన ధర్మం మతోన్మాదం కాదు: పవన్

మొక్కలు నాటడం జీవన విధానంలో భాగం కావాలి

జంగు నవీన్, సజ్జా నాగేశ్వర్‌రావు

ఎన్‌కౌంటర్‌లో మృతి

- మొత్తం 27 మంది వివరాలు ప్రకటించిన ఛత్తీస్‌గఢ్ పోలీసులు
- నంబాల కేశవరావు బృందం మొత్తం తుడిచిపెట్టుకుపోయిందని వెల్లడి

6

సుకుమాలో పేలిన ఐఈడీ..

జవాన్ దుర్మరణం

కొడాలి నానిపై


లుక్ అవుట్ నోటీసులు

ఎయిర్‌పోర్టులు, ఓడరేవులకు ఆన్‌లైన్‌లో అలర్ట్

12

ఇది మొదటి అడుగే

ప్రతి జిల్లాలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ ఆదిత్య



- మున్సిపల్, తుడా నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించాం
- మహిళలకు భద్రత కోసం పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు
- ఇళ్ల పట్టాల సమస్యనూ పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే ఆరణి
- తిరుపతి జీవకోనలో 'అక్షరమే అండగా..' సభ

రూ.1.06 కోట్లతో అభివృద్ధి పనులకు భూమి పూజ

7


శ్రీశైలం జలాశయం సమీపాన మరో జల విద్యుత్కేంద్రం!

యాప్రాన్ వద్ద కడితే 'ప్లంజ్‌పూల్' ముప్పుండదు

సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తల సూచన

7

అన్ని హద్దులూ దాటేశారు



- తక్షణమే దర్యాప్తును నిలిపివేయండి
- కొంతమంది చేసిన ఉల్లంఘనకు సంస్థపై చర్యలెలా తీసుకుంటారు
- తమిళనాడు మద్యం వివాదంలో ఈడీపై సుప్రీం ఆగ్రహం
- కక్ష సాధింపునకే ఈడీ ప్రయోగం.. ఎన్నికల దృష్టితో వ్యవహరిస్తున్న కేంద్రం.. పిటిషన్‌లో తమిళనాడు ఆరోపణ

9

సద్గురు ధ్యానంతో..

చలాకీ మెదడు



- మస్తిష్క వృద్ధాప్యానికి మెడిటేషన్‌తో చెక్
- సంయమ సాధనతో 5.9 ఏళ్లు వెనక్కి.
- సద్గురు అభివృద్ధి చేసిన టెక్నిక్ సత్ఫలితాలు
- హార్వర్డ్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

9

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇదేమి మర్యాద?

'ఎంటర్ ఎట్ యువర్ ఓన్‌రిస్క్'.. అమెరికా అధ్యక్షుడు తన ఓవల్ ఆఫీస్‌లో అడుగుపెట్టినవారితో మర్యాదగా వ్యవహరించపోగా, తీవ్రంగా అవమానించి పంపిస్తాడంటూ ప్రపంచ దేశాధినేతలందరికీ ఒక ఆంగ్లపత్రిక చేసిన హెచ్చరిక ఇది. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంఫోసాతో బుధవారం డోనాల్డ్ ట్రంప్ వ్యవహరించిన తీరుతో బహుశా ఏ దేశాధినేతాకూడా నమ్మకంగా ఓవల్ ఆఫీసులోకి అడుగుపెట్టలేడేమో. ట్రంప్‌తో భేటీ తరువాత విలేఖరులతో రాంఫోసా ఓ బలవంతపు చిరునవ్వు మధ్యన 'మిమ్మల్ని నిరాశపరిచినట్టున్నాను' అని ఓ వ్యాఖ్య చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఇదే కార్యాలయంలో ట్రంప్ ఎంత అవమానకరంగా వ్యవహరించారో రాంఫోసాకు తెలుసు. ఆ సందర్భంగా జెలెన్‌స్కీ ఏమాత్రం తగ్గకుండా ట్రంప్‌కు దీటైన సమాధానాలు ఇచ్చి, అగ్రరాజ్యాధినేత ఆగ్రహానికి గురై అర్ధంతరంగా అవమానకరమైన రీతిలో బయటకు పోవాల్సివచ్చింది. కానీ, ట్రంప్ ఎంత అవమానించినా కూడా వాగ్యుద్ధం హద్దులు దాటకూడదని, తాను మరో జెలెన్‌స్కీ కాకూడదని రాంఫోసా జాగ్రత్తపడ్డారు. అందుకే, విలేఖరులను నిరాశపరిచానన్న నర్మగర్భమైన వ్యాఖ్య చేశారు.

దక్షిణాఫ్రికాలో నల్లవారు ఒక పద్ధతిప్రకారం శ్వేతజాతిరైతుల భూములను ఆక్రమించుకుంటూ, వందలాది తెల్లవారిని ఊచకోత కోశారన్నది మస్క్–ట్రంప్ బృందం వాదన. అమెరికాలో శ్వేతజాతీయుల ఓట్లు కొల్లగొట్టడానికి ఇది ఎంత ఉపకరించిందన్నది అటుంచితే, ట్రంప్ అధికారంలోకి వచ్చిన తరువాత దక్షిణాఫ్రికాలోని తెల్లవారికి అమెరికా ప్రవేశాన్ని సులభతరం చేశారు. దక్షిణాఫ్రికామీద కక్షకట్టి నిధుల నిలిపివేతసహా పూర్తిస్థాయి సహాయనిరాకరణ ప్రకటించారు. ఈ నేపథ్యంలో, ట్రంప్‌తో మాట్లాడి, ఈ కక్షకు స్వస్తి పలకాలని రాంఫోసా ప్రతిపాదించినప్పుడు, ట్రంప్ మనసు తెలిసి కూడా వెళ్ళి అవమానపడటం ఎందుకని ఆయన శ్రేయోభిలాషులు సలహా ఇచ్చారట. కానీ, ఆర్థికంగా దేశానికి జరిగేనష్టం కంటే, ఉధృతంగా సాగుతున్న ట్రంప్ ప్రచారాన్ని మిగతా ప్రపంచం ఎప్పటికోప్పటికి నమ్మే ప్రమాదం ఎక్కువగా ఉన్నదని, పోయిరావలసిందేనని రాంఫోసా పట్టుబట్టి, చివరకు ఇలా అవమానపడాల్సి వచ్చింది. నిజంగా వందలాదిమంది తెల్లరైతుల హత్యలే జరిగితే ఈ నల్లదేశాన్ని పాశ్చాత్యప్రపంచం బతకనిస్తుందా?

మొహమాటపు పలకరింపులు అయ్యాక, ట్రంప్ ఒక్కసారిగా ముసుగు తీసేశారు. చావులు..చావులు..ఘోరమైన చావులు అంటూ మీ దేశంలో శ్వేతజాతిమారణకాండ సాగిపోతోందని రాంఫోసా మీద విరుచుకుపడ్డారు. దక్షిణాఫ్రికాలో హింస హెచ్చుగా ఉన్నమాట నిజమే కానీ, వ్యవసాయరంగానికి సంబంధించిన హత్యల్లో నల్లవారే ఎక్కువగా చనిపోయారని రాంఫోసా ఒక దశలో ఏదో చెప్పబోయారు. చూస్తాను, చేస్తానని ఏదో అన్నారు. ఇంతలోగా ట్రంప్ ఆదేశాల మేరకు ఓవల్ ఆఫీసులో లైట్లు తగ్గిపోయి, అప్పటికప్పుడు అది ఓ చలనచిత్ర ప్రదర్శనశాలగా మారిపోయింది. దక్షిణాఫ్రికా స్వాతంత్ర్య పోరాట కాలంలో శ్వేతజాతివారిమీద నల్లజాతి నాయకులు కక్షపూరితంగా పాడిన పాటలు, ఇటీవల కొందరు నాయకులు ఇచ్చిన నినాదాలు, డ్రోన్‌ద్వారా చిత్రీకరించిన కొన్ని దృశ్యాలు గుదిగుచ్చిన ఒక ఐదునిముషాల వీడియోను రాంఫోసా చెమటలు తుడుచుకుంటూ చూడాల్సివచ్చింది. ప్రదర్శన ఆగినవెంటనే, ఉపాధ్యక్షుడు వాన్స్ అందించిన ఒక పెద్దకాగితాలకట్టని ముందుగా మీడియాకు విప్పి చూపించి, ఆ తరువాత రాంఫోసాకు అందించారు ట్రంప్. వాటిమీద కనిపిస్తున్న ఫోటోలన్నీ ప్రిటోరియా తదితర ప్రాంతాల్లో ఊచకోతకు గురైన తెల్లవారి మృతదేహాలని ట్రంప్ బృందం ప్రపంచానికి చెప్పదల్చుకుంది. కానీ, బిబిసి సహా చాలా మీడియా సంస్థలు ట్రంప్ ప్రదర్శించిన విడియోలోనూ, చూపిన ఈ కాగితాల్లోనూ ఎన్ని అసత్యాలు దాగివున్నాయో విశ్లేషిస్తున్నాయి. కాంగో దృశ్యాలను తెచ్చి, దక్షిణాఫ్రికా మీద రుద్దుతున్నారని, గతంలో ఒక శ్వేతజాతిరైతుదంపతుల హత్యకు ఆగ్రహించి ఒక రహదారికి అటూ ఇటూ తెల్ల శిలువలు పాతితే, ఆ దృశ్యాన్ని సైతం వాడుకొని ఆ శిలువలన్నీ వందలాదిమంది తెల్లరైతుల ఊచకోతకు నిదర్శనంగా ప్రచారం చేస్తున్నారని ఈ సంస్థలు అంటున్నాయి. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించి, గాజాలో సాగుతున్నది జీనోసైడ్‌గా నిర్ధారించేట్టు చేసి, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూకు అరెస్టు వారెంట్ జారీచేయించినందుకు, అదే పదజాలంతో ట్రంప్ బృందం దక్షిణాఫ్రికా మీద ఇలా కక్షతీర్చుకుంటోందన్నమాట.

'న్యూ' ఇండియాలో న్యాయం నిష్పాక్షికమేనా?


akbar

> ప్రొఫెసర్ అలీఖాన్ మహమూదాబాద్ పాల్పడిన 'నేరం' ఏమిటి? దేశ చట్టాల ఉల్లంఘన కిందకు వచ్చే ఎలాంటి వ్యాఖ్యలనైనా చేయడం కానేకాదు; ప్రస్తుత ప్రభుత్వాన్ని నిర్భయంగా విమర్శించే భారతీయ ముస్లిం కావడమే ఆయన 'అపరాధం'. కల్నల్ సోఫియా ఖురేషిపై మత విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన విజయ్ షాపై చట్టపరమైన చర్యలు ఏవీ చేపట్టకపోవడానికి కారణం ఆయన పాలక పక్షంలో ప్రముఖ నాయకుడు కావడం వల్లే కాదూ? మీ ఇంటి పేరు షా కావడం, ఖాన్ కాకపోవడంలో ఉన్న వ్యత్యాసమది.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

హిందుత్వ రాజకీయ ప్రాబల్యం పెరిగిపోతున్న ఈ రోజుల్లో ఒక భారతీయ ముస్లింగా ఉండడం అంటే ఏమిటి? ఈ విషయమై ఆలోచనాపరుల భిన్నాభిప్రాయాలతో కూడిన 'మై నేమ్ ఈజ్ రహీమ్ ఖాన్' అనే వీడియో బ్లాగ్‌ను కొద్ది వారాల క్రితం ప్రసారం చేశాను. వెన్వెంటనే కరడుగట్టిన మితవాద హిందువులు నన్ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శనాస్త్రాలను సంధించారు. ఇస్లామిక్ తీవ్రవాదం పెచ్చరిల్లిపోతున్న తరుణంలో ఆ నిజమైన సమస్యతో తలపడడాన్ని తప్పించుకునేందుకే ముస్లింలను 'బాధితులు'గా చిత్రీకరిస్తున్నానని ఆక్షేపించారు. ఇప్పుడు వెనుతిరిగి పర్యాలోచించుకుంటే ఆ బ్లాగ్ శీర్షిక తప్పుగా పెట్టానని అనిపిస్తుంది. నేను ఆ వీడియో బ్లాగ్‌కు 'మై నేమ్ ఈజ్ అలీఖాన్ మహమూదాబాద్' అని పేరు పెట్టి ఉండవల్సింది.

భారత్, పాకిస్థాన్ ఘర్షణలకు సంబంధించి ఇరువురు మహిళా సైనికాధికారుల– కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్– మీడియా సమావేశం గురించి తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన అశోకా యూనివర్శిటీ పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ అలీఖాన్ మహమూదాబాద్‌ను ఇటీవల అరెస్ట్ చేశారు. అధికార రాజకీయ వ్యవస్థ ఎంత దారుణంగా వ్యవహరిస్తుందీ ఆ అరెస్ట్ ఉదంతం వెల్లడించింది. కల్నల్ సోఫియా ఖురేషీని టీవీ యాంకర్లు, వ్యాఖ్యాతలు ఘనంగా ప్రశంసించడాన్ని ప్రశ్నిస్తూ ఆపరేషన్ సిందూర్‌పై తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వెల్లడించడమే ప్రొఫెసర్ అలీఖాన్ చేసిన 'నేరం'! తన సోషల్ మీడియా పోస్ట్‌లో ఆయన ఇలా అన్నారు: 'కల్నల్ సోఫియా ఖురేషిని టీవీ వ్యాఖ్యాతలు ప్రశంసిస్తుండడం చూసి నాకు చాలా సంతోషంగా ఉంది. మరి వీరంతా మూకల హింసాకాండ, అకారణ బుల్డోజింగ్ బాధితులు, ఇంకా బీజేపీ ద్వేషపూరిత ప్రచార బాధితుల పక్షాన కూడా గళమెత్తితే వారికీ భారతీయ పౌరుల్లా రక్షణ లభిస్తుంది. ఇద్దరు మహిళా సైనికాధికారుల ద్వారా సమాచారం ఇవ్వడం ప్రశంసనీయమే. అయితే ఆ సమాచార వెల్లడి విధానం వాస్తవికంగా ఉండాలి. లేదంటే అది నయవంచనే అవుతుంది. తన లౌకికవాద నిబద్ధతను ఆ మహిళా సైనికాధికారుల ద్వారా చూపేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. అయితే క్షేత్ర స్థాయిలో సాధారణ ముస్లింలు దానికి భిన్నమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు'.

మోదీ ప్రభుత్వాన్ని అలీఖాన్ తీవ్రంగా విమర్శించారు, సందేహం లేదు. అయితే మోదీ సర్కార్ భావిస్తున్నట్టుగా ఆ వ్యాఖ్యల్లో భారతదేశ సార్వభౌమత్వం, ఐక్యత, సమగ్రతలకు అపాయం కలిగించేది ఏముంది? ఆ మాటకొస్తే మత విద్వేషాన్ని రెచ్చగొట్టేదీ ఏముంది? మహిళా సైనికాధికారుల గౌరవానికి భంగం కలిగించేది ఏముంది? ఎంతగా రెచ్చగొట్టేది అయినా ప్రభుత్వంపై చేసిన విమర్శను 'నేరపూరిత చర్య'గా ఎప్పటి నుంచి పరిగణిస్తున్నారు? అందునా బీజేపీ యువ మోర్చా కార్యకర్త అయిన ఒక గ్రామ సర్పంచ్ ఫిర్యాదు లేదా హర్యానా రాష్ట్ర మహిళా కమిషన్ పంపిన నోటీస్ ఆధారంగా అరెస్ట్ చేయడం న్యాయబద్ధమేనా?

మహిళా సైనికాధికారుల గౌరవానికి భంగం కలిగించే విషయాలు అలీఖాన్ సోషల్ మీడియా పోస్టులో ఏమున్నాయని ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు హర్యానా రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు రేణు భాటియా సరైన సమాధానమివ్వలేకపోయారు.. చాలా 'సర్కారీ' సంస్థల మాదిరిగానే హర్యానా రాష్ట్ర మహిళా కమిషన్ సైతం శీఘ్రగతిన అలీఖాన్‌కు వ్యతిరేకంగా అనాలోచిత నిర్ణయం తీసుకున్నది. 'అధికారిక' ఆదేశాల మేరకు అలీఖాన్‌కు సమన్లు జారీ చేసింది. లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని కూడా డిమాండ్ చేసింది. ఈ న్యాయ సమ్మతం కాని వ్యవహారంలో పోలీసులూ భాగస్వాములు అయ్యారు. ఒక పౌరుని ప్రాథమిక హక్కులను కాలరాచివేస్తున్నామనే ఆలోచన లేకుండా, యుక్తమైన ప్రక్రియను అనుసరించకుండా అలీఖాన్‌ను అరెస్ట్ చేశారు.

ప్రొఫెసర్ అలీఖాన్ కేసు అనేక ఇబ్బందికరమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. మొదటిది వాక్ స్వాతంత్ర్యాన్ని, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను అరికట్టేందుకు నిస్సిగ్గుగా అధికార దుర్వినియోగం జరిగింది. ఈ విషయంలో అలీఖాన్‌దే ఏకైక కేసు కాదు. కేంద్రంలో గానీ, రాష్ట్రాలలో గానీ పార్టీలకు అతీతంగా ప్రతి ప్రభుత్వమూ తన అధికారాలు, పోలీస్ వ్యవస్థపై నియంత్రణను తన విధానాలతో విభేదించేవారి గొంతులను నొక్కివేసేందుకు నిస్సంకోచంగా ఉపయోగించుకుంటోంది. రాష్ట్రాలలో చోటుచేసుకున్న అలాంటి అనుచిత చర్యలు కొన్నిటిని గుర్తు చేస్తాను. 2022లో ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్‌ను అవహేళన చేసిన సోషల్ మీడియా పోస్ట్ నొకదాన్ని షేర్ చేసినందుకు మరాఠీ నటుడు కేటకి చితాలెను అరెస్ట్ చేశారు. తమిళనాడు అధికార పక్షాన్ని విమర్శించే యూ ట్యూబర్ సవుక్కు శంకర్ గృహంలోకి ఒక గుంపు చొరబడి చెత్త, అశుద్ధ పదార్థాలను కుప్పపోయడంపై డీఎంకే ప్రభుత్వం మౌనం వహించింది. మమతా బెనర్జీని పరిహసించిన ఒక కార్టూన్ విషయమై కోల్‌కతా ప్రొఫెసర్ ఒకరిని అరెస్ట్ చేశారు. 'మీకు వాక్ స్వాతంత్ర్యం ఉన్నది. అయితే మాట్లాడిన తరువాత మీ స్వేచ్ఛకు నేను హామీ ఇవ్వలేను' అన్న ఒకనాటి ఉగాండా నిరంకుశ పాలకుడు ఇడి అమీన్ ప్రవచనాన్నే భారత రాజకీయ వ్యవస్థ ఒక విధంగా అనుసరిస్తోంది!

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వంపై ఎలాంటి విమర్శలనైనా 'జాతి–వ్యతిరేక'మైనవిగా పరిగణించి, సదరు విమర్శకులపై దేశద్రోహ చట్టాలను ప్రయోగించడం పరిపాటి అయింది. కేంద్ర ప్రభుత్వాన్ని అనుసరించి పలు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వివిధ చట్టాలను ప్రత్యర్థులపై ఆయుధాలుగా ప్రయోగిస్తున్నాయి. వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేసేందుకు చట్టాన్ని ఆయుధంగా వాడడమే కాదు, ఆ అధికార దుర్వినియోగానికి ఎంపిక చేసుకున్న కొద్ది మంది విషయంలో మాత్రమే పాల్పడుతున్నారు. వ్యతిరేకంగా ఉపయోగిస్తున్నారు. ఈ అవాంఛనీయ పరిణామం రెండవ తక్షణ సమస్యను లేవనెత్తుతోంది. నిర్దిష్ట చట్టం పరిధిలోకి ఎవరు వస్తారు అనేది పూర్తిగా అధికారంలో ఉన్నవారి చపలచిత్త వైఖరులు, భ్రమలపై ఆధారపడి ఉన్నది. ప్రొఫెసర్ అలీఖాన్ మహమూదాబాద్, మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి విజయ్ షా కేసుల మధ్య వ్యత్యాసాన్ని పరిగణనలోకి తీసుకోండి. కల్నల్ సోఫియా ఖురేషికి వ్యతిరేకంగా అవమానకరమైన, జెండర్ వివక్షాపూరిత, మత విద్వేషకరమైన వ్యాఖ్యలు చేసిన మహాశయుడు విజయ్ షా. మరి ఆయన్ని మంత్రి మండలి నుంచి తొలగించారా? లేదు. కనీసం మధ్యప్రదేశ్‌లోని బీజేపీ నాయకత్వం విజయ్ షాను బహిరంగంగా మందలించిందా? ఇదీ జరగలేదు. పైగా రాష్ట్ర పార్టీ నాయకులు అందరూ ఆయనకు బాసటగా నిలబడ్డారు. కేంద్రం మౌనం పాటించింది. అయితే విజయ్ షా లాంఛనప్రాయంగా క్షమాపణలు చెప్పారు. కల్నల్ సోఫియా ఖురేషీపై ఆయన వ్యాఖ్యలను మధ్యప్రదేశ్ హైకోర్టు సుమోటోగా స్వీకరించి ఎఫ్ఐఆర్ నమోదు చేయవల్సిందిగా రాష్ట్ర డీజీపీని ఆదేశించింది. సుప్రీంకోర్టు సైతం ఆయన వ్యాఖ్యలు 'జాతికి సిగ్గు చేటు' అని అభివర్ణించింది. ఉన్నత న్యాయస్థానాలు ఇలా ప్రతిస్పందించిన తరువాతనే విజయ్ షా బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. 'ఇటీవల నేను చేసిన ప్రకటన అన్ని వర్గాల మనోభావాలను దెబ్బతీసేలా ఉంది. అందుకు నేను చాలా సిగ్గుపడుతున్నాను. మనఃస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నాన'ని విజయ్ షా అన్నారు. మంత్రి వ్యాఖ్యలపై దర్యాప్తునకు కోర్టు ఆదేశం మేరకు ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటయింది. అయితే ఢిల్లీ పోలీసులు ప్రొఫెసర్ అలీఖాన్‌ను అరెస్ట్ చేసిన విధంగా మధ్యప్రదేశ్ పోలీసులు విజయ్ షాను అరెస్ట్ చేయలేదు!

ఈ కారణంగానే అలీఖాన్ కేసులో మూడవ, మరింత అత్యవసరమైన ప్రశ్న ఉన్నది. ప్రొఫెసర్ అలీఖాన్ కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుంచి డాక్టొరేట్ పొందిన విద్యాధికుడు. అయితే ఆయన తన భావాలు, అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తం చేసే భారతీయ ముస్లిం పౌరుడు. మరీ ముఖ్యంగా ఒకప్పటి మహమూదాబాద్ రాజకుటుంబానికి చెందినవాడు. ఆయన తాత మొహమ్మద్ ఆమిర్ అహ్మద్ ఖాన్ స్వాతంత్ర్యానికి పూర్వం ముస్లింలీగ్‌లో ఒక కీలక నాయకుడు. మరి హిందుత్వవాదులకు ఇంతకు మించి నిర్దుష్ట శత్రువు అయిన వ్యక్తి మరొకరు ఎవరుంటారు? భారతీయ ముస్లింలను దేశభక్తి లేనివారు, పాకిస్థాన్ అనుకూలురు, సంశయాస్పద స్వభావులుగా వేధించడమే హిందూత్వ సంస్థల, వ్యక్తుల ప్రాథమిక లక్ష్యంగా ఉన్నది. ముస్లిం కాని ప్రతిపక్ష నాయకుడు లేదా మీడియా ప్రముఖుడు ఎవరైనా ఆపరేషన్ సిందూర్‌పై ఇబ్బందికరమైన ప్రశ్నలు ఎన్ని లేవనెత్తినా ప్రభుత్వ ఆగ్రహానికి గురి కాకుండా సురక్షితంగా ఉండగలుగుతారు. అయితే తమ భావాలు, అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తం చేయగలిగే భారతీయ ముస్లింలు ఎవరికీ అటువంటి అనుమతి, స్వేచ్ఛ లేదు! ఈ కారణంగానే అలీఖాన్ చట్టవిరుద్ధ కార్యకలాపాలలో పాల్గొంటున్న వ్యక్తిగా పరిగణితుడయ్యాడు. ఆయన పాల్పడిన 'నేరం' ఏమిటి? దేశ చట్టాల ఉల్లంఘనకు కిందకు వచ్చే ఎలాంటి వ్యాఖ్యలనైనా చేయడం కానేకాదు; ప్రస్తుత ప్రభుత్వాన్ని నిర్భయంగా విమర్శించే భారతీయ ముస్లిం కావడమే ఆయన 'అపరాధం'. మత విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన విజయ్ షాపై చట్టపరమైన చర్యలు ఏవీ చేపట్టకపోవడానికి కారణం ఆయన పాలకపక్షంలో ప్రముఖ నాయకుడు కావడం వల్లే కాదూ? మీ ఇంటి పేరు షా కావడం, ఖాన్ కాకపోవడంలో ఉన్న వ్యత్యాసమది. ఒకరి విషయంలో క్షమాపణతో సరి, మరొకరి విషయంలో అరెస్ట్ అనివార్యమయింది! ఇదే 'న్యూ' ఇండియా సుమా!

తాజా కలం: ప్రొఫెసర్ అలీఖాన్‌కు తాత్కాలిక బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు ఆయన సామాజిక మాధ్యమాల పోస్ట్‌లపై దర్యాప్తునకు ఒక సిట్‌ను నియమించింది. ఈ ప్రత్యేక బృందం దర్యాప్తు చేసేది ఏమిటో స్పష్టంగా తెలియదు. పనిలేని పోలీసధికారులు చాలా మంది ఉన్నారని, విచారణ ప్రక్రియే శిక్షగా ఉన్న న్యాయవ్యవస్థ ఉన్నదని మనకు స్పష్టంగా తెలుసు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ఆచరణ సాధ్యంకాని ఆలోచనలు!

ఒక సాహితీ సంస్థలో తనకు సభ్యత్వాన్ని నిరాకరించటాన్ని ప్రస్తావిస్తూ శ్రీశ్రీ "అరవైయేళ్ళ దాటిన నన్ను సభ్యుడిగా చేర్చుకోలేమని చెప్పారు, వయసు ఎక్కువై కాదు– చాలక" అని అంటాడు. దశాబ్దకాలంగా వృద్ధుల వలన, వృద్ధుల చేత, వృద్ధుల కొరకు రాయబడుతున్న అనేకానేక ఆచరణ సాధ్యం కాని వ్యాసపరంపరలలో మంచికంటి వ్యాసం (ఆంధ్రజ్యోతి 7.5.25) కూడ చేరి శ్రీశ్రీ చమత్కారానికి సాక్ష్యంగా నిలిచింది.

ఇందులో భాగంగా ప్రైవేటు స్కూళ్లల్లో ఉత్తీర్ణత శాతం పెరగటానికి, అక్కడ గైడ్ల బదులు మెటీరియల్ ఉండటమే కారణం అని మంచికంటి వివరించారు. అది ఒక కారణం కావచ్చు కాని, అదొక్కటే కారణం కాదు. కార్పొరేటు విద్యాసంస్థ ఉద్దేశ్యం వ్యాపారమైనా అక్కడ ఉపాధ్యాయుడి సామర్థ్యానికి, పిల్లల చదువుకు ఖచ్చితమైన జవాబుదారీతనం ఉంటుంది. ప్రేమవల్ల కాకపోయినా వ్యాపారం దెబ్బతింటుందన్న భయంవల్లనైనా ఉత్తీర్ణతా శాతం కోసం వారు శాయశక్తులా ప్రయత్నిస్తారు. అలాంటప్పుడు ప్రభుత్వ పాఠశాలలలో ఉత్తీర్ణత పడిపోతుందన్న దిగులెందుకు? ప్రైవేటు స్కూళ్ల విధానాలను ఆదర్శంగా తీసుకోవచ్చు కదా!

విద్యావ్యవస్థ లోపాలను సరిదిద్దేందుకు చదువు నేర్వడంలో ఇబ్బందులు విద్యార్థులు ఉన్నతాధికారులకు తెలియచేయాలని, అధికారులు తరచు పాఠశాలలను సందర్శించి సమీక్షించాలని రచయిత సూచించారు. ఇవి ఆచరణసాధ్యం కాదని తెలియదా? పై అధికారుల ఆజ్ఞలకు హుజూర్ అనటం తప్ప ఏమీ చేయలేని అధికారులు ఉన్నప్పుడు విద్యావ్యవస్థలో క్వాలిటీ ఎక్కడ నుంచి వస్తుంది? వ్యవస్థలోని లోపాలన్నిటికీ మాతృభాషలో విద్యాబోధన లేకపోవటమేనని మంచికంటి వారు విశ్లేషించారు. నూటికి ఎనభై శాతం మంది కార్పొరేటు స్కూళ్లలో చదివి సాఫ్‌వేర్, వైద్యవృత్తులలో దూసుకుపోతున్నారు. అక్కడ మాతృభాషలో విద్యాబోధన లేదే! దారిద్ర్యరేఖకు దిగువనున్న వారు, దిగువ మధ్యతరగతి వారి విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలలో కనబడటానికి కారణం వారి ఆర్థిక పరిస్థితే తప్ప మాతృభాషపై అభిమానం కాదు. మాతృభాష గురించి ఉపన్యాసాలు దంచే సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు, ప్రభుత్వోద్యోగులు, వ్యాపారస్తులు తమ పిల్లలను, మనుమలు మనుమరాళ్లను ఇంగ్లీషు మీడియంలో చదివించటానికి కారణం వారి ఆర్థికస్థితి మెరుగుగా ఉండటమే.



> గత వైభవంగా మిగిలిపోతున్న వ్యవస్థలను చూచి ఎవరికైనా హృదయం కలుక్కుమనటం సహజం. అయితే మార్పు అవసరం, అనివార్యం. అభ్యుదయాలు, అవలక్షణాల సమ్మిళితమైన మార్పును ఆహ్వానించుకుంటూ, దానిలోని అవలక్షణాలు తొలగించుకొని అద్భుతాలు సృష్టించుకోవడమే మన కర్తవ్యం.

అసలు మాతృభాష అన్న పదం గూర్చి మేధావులు, రచయితలు ఎప్పుడన్నా ఆలోచించారా? ఈ ఉపన్యాసకులు ఉటంకించే మాతృభాష అంటే తమ చిన్నప్పటి మాతృభాష. అంటే యాభై యేళ్లనాటిది. ఇప్పటి పిల్లలది సగం తెలుగు, సగం ఇంగ్లీషు కలగలిసిన భాష. నేటి తరం పిల్లలకు యాభై యేళ్లనాటి తెలుగు మాధ్యమంలో చెప్పటానికి యత్నిస్తే వారు కంగారుపడిపోతారు. దీనర్థం తెలుగు ఉండకూడదు, చచ్చిపోవాలని కాదు. తెలుగును ఒక సబ్జెక్టుగా ఉంచి కూలంకషంగా పిల్లలకు బోధించటం ఖచ్చితంగా అవసరమే. కాని ఈ తెలుగు జ్వరాన్ని మాధ్యమాలలో, సాంకేతిక పదాలలో సైతం చొప్పించాలనటమే అసలు సమస్య. కింది స్థాయిలో సాంకేతిక పదాలు తెలుగులో నేర్చుకున్న ఈ తరం పిల్లలు పై చదువుల కెళ్లినపుడు దానిని ఇంగ్లీషులో అర్థం చేసుకునేందుకు, తర్జుమా చేసుకునేందుకు ఊహించని యాతన పడాల్సి వస్తుంది. ఇది విద్యార్థుల భవిష్యత్తును మనం చేజేతులా పాడుచేయటమే.

ఇంజనీరింగ్ చదివిన కుర్రాడు కనీస సామర్థ్యం లేక విద్రోహులుగా మారకుండా ఉండాలంటే మాతృభాషలో విద్యాబోధనతో బాటు గ్రంథాలయాలు, పుస్తకపఠనం మాత్రమే పరిష్కారాలని చెపుతూ "ఉపాధ్యాయులు చేయలేని పని గ్రంథాలయం చేస్తుంద"ని వ్యాసకర్త అన్నారు. గ్రంథాలయాలు మాత్రమే ఏకైక మార్గంగా ఉన్నప్పటి యాభై యేళ్లనాటి గతవైభవాన్ని తలచుకుంటూ నోస్టాల్జీలో మునిగితేలే ఒక రిలవెన్స్ లేని అంశం ఇది. నిజానికి ఉపాధ్యాయులు చేయలేని పని చేసేది గ్రంథాలయాలు కాదు యుట్యూబ్‌లు. అందులో ప్రతి పాఠం సూక్ష్మ అంశాలతో సహా విడమరచి చెప్పబడే లెక్కకు మించిన వీడియోలున్నాయి.

పుస్తకపఠనం ఈ తరానికి రుచి చూపించాలనుకోవడం చాలా మంచిది, అవసరం కూడా. అందుకు గ్రంథాలయాలతో పాటు క్లిక్ దూరంలో దొరికే పీడీఎఫ్‌లు, కావల్సిన పుస్తకాలు ఇంటి ముంగిట చేర్చే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఎన్నో ఇతర ప్రత్యామ్నాయాలున్నాయి. ఇలాంటి నవీనయుగంలో యువత శ్రమకోర్చి, సమయం వెచ్చించి సుదూర ప్రాంతంలోని గ్రంథాలయాలకు వచ్చి సమిష్టిగా చర్చించుకుంటూ పుస్తకాల ద్వారా మాత్రమే కెరీర్ అభివృద్ధి చేసుకొనటం సాధ్యమా? సబబా? దీనర్థం గ్రంథాలయాలు మూసివేయాలని కాదు. అనేకానేక ప్రత్యామ్నాయాలలో గ్రంథాలయం కూడ ఒకటి తప్ప, గ్రంథాలయం ఒక్కటే ప్రత్యామ్నాయం కాదు.

మంచికంటి... మేధావులకు, సాహితీవేత్తలకు జరిగే అనర్థాలను పట్టించుకోవాలని చివర్లో విజ్ఞప్తి చేశారు. అందులో తప్పులేదు. అయితే సమాజంలో జరిగే అనర్థాలకు సగం కారణం ఈ సాహితీవేత్తలే. కాటికి కాళ్లు చాచుకున్న ఓ మాజీ రచయిత, లేదా కవి ప్రధానవక్తగా జరిపే ఈ సభలలో నూటికి తొంభై శాతం ప్రేక్షకులు వృద్ధులు. ఉపన్యాసకులు వయోవృద్ధులు. యువతీయువకులు, పిల్లల మాట అటుంచి ఈ సభలలో కనీసం నలభైయేళ్ల లోపువారు పట్టుమని పదిమంది కూడ ఉండడం లేదు. నేటి తరాన్ని వక్తలుగానో, ప్రేక్షకులుగానో సభలకు ఆహ్వానించి, యువతరంతో తెగిపోయిన లింకును పునరుద్ధరించుకోవటానికి రచయితలు, కవులు ఏ మాత్రం సుముఖంగా లేరన్నది బహిరంగ సత్యం.

సెల్‌ఫోన్ చీకటి కమ్మేసింది వాట్సప్ మబ్బులు కమ్ముకున్నాయి అని బాధపడే ముందు సాంకేతికతపై ద్వేషం నుంచి మేధావులు బయటపడాలి. అప్పుడు సెల్‌ఫోన్ కొన్ని వందల మందికి ఆత్మీయుడిగా, ఆప్తుడిగా, విజ్ఞానప్రదాతగా ఉందన్న విషయం తెలుస్తుంది. పాఠశాలల యాజమాన్యాలు పిల్లలకు హోమ్‌వర్క్‌లు, పిల్లల ఎదుగుదల గురించి తల్లిదండ్రులకు సూచనలు వాట్సప్‌ల ద్వారానే ఇస్తున్నారు. 'సమాజానికి బహిరంగ లేఖ' అంటూ మంచికంటి రచించిన 56 పేజీల ఒక విలువైన పుస్తకం సెల్‌ఫోన్ల ద్వారా అందులోని వాట్సప్‌ల ద్వారానే దేశవిదేశాలలోని వేలాది మందికి చేరి తెలుగువారందరిలో మంచి పేరు తెచ్చిపెట్టిందన్న విషయం ఆయన మరువరాదు. ఖండించాల్సింది సెల్‌ఫోన్ వినియోగాన్ని కాదు దుర్వినియోగాన్ని.

గత వైభవంగా మిగిలిపోతున్న వ్యవస్థలను చూచి ఎవరికైనా హృదయం కలుక్కుమనటం సహజం. అయితే మార్పు అవసరం, అనివార్యం. అభ్యుదయాలు, అవలక్షణాల సమ్మిళితమైన మార్పును ఆహ్వానించుకుంటూ, దానిలోని అవలక్షణాలు తొలగించుకొని అద్భుతాలు సృష్టించుకోవడమే మన కర్తవ్యం. బాలల అభ్యున్నతికి శ్రమను, ధనాన్ని వెచ్చించిన వ్యక్తిగా మిత్రుడు మంచికంటి వెంకటేశ్వరరెడ్డి అభ్యుదయవాదులలో ముందుంటారు. దానికి అభినందించకుండా ఉండలేం. అలాగని ఆచరణ సాధ్యాసాధ్యాలను సమీక్షించుకోకుండా వెలువరించే ఆయన ఆలోచనలను, అమాయకత్వాన్ని అభిశంసించకుండా కూడా ఉండలేం.

● ఆర్.వి. రాఘవరావు

యువత భవితకు 'ఇంటర్న్‌షిప్' ఊతం

నూట నలభై ఐదు కోట్ల పైచిలుకు జనాభాలో అలరారుతున్న దేశం మనది. వీరిలో తొంభై కోట్లకు పైగా యువత ఉన్నారు. వీరంతా ముప్పై ఐదు సంవత్సరాల లోపువారే. ప్రపంచంలోని ఏ ఇతర దేశానికి లేని యువ సంపద మన సొంతం. కాని, చదివిన చదువులకు తగిన పని అనుభవం కలిగినవారు ఎందరు? గణాంకాలు కలవరపాటుకు గురిచేస్తాయి. ఏళ్ళ తరబడి చదువులు చదువుతూ, స్వల్పకాలంలో పని అనుభవాన్ని సాధించగలిగే నైపుణ్యాలను వృద్ధి చేసుకోడంలో యువత ఎందుకు వెనకబడుతున్నారన్నది అందరూ ఆలోచించాలి.

'జాతీయ విద్యావిధానం–2020' యువతకు ఉద్యోగ అవకాశాలను పెంచడానికి ఇంటర్న్‌షిప్‌లను వారి చదువులలో భాగం చేసింది. ఇది యువతలో ఆరోగ్యకర పోటీని పెంచటంతోపాటు, వివిధ రకాలైన ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించడానికి సహకరిస్తుంది. వివిధ వృత్తులు, ఉద్యోగాలు, పరిశోధనల్లో ఆసక్తిని పెంపొందించడానికి ఇంటర్న్‌షిప్‌లు ఎంతగానో దోహదం చేస్తాయి. జాతీయ విద్యావిధానం మూడు రకాలైన ఇంటర్న్‌షిప్‌లపై దృష్టి పెట్టాలని విద్యాలయాలకు సూచించింది. వారానికి రెండు నుంచి నాలుగు క్రెడిట్ల బోధన, అభ్యసన గంటలను ఇంటర్న్‌షిప్‌లకు కేటాయించాలని విధానపత్రం సూచిస్తోంది.

ఇంటర్న్‌షిప్‌లలో మొదటిరకం వృత్తి నైపుణ్యాలను వృద్ధి చేసుకోడానికి సంబంధించినది. పరిశ్రమలు, కార్యాలయాలతో అనుసంధానమై విద్యార్థులు దీనిని పూర్తి చేయాలి. రెండవది, తాము చదువుతున్న సబ్జెక్టులో పరిశోధన నైపుణ్యాలను వృద్ధి చేసుకోడానికి సంబంధించింది. చదువుకొంటున్న విద్యాలయంలోని ఆచార్యుల పర్యవేక్షణలో ఉంటూ విద్యార్థి పరిశోధన ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేయాలి. ఇందుకోసం, ఇతర విద్యాలయాలు, పరిశోధన సంస్థలతో కూడా కలసి పనిచేయవచ్చు. మూడవది, సమాజంతో మమేకమై పనిచేయడం. సమాజం పట్ల సానుకూలమైన దృక్పథాన్ని యువతలో పెంపొందింప చేయడానికి ఇది మేలైన మార్గం. ప్రజాప్రయోజనం కోసం పనిచేసే వ్యక్తులు, సంస్థలు, కార్యాలయాలు, ప్రభుత్వ శాఖలు... మొదలైన వాటితో కలిసి పనిచేస్తూ సమాజ చలనసూత్రాలను నేరుగా అధ్యయనం చేసే వీలు దీని ద్వారా యువతకు లభిస్తుంది. ఈ మూడు రకాలైన ఇంటర్న్‌షిప్‌లలో దేనిని ఎంచుకోవాలన్నది విద్యార్థుల అభిరుచిపై ఆధారపడి ఉంటుంది.

కళలు, సాహిత్య రంగాలు, సామాజిక శాస్త్రాలు, వృత్తివిద్య, విజ్ఞాన శాస్త్రాలు వంటి అన్ని రంగాలలోను, అన్నిరకాల చదువులలోను ఇంటర్న్‌షిప్‌లను భాగం చేయాలని యూజీసీ మార్గదర్శక సూత్రాలు తెలియజేస్తున్నాయి. స్థాయికి అనుగుణంగా యువతకు ఉన్న ఉపాధి అవకాశాలను పెంచడం దీనిలో గుర్తించదగిన ఒక ప్రధానమైన అంశం. ఒక తరగతి చదివే విద్యార్థులంతా మూస పద్ధతిలో ఒకే రకమైన ఇంటర్న్‌షిప్‌ను ఎంచుకోవలసిన అవసరం లేదు. ఏఏ ఇంటర్న్‌షిప్‌లను ఎంతమంది చేయాలనుకొంటున్నారో విద్యార్థులు, ఆచార్యులు కలిసి నిర్ణయించుకోవచ్చు. డిగ్రీ పూర్తయ్యేలోపు ఇటువంటి ఇంటర్న్‌షిప్‌లలో ఏ ఒక్కటైనా పూర్తి చేయాలని విధానపత్రం నిర్దేశిస్తోంది.

> ఇంతకు ముందుకాలాల్లో లేని ఎన్నో విద్యావకాశాలను జాతీయ విద్యావిధానం ఇప్పటి యువతకు అందిస్తోంది. విద్యార్థి దశలో చేసే ఇంటర్న్‌షిప్‌లు వారి మూర్తిమత్వ వికాసంలో గణనీయమైన మార్పులను తీసుకువస్తాయి. బృందంగా ఏర్పడి పనిచేయడానికి తగిన కౌశలాలను పెంచుతాయి. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా నవీకరణ చెందడానికి, సమతుల్యాన్ని సాధించడానికి ఇంటర్న్‌షిప్‌లు సహకరిస్తాయి.



ఒకప్పుడు సైన్సు, ఇంజనీరింగ్, సాంకేతిక విద్యలకు సంబంధించిన కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులు మాత్రమే ఇంటర్న్‌షిప్‌లను పూర్తి చేసేవారు. ఇప్పుడు అన్ని రకాల చదువులు చదివే విద్యార్థులు చేయదగిన అంశాలు ఇబ్బడి ముబ్బడిగా అందుబాటులో ఉన్నాయి. తాము మంచి వ్యక్తులుగా ఎదగడమే కాకుండా, సమాజాన్ని వృద్ధిచేయడానికి కావలసిన నైపుణ్యాలను ఎన్నిటినో ఇంటర్న్‌షిప్‌ల ద్వారా యువత సాధించుకోవచ్చు. వీటిని అందుకోడానికి యువత తమను తాము ఎంతగా సమాయత్తం చేసుకొంటే మన సమాజాలు అంతగా వృద్ధి చెందుతాయి.

ఇంతకు ముందుకాలాల్లో లేని ఎన్నో విద్యావకాశాలను జాతీయ విద్యావిధానం ఇప్పటి యువతకు అందిస్తోంది. డిగ్రీలు పూర్తయ్యేవరకు విద్యార్థులకు ఆయా విషయాల్లో పని అనుభవం లేకపోతే ఉద్యోగాల కల్పన కష్టం అవుతుంది. అందుకే ఏఐసీటీఈ వంటి సంస్థలు సాంకేతిక విద్యకు సంబంధించి నమూనా ప్రణాళికలను అందిస్తున్నాయి. వీటి ఆధారంగా ఆయా రాష్ట్రాలు తగిన కార్యాచరణను ప్రారంభిస్తున్నాయి. కృత్రిమమేధ, సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్... వంటి అంశాలలో పాఠశాల స్థాయినుంచి తర్ఫీదును ఇచ్చేందుకు కొన్ని రాష్ట్రాలలో ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి. సంబంధిత సంస్థలు, పరిశ్రమలతో అవగాహన ఒప్పందాలను చేసుకొని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో చదువుకొంటున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు అందించడానికి సిద్ధం అవుతున్నాయి. మరికొన్ని విద్యాసంస్థలు మరో అడుగు ముందుకేసి అంతర్జాతీయ పరిశోధన సంస్థలు, పరిశ్రమలతో ఇంటర్న్‌షిప్‌ల కోసం అవగాహన ఒప్పందాలను చేసుకొంటున్నాయి.

విద్యార్థి దశలో చేసే ఇంటర్న్‌షిప్‌లు వారి మూర్తిమత్వ వికాసంలో గణనీయమైన మార్పులను తీసుకువస్తాయి. బృందంగా ఏర్పడి పనిచేయడానికి తగిన కౌశలాలను పెంచుతాయి. వ్యక్తిగతమైన బలహీనతలను అధిగమించి, సామూహికమైన బలాలను ప్రజోపయోగ్యమైన రీతిలో వాడే అవకాశం చిక్కుతుంది. తమ ప్రతిభను ఏయే రంగాలలో సానపెట్టుకోవచ్చో యువతకు అనుభవంలోకి వస్తుంది. విభిన్నమైన పని వాతావరణాలు, పని సంస్కృతులపై అవగాహన, గౌరవం పెంచుకోడానికి ఇంటర్న్‌షిప్‌లు ఎంతగానో సహకరిస్తాయి. సాధించిన నైపుణ్యంతో ఎక్కడైనా గెలవవచ్చనే ధీమా పెరుగుతుంది. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా నవీకరణ చెందడానికి, సమతుల్యాన్ని సాధించడానికి ఇంటర్న్‌షిప్‌లు సహకరిస్తాయి.

సమాజ వృద్ధికి దోహదపడే నిర్ణయాలు తీసుకోడానికి ఇంటర్న్‌షిప్‌లలో పొందే పని అనుభవం యువతకు ఎంతగానో సహకరిస్తుంది. స్పష్టమైన ఆలోచనలతో ముందుకు సాగే స్థైర్యాన్ని ఇంటర్న్‌షిప్‌లు కలిగిస్తాయి. బృందంలో కలిసి పని చేయగలగడంతోపాటు, నాయకత్వ లక్షణాలు అలవడతాయి. నైతిక విలువల ఆధారంగా సమాజవృద్ధికి సహకరించే సృజనాత్మక ఆలోచనలకు ఇంటర్న్‌షిప్‌లు సహకరిస్తాయి. తాము ఎంచుకున్న రంగంలో, తమతో కలిసి పనిచేస్తున్న సహచరులతోపాటు, ఆ రంగంలో నిష్ణాతులైన పండితుల వరకు ఉన్నవారందరితో మంచి సంబంధాలు ఏర్పడతాయి.


పాఠశాల, కళాశాల విద్యను పూర్తిచేసిన యువతకు ఉద్దేశించిన ఇంటర్న్‌షిప్‌ల కోసం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఇటీవలే ప్రకటన వెలువరించింది. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకంగా పిలుచుకునే దీనిలో ఎంపికైన యువతకు నెలకు ఐదువేల రూపాయల భృతి లభిస్తుంది. నేర్చుకున్న అంశాలను పని అనుభవం ద్వారా పదునుపెట్టుకోవడానికి ఇది యువతకు అందివచ్చిన ఒక గొప్ప అవకాశం. ఒక సంవత్సరం వ్యవధిలో సాగే ఈ ఇంటర్న్‌షిప్‌లో అభ్యర్థికి ఆరునెలలపాటు ఉద్యోగ శిక్షణ ఉంటుంది.

ఉన్నత పాఠశాల విద్య, డిగ్రీ, పీజీ వంటి కోర్సులు చదివే విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లు చేయడానికి ఇంటర్న్‌శాల అనే ఆన్‌లైన్ వేదిక అవకాశాలను అందిస్తోంది. ఇంటర్న్‌షిప్‌లు చేయాలనుకొనే విద్యార్థులకు, అవి అందించే వ్యవస్థలకు సంస్థలకు ఉమ్మడి ఆన్‌లైన్ వేదిక 'ఇంటర్న్‌శాల'. దీనిలో రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లు అందించే కార్యాలయాలు, సంస్థలతో నేరుగా అనుసంధానాన్ని పొందవచ్చు. వివిధ ఉద్యోగాల కోసం కావలసిన నైపుణ్యాలను వృద్ధిచేసే అనేకమైన స్వల్పకాలిక కోర్సులను కూడా దీని ద్వారా చేయవచ్చు. ఇంటర్న్‌శాల అందించే ఇంటర్న్‌షిప్‌లలో వైవిధ్యం ఎక్కువ. వివిధ కోర్సులను పూర్తిచేసిన విద్యార్థులు, స్వల్పమైన వృత్తి నైపుణ్యాలు కలిగినవారు నేరుగా ఉద్యోగాలలో చేరడానికి వీలుగా కొన్ని సంస్థలు దీనిలో అవకాశాన్ని కల్పిస్తున్నాయి. జీవితమనే బండి పట్టాలపై సాఫీగా సాగిపోవాలంటే పట్టాలిచ్చే చదువులు మాత్రమే చాలవిప్పుడు. పని అనుభవాన్ని కూడా తోడుపెట్టినప్పుడే సాధించిన పట్టాలకు సార్థకత. యువత తక్షణం దృష్టిసారించవలసిన విషయం ఇది.

■ ఆచార్య పమ్మి పవన్‌కుమార్
డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు, హెచ్‌సీయూ







జై హనుమాన్

↑ నగరంలోని బీఆర్టీఎస్ రోడ్డులో హనుమాన్ శోభాయాత్ర (ఇన్‌సెట్‌లో) హనుమాన్ జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి

హనుమజ్జయంతిని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ మహానగర్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నగరంలో హనుమాన్ శోభాయాత్ర, భజరంగ్‌దళ్ బైక్ యాత్ర జరిగింది. సత్యనారాయణపురంలోని బీఆర్టీఎస్ రోడ్డు ఆదిశంకర సర్కిల్ వద్ద నుంచి ఎన్నార్పీ రోడ్డు వరకు ఈ యాత్ర సాగింది. మహిళలు, యువకులు వేలాదిగా పాల్గొని జై హనుమాన్ నినాదాలు చేశారు. హనుమాన్ జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు, పలువురు ఎమ్మెల్యేలు స్వామిని దర్శించుకున్నారు. హనుమాన్ జంక్షన్ వీధుల్లో స్వామి రథోత్సవం కనులపండువగా జరిగింది. - సత్యనారాయణపురం



మినీ మహానాడులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం

టీడీపీ ఆవిర్భావమే సంచలనం

నేడు దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తోంది

ఎన్టీఆర్ స్ఫూర్తిని చంద్రబాబు కొనసాగిస్తున్నారు 4

మినీ మహానాడులో జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం



● అందంతో కొల్లగొట్టినాదిరో..

నగరంలో గురువారం జరిగిన ఓ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్ ప్రారంభోత్సవంలో 'హరిహర వీరమల్లు' చిత్ర హీరోయిన్ నిధి అగర్వాల్ సందడి చేశారు. పవన్ కల్యాణ్‌తో నటించడం అదృష్టంగా భావిస్తున్నానని, విజయవాడకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.- గవర్నర్‌పేట

కొత్త బస్సులకు గ్రీన్‌సిగ్నల్

- రెండు నెలల తర్వాత రిజిస్ట్రేషన్ చేసిన రవాణా శాఖ
- ఫైర్ ప్రొటెక్టివ్ సిస్టమ్ లేకపోవడం వల్ల మొదట్లో అభ్యంతరం
- ఫైర్ డిటెక్టివ్ అలారం ఏర్పాటుకు ఆర్టీసీ అంగీకారం
- ఇప్పటికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి
- త్వరలో రీజియన్ పరిధిలోని డిపోలకు కేటాయింపు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కొత్తగా కొన్న ఆర్టీసీ బస్సులకు మార్గం సుగమమైంది. ఈ బస్సులొచ్చి చాలాకాలం కావస్తున్నా రిజిస్ట్రేషన్ చేయడానికి రవాణా శాఖ అభ్యంతరం వ్యక్తం చేయటంతో రోడ్లపై తిరగలేని పరిస్థితి ఏర్పడింది. ఫైర్ ప్రొటెక్టివ్ సిస్టమ్ (ఎఫ్‌పీఎస్) ఏర్పాటు చేస్తేనే బస్సులకు రిజిస్ట్రేషన్ చేస్తామని రవాణా శాఖాధికారులు చెప్పటంతో కొత్త బస్సులకు రిజిస్ట్రేషన్ ఆగిపోయింది. దాదాపు రెండు నెలలకు పైగా బస్సులకు రిజిస్ట్రేషన్ జరక్కపోవడంతో ఆర్టీసీకి నష్టం జరిగింది. ఎట్టకేలకు కొత్త బస్సులు రోడ్లపైకి వచ్చే దారి ఏర్పడింది. ఫైర్ డిటెక్టివ్ అలారం (ఎఫ్‌డీఏ) ఏర్పాటుకు ఆర్టీసీ అంగీకరించింది. తొలుత ఎఫ్‌డీఏ విధానానికి రవాణా శాఖ అధికారులు అంగీకరించలేదు. కానీ, ఎఫ్‌పీఎస్ ఏర్పాటు చేయాలంటే బస్సు బాడీ బిల్డింగ్ పూర్తి చేసుకున్నాక కుదరదని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు బాడీ బిల్డింగ్ పూర్తయిన బస్సుకే మినహాయింపు ఇస్తూ రవాణా శాఖ అధికారులు రిజిస్ట్రేషన్ చేయటానికి అంగీకరించారు. దీంతో ఆర్టీసీ అధికారులు కొత్త బస్సుల్లో ఫైర్ డిటెక్టివ్ అలారంను ఏర్పాటు చేశారు. బస్సులన్నింటికీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మిగతా 4లో..

అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్

కొంగరమల్లయ్య గట్టులో పరిశీలన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లాలో అక్రమ మైనింగ్ వ్యవహారాలపై కలెక్టర్ ఏర్పాటుచేసిన విజిలెన్స్ టీమ్ గురువారం రంగంలోకి దిగింది. జగ్గయ్యపేట నియోజకవర్గం వత్సవాయి మండల పరిధిలోని కొంగర మల్లయ్యగట్టులో గ్రావెల్ తవ్వకాలు, ఇదే మండల పరిధిలో సర్వే నెంబర్ 212లో జరిగిన మట్టి తవ్వకాలను బృందం పరిశీలించింది. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాల మేరకు కలెక్టర్ లక్ష్మీశ ఈ బృందాన్ని నియమించారు. ఈ టీమ్ ముందుగా కొంగర మల్లయ్యగట్టును పరిశీలించింది. మైనింగ్ అధికారుల నుంచి వచ్చిన సమాచారం తర్వాత తుది నివేదిక తయారుచేసి కలెక్టర్‌కు ఇస్తుంది. కాగా, సర్వే నెంబర్ 212లో అక్రమార్కులు మట్టిగుట్టను తవ్వకుపోయారని బృందం గుర్తించింది. దీనికి సంబంధించి అక్రమాలు జరిగాయని నిర్ధారించింది.

ద్వీపంలో దొంగలు



భవానీద్వీపంలో నరికేసిన చెట్లు



భవానీద్వీపంలో చెట్ల నరికివేత.. కలప తరలింపు

- ఫంటులో ట్రాక్టర్ తీసుకొచ్చి మరీ అక్రమాలు
- శబ్దం రాని యంత్రాలతో చెట్లను ముక్కలుగా చేసి..
- అక్రమార్కులను పట్టుకున్న బీఐటీసీ సిబ్బంది
- పోలీసులకు అప్పగింత.. కేసు నమోదు.. విచారణ

భవానీద్వీపంలో కలప దొంగలు బరితెగించారు. ఇంటిదొంగల సహకారంతో గుట్టుచప్పుడు కాకుండా ద్వీపంలో పచ్చటి చెట్లను తెగనరికారు. ద్వీపం పునరుద్ధరణ పనులకు పెద్ద ఎత్తున శ్రీకారం చుడుతున్న తరుణంలో పచ్చదనాన్ని హరించేసే చర్యలకు తెగించారు. దీనిపై పోలీసులు విచారణ చేపడుతుండగా, ఏపీటీడీసీలో ఇంటిదొంగల పేర్లు బయటపడుతున్నాయి.



ట్రాక్టర్‌లో కలప

ఇంటిదొంగల సహకారంతోనేనా..?

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భవానీ ద్వీపం వెనుక భాగంలో దట్టంగా అటవీ ప్రాంతం ఉన్నచోటకు ఫంటు మీద ట్రాక్టర్లను తీసుకొచ్చి, పెద్దగా శబ్దం రాని మరకోత యంత్రాలతో చెట్లను నరికేస్తున్నారు. చెట్లను ముక్కలుగా చేసి ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. కొద్దిరోజులుగా ఈ తతంగం నడుస్తోందని సమాచారం. పట్టపగలు అక్రమార్కులు ద్వీపంలోకి చొరబడి చెట్లను నరికి తీసుకెళ్లి పోతుంటే అధికారులు చోద్యం చేస్తున్నారు. ద్వీపంలోని అధికారులు, సిబ్బంది సహకారం లేకుండా అక్రమార్కులు లోపలికి ప్రవేశిస్తారా అనే అనుమానాలు కలుగుతున్నాయి. బీఐటీసీ మేనేజర్ రవీంద్ర ఆదేశాల మేరకు ద్వీపంలో తరచూ సిబ్బంది రౌండ్స్ వేస్తారు. గురువారం కూడా రౌండ్స్ వేస్తున్న దశలో దూరం నుంచి శబ్దాలు రావటాన్ని గుర్తించారు. అక్రమార్కులు చెట్లు నరకడాన్ని గమనించి వారిని నిలువరించారు. భిక్షాలు అనే వ్యక్తిని పట్టుకున్నారు. అనంతరం భిక్షాలును భవానీపురం పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

యూనిట్ మేనేజర్‌కు షోకాజ్

ద్వీపంలో చెట్లు నరికిన అక్రమార్కులు కొందరు సొసైటీ భూములన్న కొత్త వాదనను తెరపైకి తెస్తున్నారు. అయితే, అది అబద్ధమని పర్యాటకాభివృద్ధి సంస్థ అధికారులు చెబుతున్నారు. కాగా, భవానీ ఐల్యాండ్ యూనిట్ మేనేజర్ చెబితేనే చెట్లు నరికామని అక్రమార్కులు పోలీసులకు చెప్పినట్టు సమాచారం. ఈ విషయంలో నిజానిజాలు తెలుసుకునేందుకు విజయవాడ డివిజనల్ మేనేజర్ (డీవీఎం).. సదరు యూనిట్ మేనేజర్‌కు షోకాజు నోటీసు ఇచ్చారు.

చర్యలు తీసుకుంటాం - ఏపీటీడీసీ చైర్మన్

ఈ విషయంపై ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, భవానీ ద్వీపంలో చెట్ల నరికివేత విషయాన్ని ఏపీటీడీసీ ఎండీ దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఇందుకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పానన్నారు. భవానీ ద్వీపంలో చెట్ల నరికివేత అటవీ చట్టానికి విరుద్ధమని, బాధ్యులను, కారకులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని ఆయన చెప్పారు.

'అగ్రిగోల్డ్'లో జోగి అక్రమాలు నిజమే..

అంబాపురం భూముల్లో తనిఖీలు
నిర్ధారించిన అధికారుల బృందం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ హయాంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని మాజీమంత్రి జోగి రమేశ్ జప్తు చేసిన భూముల్లో అక్రమాలు చేశారని తేలిపోయింది. ఒక సర్వే నెంబరుతో సర్వే ధ్రువీకరణ పత్రం తీసుకుని మరో సర్వే నెంబరు భూమిలో రియల్ వ్యాపారం చేసినట్టు నిర్ధారణైంది. విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో ఉన్న అగ్రిగోల్డ్‌కు చెందిన భూమిని జోగి రమేశ్ ప్లాట్లుగా విభజించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన విషయం తెలిసిందే. జోగి కుమారుడు రాజీవ్ పేరుతో ఈ భూములు రిజిస్ట్రేషన్ చేయించారు. దీనిపై ఏసీబీ కేసు నమోదైంది. రాజీవ్‌ను అరెస్టు చేసి జైలుకు పంపగా, బెయిల్‌పై విడుదలయ్యాడు. అగ్రిగోల్డ్ సంస్థ ఖాతాదారులను మోసం చేయడంతో నమోదైన కేసులో సీఐడీ ఆ సంస్థకు సంబంధించిన చర, స్థిరాస్తులను జప్తు చేసింది. ఇందులో అంబాపురంలోని సర్వే 87లో ఎకరం భూమి జప్తు జాబితాలో ఉంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గృహనిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న జోగి రమేశ్ కన్ను ఆ భూమిపై పడింది. సర్వే నెంబరు 88లో సర్వే ధ్రువీకరణపత్రం తీసుకుని సర్వే నెంబరు 87లో ఉన్న ఎకరం భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించారు. దీనిపై సంయుక్త తనిఖీ చేసి, నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం రెవెన్యూ, ఏసీబీ, మిగతా 4లో..

వెలగలేరుకు వెలుగులు

- హెడ్ రెగ్యులేటర్‌కు చకచకా మరమ్మతులు
- 11 గేట్లకు రిపేర్ వర్కులు పూర్తి
- ఎగువ, దిగువన పూడిక పనులు
- వరద నిర్వహణకు తొలగనున్న అడ్డంకులు



వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ గేట్లకు రంగులు

వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నిర్వహణకు అడ్డంకులు తొలగిపోతున్నాయి. వరదల సమయంలో గేట్లు ఎత్తే సమస్యకు త్వరలో తెరపడనుంది. రెగ్యులేటర్ గేట్ల మరమ్మతులకు, పూడికతీత పనులకు కూటమి ప్రభుత్వం రూ.1.80 కోట్ల నిధులు కేటాయించడం, పనులు చకచకా జరుగుతుండటంతో స్థానిక రైతులతో పాటు సమీప గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి : వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ మరమ్మతు పనులు చకచకా జరుగుతున్నాయి. 11 గేట్లను బయటకు తీసి రిపేర్ చేస్తున్నారు. ప్రస్తుతం రంగులు వేస్తున్నారు. పాడైన బేరింగ్స్‌ను, స్క్రూరాడ్స్‌ను, హాయిస్ట్ బ్రిడ్జ్, మెకానిజం వంతెనపై ఉన్న మోటార్లను రీప్లేస్ చేస్తున్నారు. రెగ్యులేటర్ ఎగువన 200 మీటర్లు, దిగువన 200 మీటర్ల మేర పూడిక పనులు చేపట్టారు. ప్రస్తుతం ఆ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుత అకాల వర్షాలకు వాగులు పొంగి, బుడమేరుకు వరదలు వచ్చి, నీరు మిగతా 4లో..



పోడియం ఎదుట ఆందోళన చేస్తున్న సభ్యులు

బహిష్కరణ

జెడ్పీ సర్వసభ్య సమావేశం నుంచి సభ్యులు వాకౌట్

కనీస గౌరవం, రెండేళ్లుగా గౌరవ వేతనం ఇవ్వడంలేదని ఆందోళన

బయటకు వెళ్లిపోయిన సభ్యులతో జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో చర్చలు

తిరిగి రాకపోవడంతో సమావేశం వాయిదా

జిల్లా పరిషత్ సమావేశం సభ్యుల నినాదాలతో హోరెత్తింది. గ్రామాల్లో అభివృద్ధి పనుల సమాచారం ఇవ్వడంలేదని, రెండేళ్లుగా నిలిచిపోయిన గౌరవ వేతనం వెంటనే విడుదల చేయాలని సభ్యులు పోడియం ఎదుట ఆందోళనకు దిగారు. 'అధికారులు మా మాట వినడం లేదు. కనీస సమాచారం ఇవ్వడం లేదు. ఈ సమావేశాన్ని బహిష్కరిస్తున్నాం' అంటూ బయటకు వెళ్లిపోయారు. జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో చర్చలు జరిపినా సభ్యులు తిరిగి రాకపోవడంతో సమావేశం వాయిదా పడింది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం సభ్యుల ఆందోళన, బహిష్కరణ నేపథ్యంలో కొద్దిసేపటికే వాయిదా పడింది. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన జెడ్పీ కన్వెన్షన్ హాలులో గురువారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రారంభమైంది. తొలుత పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారు, ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సమావేశంలో జెడ్పీ నిధులు, ప్రభుత్వ నిధులతో మండల స్థాయిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలను పిలవడంలేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా సమావేశాలకు వస్తుంటే ఖర్చులు మిగతా 4లో..

టీడీపీ ఆవిర్భావమే సంచలనం

● నేడు దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తోంది
● ఎన్టీఆర్ స్ఫూర్తిని చంద్రబాబు కొనసాగిస్తున్నారు
● ఎన్టీఆర్ జిల్లా మినీ మహానాడులో పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం



ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలంటూ కార్యకర్త తెచ్చిన బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, శ్రీరాం తాతయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభి

ఇబ్రహీంపట్నం, మే 22(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ ఆవిర్భావమే ఒక గొప్ప సంచలనం. నేడు దేశ రాజకీయాలను ప్రభావితం చేయగలుగుతుందంటే అది స్వర్గీయ ఎన్టీఆర్ కృషి ఫలితమే. అరవై ఏళ్ల వయస్సులో పార్టీ స్థాపించి ప్రజలకు ఎనలేని సేవలందించిన ఎన్టీఆర్ స్ఫూర్తిని సీఎం నారా చంద్రబాబునాయుడు కొనసాగిస్తున్నారు.' అని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. గుంటుపల్లి సీఏ కన్వెన్షన్‌లో గురువారం పండుగలా నిర్వహించిన జిల్లా మినీ మహానాడులో ఆయన మాట్లాడారు. తొలుత నేతలు పార్టీ జెండాను ఆవిష్కరించాక, జ్యోతి ప్రజ్వలన చేసి ఎన్టీఆర్ ప్రతిమకు నివాళులర్పించారు. సభకు నెట్టెం అధ్యక్షత వహించారు. జగన్ లాంటి నియంతను తాను ఇప్పటివరకు చూడలేదని నెట్టెం అన్నారు. ఐదేళ్ల అరాచకపాలనలో టీడీపీ నేతలను, కార్యకర్తలను అనేక ఇబ్బందులు పెట్టాడని, వాటన్నింటినీ తట్టుకుని, నిలబడి అధికారం సాధించుకున్న తర్వాత జరుగుతున్న తొలి మహానాడు ఇది అని ఆయన అన్నారు. జిల్లాలో భారీగా టీడీపీ సభ్యత్వాలను చేసినందుకు నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు. రాష్ట్ర భవిష్యత్ కోసం పని చేయాలని క్యాడర్‌కు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ సంక్షేమానికి బాటలు వేస్తే, సీఎం చంద్రబాబునాయుడు సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని, దేశంలోనే కృష్ణా - గోదావరి నదులను అనుసంధానం చేసిన మార్గదర్శకుడు చంద్రబాబు అని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, కడపలో జరిగే మహానాడును జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. పార్టీని మరింత బలోపేతం చేద్దామని మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు పిలుపునిచ్చారు. తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన పార్టీ టీడీపీ అని, అందులో సభ్యునిగా ఉండటం గర్వంగా ఉందని, దార్శనికుడు సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని, పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాం తాతయ్య, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న, అధికార ప్రతినిధి రఫీ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు జంపాల సీతారామయ్య, బొమ్మసాని సుబ్బారావు, కె.విజయబాబు, ధారునాయక్, ఆనంద్ సూర్య పాల్గొన్నారు.


తరలివచ్చిన టీడీపీ శ్రేణులు

నీలాగా సూట్‌కేసు కంపెనీలు పెట్టే అలవాటు నాకు లేదు

● దమ్ముంటే లిక్కర్ స్కాం ఎవరి హయాంలో జరిగిందో చెప్పు
● మాజీ సీఎం జగన్‌కు ఎంపీ కేశినేని చిన్ని సవాల్

'నీలాగా సూట్‌కేసు కంపెనీలు పెట్టే అలవాటు నాకు లేదు. దమ్మూ ధైర్యం ఉంటే లిక్కర్ స్కాం ఎవరి హయాంలో జరిగిందో చెప్పాలి.' అని మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సవాల్ విసిరారు. జగన్ రెడ్డీ నువ్వు కేవలం ఎమ్మెల్యేవి.. నేను ఎంపీని.. నాస్థాయి ఎక్కువ అని గ్రహించు..నీలి మీడియాలో రాసే కంపెనీలు ఎక్కడున్నాయో చెప్పు. అని మినీ మహానాడు వేదికగా చిన్ని నిలదీశారు. వైసీపీ గూండాలు, ఆకురౌడీలు దౌర్జన్యాలు దాడులు చేయాలని ప్రయత్నిస్తే తెలుగు తమ్ముళ్లు తిప్పి కొట్టాలన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలకే తాను సమాధానం చెబుతానననీ, విదూషకులకు చెప్పబోనని స్పష్టం చేశారు.

ఎంపీ కేశినేని చిన్నిపై జగన్ ఆరోపణలు నిరాధారం

● మాజీ ఎంపీ కేశినేని నానీ పేటీఎం బ్యాచ్‌లో చేరారు
● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి

'ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)పై మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) పేటీఎం బ్యాచ్‌లో చేరారు. చిల్లరకు కక్కుర్తి పడి నాని చేసిన ఆరోపణలే జగన్ కూడా చేస్తున్నారు. బెంజిసర్కిల్‌లో కట్టిన హోటల్ ఎవరి పేరుపైన పెట్టావు? బ్యాంకులకు డబ్బులు ఎగొట్టి దగా చేశావు కాబట్టే గుమాస్తాలను డైరెక్టర్లుగా పెట్టుకున్నావు. బ్యాంకులను మోసం చేసిన నీతో మాట్లాడించేది తాడేపల్లి సైకో కాదా?' అని కేశినేని నానీని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాబి నిలదీశారు.

భారీ సంఖ్యలో తరలివచ్చిన టీడీపీ శ్రేణులు

ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి జిల్లా మినీ మహానాడుకు పెద్ద సంఖ్యలో టీడీపీ కుటుంబ సభ్యులు తరలివచ్చారు. అధికారంలోకి వచ్చాక, ఎన్టీఆర్ జిల్లాగా ఏర్పడిన తర్వాత జరిగిన తొలి మహానాడు కావడంతో నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. పార్టీ విధి విధానాలను, తీర్మానాలను ఆసక్తిగా విన్నారు. అనంతరం వచ్చిన వారికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు.

శ్రీ ఆంజనేయం..

ఇంద్రకీలాద్రిపై హనుమజ్జయంతి ప్రత్యేక పూజలు


ఘాట్‌రోడ్డులో ఆంజనేయస్వామికి పూజలు

ఇంద్రకీలాద్రి, మే 22 (ఆంధ్రజ్యోతి): పవిత్ర ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి హనుమజ్జయంతి సందర్భంగా గురువారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో క్షేత్రపాలక శ్రీఆంజనేయస్వామి, ఘాట్‌రోడ్డులో, పాతమెట్లు మార్గంలోని ఆలయాలలో అభిషేకాలు, నాగవల్లీ దళార్చన, రుద్రసహిత మన్యుసూక్త హోమ కార్యక్రమాలు, పూర్ణాహుతి మంత్రపూర్వకంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వీకే శీనా నాయక్ స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉప ప్రధాన అర్చకుడు శంకర శాండిల్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌర్ణమికి స్వర్ణకవచ, వజ్ర కిరీటధారిణిగా దర్శనమివ్వనున్న కనకదుర్గమ్మ

ఇంద్రకీలాద్రి, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌర్ణమి రోజున కనకదుర్గమ్మ స్వర్ణకవచంతో భక్తులకు దర్శనమిస్తుండగా, ఇకపై స్వర్ణ కవచం, వజ్ర కిరీటంతో దర్శనమిచ్చేలా ఏర్పాట్లు చేయాలని దేవస్థానం వైదిక కమిటీ సభ్యులకు ఈవో శీనా నాయక్ సూచించారు. దుర్గామల్లేశ్వరస్వామివార్ల సన్నిధిలో వైదిక కార్యక్రమాలు మరింత వైభవంగా జరిగేందుకు, నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు, ఆషాఢ, శ్రావణ మాసాలలో ఏర్పాట్లపై ఆలయ ఈవో వీకే శీనా నాయక్ గురువారం దేవస్థానం వైదిక కమిటీ, ప్రధాన అర్చకులు, వేద పండితులతో సమావేశం నిర్వహించారు. ప్రధాన అర్చకులు దుర్గాప్రసాద్, మల్లేశ్వరశాస్త్రి, సుందరబాబు, ఉప ప్రధాన అర్చకులు శంకర శాండిల్య, కోట రవికుమార్, ఆర్.శ్రీనివాస శాస్త్రి, ఏఈవోలు పాల్గొన్నారు.


డాక్టర్ లగడపాటి సంగయ్య రచించిన కావ్యాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య డాక్టర్ కొలకనూరి ఇనాక్

సమాజహితాన్ని కాంక్షించే కవి డాక్టర్ లగడపాటి సంగయ్య

● పల్లె పట్టణం, ఆంధ్ర రఘువంశం, తెలుగుధీర శతకం కావ్యాలు ఆవిష్కరించిన ఆచార్య కొలకనూరి ఇనాక్

నందిగామ, మే 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ లగడపాటి సంగమేశ్వరరావు (సంగయ్య) సమాజ హితాన్ని కాంక్షించే కవి అని ఆచార్య డాక్టర్ కొలకనూరి ఇనాక్ అన్నారు. పట్టణానికి చెందిన సంగయ్య రచించిన పల్లెపట్టణం, ఆంధ్ర రఘువంశం(పద్యకావ్యం), తెలుగుధీర శతకం కావ్యాలను హైదరాబాద్ రవీంద్రభారతిలో కిన్నెర ఆర్ట్ థియేటర్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. పల్లె సంస్కృతి సంప్రదాయాలు పట్టణాల్లోనూ ఉండాలన్నదే రచయిత ఆరాటమని ఇనాక్ అన్నారు. డాక్టర్ లగడపాటిని 'కిన్నెర' ప్రతినిధులు సత్కరించారు. పల్లెపట్టణం కావ్యాన్ని తన సతీమణి రమాదేవికి, తెలుగుధీర శతకాన్ని తన అమ్మమ్మకు డాక్టర్ లగడపాటి అంకితమిచ్చారు. డాక్టర్ ఓలేటి పార్వతీశం, ఆయాచితం శ్రీధర్, డాక్టర్ బీరం సుందరరావు, మద్దాలి రఘురాం పాల్గొన్నారు.

స్త్రీనిధి యాప్‌తో మహిళలకు మేలు

● డిజిటల్ విధానంలో రుణాల చెల్లింపుతో సమయం ఆదా, పారదర్శకత
● యాప్ ప్రారంభం సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్


స్త్రీనిధి యాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

వన్‌టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ మహిళల ఆర్థిక పురోగతిని మరింత వేగవంతం చేసేందుకు స్త్రీనిధి సంస్థ ఆధునిక సాంకేతికత వైపు అడుగులు వేసి, యాప్‌ను తీసుకురావడం అభినందనీయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం బస్‌స్టేషన్‌లో సెర్ప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో స్త్రీ నిధి యాప్‌ను సెర్ప్, స్త్రీనిధి, యూనియన్ బ్యాంకు అధికారులతో కలిసి మంత్రి ప్రారంభించారు. స్త్రీనిధి యాప్ ఉపయోగించి డిజిటల్ విధానంలో రుణాల చెల్లింపులతో సమయం ఆదా అవుతుందని, మరింత పారదర్శకంగా ఉంటుందని ఆయన తెలిపారు. యాప్ వాడకంపై రుణాలు తీసుకున్న మహిళలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. స్త్రీనిధి-ఆంధ్రప్రదేశ్, డిజిటల్ విధానం ద్వారా రుణాలను చెల్లించే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల సహకారంతో పేద మహిళలకు రుణాలను మొబైల్ టెక్నాలజీ, బయోమెట్రిక్ వంటి ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా 48 గంటల్లోపు అందించేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ రుణాల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయడానికి, ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత, భద్రమైన చెల్లింపుల్లో మరింత పురోగతిని సాధించడం కోసం ఈ యాప్‌ను రూపొందించినట్లు ఆయన తెలిపారు. డిజిటల్ పేమెంట్ యాప్‌లో యూనియన్ బ్యాంకును భాగస్వామిగా చేసుకున్నందుకు ఆనందంగా ఉందని యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ భాస్కర్‌రావు తెలిపారు. సెర్ప్ సంస్థలో స్త్రీనిధి అంతర్భాగమని, గ్రామీణ, పట్టణాల్లో ఉన్న పేద మహిళల ఆర్థికాభివృద్ధికి పాటుపడుతోందని సెర్ప్ సీఈవో వాకాటి కరుణ అన్నారు. స్త్రీనిధి, సెర్ప్, బ్యాంకు అధికారులు, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు సహకరించండి

● రాజకీయ పార్టీల నేతలతో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం

కలెక్టరేట్, మే 22(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో అధికారులకు సహకరించాలని, అర్హులైన యువత ఓటర్లుగా నమోదయ్యేలా ప్రోత్సహించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసీఐ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈఆర్వో, డీఈవో, సీఈవో తమతమ పరిధిలో ప్రతినెలా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఓటర్ల జాబితాలో ఎవరైనా మరణించినా, శాశ్వతంగా వలస వెళ్లినా వారి పేర్లను బీఎల్వోకు తెలియపరచాలన్నారు. ఓటరు జాబితాలో ఏవైనా మార్పులు, ఓటరు కార్డులో ఏవైనా తప్పులుంటే ఫాం-8 నమోదు చేసి, సరిచేసేందుకు సహకరించాలని కోరారు. జిల్లాలో ఫాం-6, ఫాం-7, ఫాం-8 అర్జీల వివరాలను తెలియజేసి సమాచారాన్ని రాజకీయ పక్షాలకు అందజేశారు. శ్రీకాకుళం నుంచి బాపట్ల జిల్లా వరకు 1 నుంచి 100 నంబర్ల నియోజకవర్గాల వరకు ఒక్కో నియోజకవర్గం నుంచి ఒక్కో బీఎల్వో లేదా బీఎల్వో సూపర్‌వైజర్‌కు జూన్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో మొదటి విడత శిక్షణ ఉంటుందని ఎన్నికల సంఘం తెలియజేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ సలీం, డీవీ కృష్ణ(సీపీఎం), కె.పరమేశ్వరరావు(ఆప్), తరుణ్ కాకాని(బీజేపీ), బి.అనిల్(టీడీపీ), జె.శ్రీనివాస్(జనసేన) పాల్గొన్నారు.

ఏపీఈఏపీసెట్‌కు 7317 మంది హాజరు

బెంజిసర్కిల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఈఏపీసెట్-2025 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలకు గురువారం ఎన్టీఆర్ జిల్లా నుంచి 7317 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 7790 మంది దరఖాస్తు చేసుకోగా 7317 మంది పరీక్షకు హాజరయ్యారు. 93.93శాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. అదేవిధంగా కృష్ణాజిల్లా నుంచి 1011మంది దరఖాస్తు చేసుకోగా 974 మంది పరీక్షలకు హాజరయ్యారు. 96.34 శాతం నమోదైనట్టు అధికారులు పేర్కొన్నారు.

త్వరలో సర్క్యులర్ ఎకానమీపై పాలసీ

● పీసీబీ చైర్మన్ కృష్ణయ్య

విజయవాడ, మే 22 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో వ్యర్థాలు రాకుండా చేయడం ఒక ఎత్తయితే వాటిని పునర్వినియోగం చేయడం మరో ఎత్తని కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జీరో వేస్ట్‌పై సర్క్యులర్ ఎకానమీ థీమ్‌తో విజయవాడలోని ప్రైవేటు హోటల్‌లో రెండు రోజులపాటు నిర్వహించే సదస్సును గురువారం ప్రారంభించారు. త్వరలో ప్రభుత్వం సర్క్యులర్ ఎకానమీపై ఒక విధానాన్ని రూపొందించబోతుందన్నారు. సర్క్యులర్ ఎకానమీ ద్వారా కొత్త పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ.. వ్యర్థాల నిర్వాహణలో భాగంగా సర్క్యులర్ ఎకానమీపై రాష్ట్రం దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. రీసైక్లింగ్ ఇండస్ట్రీస్ ఏర్పాటుతో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. 2047 నాటికి సర్క్యులర్ ఎకానమీ రూ. 2 ట్రిలియన్లకు చేరుకుంటుందన్నారు. 2030 నాటికే రూ. 4 వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.అనంతరాము మాట్లాడుతూ.. జీరో వేస్ట్‌పై సర్క్యులర్ ఎకానమీపై విజన్‌తో అడుగులు పడ్డాయన్నారు. రీసైక్లింగ్‌ను సక్రమంగా వినియోగిస్తే వ్యర్థాల నుంచి సంపద సృష్టి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ముఖ్యకార్యదర్శి శరవణన్, ఏపీఈఎంసీ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21 వరకు బీఆర్టీఎస్ రోడ్డులో 'యోగాంధ్ర'

● రోజూ ఉదయం ప్రత్యేక యోగా కార్యక్రమాలు
● విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపు


యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర

కలెక్టరేట్, మే 22(ఆంధ్రజ్యోతి): మాసోత్సవాల్లో భాగంగా యోగాంధ్ర ప్రచార కార్యక్రమాన్ని ప్రభుత్వం ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు నిర్వహిస్తోందని, అందులో భాగంగా విజయవాడలోని బీఆర్టీఎస్ రోడ్డులో రోజూ ఉదయం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని విజయవంతం చేయాలని ప్రజలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా గురువారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బీఆర్టీఎస్ రోడ్డు సత్యనారాయణపురం వద్ద నిర్వహించిన ప్రత్యేక యోగా బ్యాస కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొని యోగాసనాలను సాధన చేశారు. ఇతివృత్తం ఆధారిత యోగా సెషన్లతో పాటు వివిధ పర్యాటక ప్రాంతాల్లోనూ కార్యక్రమాలు నిర్వహించనున్నామని కలెక్టర్ తెలిపారు. ట్రైనర్లు, పౌరుల రిజిస్ట్రేషన్‌కు ఏర్పాటు చేస్తున్నామని, ఈనెల పాటు యోగాసనాల అభ్యసనతో పాటు ఆసనాల ప్రదర్శన, సూర్య నమస్కార్, ప్రాణాయామ ప్రదర్శన, గ్రూప్ యోగా, ఆర్టిస్టిక్ యోగా...ఇలా వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిలో నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విజయవాడ అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథరెడ్డి, ఇన్‌చార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, కె.ప్రభుదాస్, కె.షమ్మీ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో నిత్యావసరాల పంపిణీకి ఏర్పాట్లు చేయండి

● దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటివద్దే రేషన్ అందించండి
● డీలర్లకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం

కలెక్టరేట్, మే 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయం మేరకు జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని, దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటివద్దే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని, పంపిణీలో పారదర్శకత పాటించాలని డీలర్లను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీపై గురువారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పౌర సరఫరాల అధికారులు, రేషన్ దుకాణాల డీలర్లు, డీలర్ల అసోసియేషన్ల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రేషన్ దుకాణాలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు సేవలందించాలన్నారు. ప్రజాప్రతినిధులు రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, ఇందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ-పోస్, వెయింగ్ మెషీన్ల రిపేర్లకు సర్వీసు క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. డీఎస్వో ఎ.పాపారావు, ఏఎస్వోలు చల్లా లక్ష్మీనారాయణరెడ్డి, ఎన్.లక్ష్మణబాబు, డీలర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ ఎం.వెంకటరావు, జిల్లా ప్రెసిడెంట్ యు.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పి.శివప్రసాద్, జిల్లా ట్రెజరర్ ఎం.భూషణం, పౌర సరఫరాల డీటీలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

బహిష్కరణ

(3వ పేజీ తరువాయి)

అధికమైపోతున్నాయని, రెండేళ్లుగా గౌరవ వేతనం ఇవ్వడం లేదంటూ పోడియం ఎదుటకు వచ్చి సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో సమావేశంలో గందరగోళం ఏర్పడింది. 'అధికారులు మా మాట వినడం లేదు. కనీస సమాచారం ఇవ్వడం లేదు. ఈ సమావేశాన్ని బహిష్కరిస్తున్నాం' అంటూ సభ్యులు సమావేశపు హాల్ నుంచి వెళ్లిపోయారు. బయట నిలబడి ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలకు అధికారులు కనీస సమాచారం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం వెంటనే విడుదల చేయాలని కోరుతూ నినాదాలు చేశారు.

లిక్కర్ స్కామ్‌లో జగన్ రెడ్డి జైలుకెళ్లడం ఖాయం

● ఉమ్మడి రాష్ట్ర ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశరావు

వన్‌టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కాం స్థాయి స్కాం దేశంలో ఎక్కడా జరగలేదని, త్వరలో జగన్ జైలుకు వెళ్లడం ఖాయమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశరావు అన్నారు. గురువారం గురునానక్ కాలనీలోని టీడీపీ విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన లిక్కర్ స్కామ్‌పై విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ మద్యం అమ్మకాల్లో డిజిటల్ పేమెంట్ లేకుండా నగదు మాత్రమే ఎందుకు తీసుకున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మద్యం పాలసీపై మంత్రుల సంతకాలు ఉంటాయా? అని ప్రశ్నించటం జగన్ అవివేకానికి నిదర్శనమన్నారు. మంత్రులు తీసుకున్న పాలసీలను అధికారులు అమలు చేస్తారని వివరించారు. లిక్కర్ స్కామ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటూ అరెస్టు అయిన వారు ఒక్కొక్కరూ నిజాలు ఒప్పుకుంటున్నారని, విజయసాయి రెడ్డి లిక్కర్ స్కామ్‌కు కర్త, కర్మ, క్రియ రాజ్ కసిరెడ్డి అని చెప్పటం జరిగిందన్నారు. మద్యం స్కామ్‌లో ప్రజల సొమ్ము, ప్రభుత్వ సొమ్ము లూటీ చేసిన జగన్‌కు శిక్ష తప్పదన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

● ఎన్టీఆర్ జిల్లా మినీ మహానాడులో తీర్మానం

ఇబ్రహీంపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ నందమూరి తారకరామారావుకు భారతరత్న ఇవ్వాలని గురువారం గుంటుపల్లి సీఏ కన్వెన్షన్‌లో నిర్వహించిన టీడీపీ ఎన్టీఆర్ జిల్లా మినీ మహానాడులో పార్టీ నేతలు, కార్యకర్తలు తీర్మానం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట, విజయవాడ సెంట్రల్, పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల పరిధిలో అనేక సమస్యలు, అభివృద్ధి పనులపై తీర్మానాలు చేశారు. జిల్లాలో 7 నియోజకవర్గాల పరిధిలో పార్టీ కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలకు జిల్లా, రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. 'మైలవరం నియోజకవర్గంలో బుడమేరు పునరుద్ధరణ పనులు చేపట్టాలి. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనుల్ని త్వరగా పూర్తి చేయాలి. జి.కొండూరులో ఇండస్ట్రియల్ క్యారిడర్ డెవలప్‌మెంట్ చేయాలి. ఇబ్రహీంపట్నంలోని ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యాన్ని నివారించాలి. జగ్గయ్యపేట నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో పూర్తి చేయలేకపోయిన ముక్త్యాల ఎత్తిపోతల పథకం సత్వరమే పూర్తి చేయాలి. తువ్వ కాలువ భారీ గండ్లను పూడ్పించేందుకు రూ.3 కోట్లు నిధులు మంజూరు చేయాలి. కొణతమాత్మకూరు, గొల్లమూడి, పెనుగంచిప్రోలు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు అకాల వర్షాల వరదలకు దెబ్బతిన్న వాటికి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి. పాలేరునదిపై కె.అగ్రహారం వంతెన, బూదవాడ - అన్నవరం బ్రిడ్జ్‌లకు, మునేరుపై లింగాల వద్ద ఉన్న బ్రిడ్జ్ పునర్నిర్మాణం చేయాలి' అని తీర్మానించారు.

'అగ్రిగోల్డ్'లో జోగి అక్రమాలు నిజమే..

(3వ పేజీ తరువాయి)

సీఐడీ, సర్వే శాఖల అధికారులతో ఒక బృందాన్ని నియమించింది. ఇందులో అధికారులు గురువారం అంబాపురంలో సర్వే చేశారు. అక్కడ జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. ఈ ఎకరం భూమిని తొమ్మిది ప్లాట్లుగా విభజించారు. ఈ భూముల్లో ప్రహరీ నిర్మించారు. లే అవుట్‌లో రహదారి ని చూపించారు. అధికారులు పరిశీలిస్తున్న విషయాన్ని తెలుసుకున్న ప్లాట్ల యజమానులు అక్కడికి వచ్చారు. వారిని అధికారులు విచారణ చేశారు. తమకు ఈ భూములను జోగి రాజీవ్ విక్రయించినట్టు వివరించారు. భూమిలో ఉన్న హద్దులను రాసుకుని అధికారుల బృందం ఒక నివేదికను రూపొందించింది. దీన్ని త్వరలో ఏసీబీ అధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

కొత్త బస్సులకు గ్రీన్‌సిగ్నల్

(3వ పేజీ తరువాయి)

పూర్తి చేశారు. వాటిని రీజియన్ పరిధిలోని జగ్గయ్యపేట, తిరువూరు, ఆటోనగర్, విజయవాడ బస్ డిపోలకు తరలించారు.

మొత్తం 75 సూపర్ లగ్జరీ బస్సులు

ఎన్టీఆర్ జిల్లాకు తొలిదశలో 75 సూపర్ లగ్జరీ బస్సులు వచ్చాయి. ఈ బస్సులన్నీ హైఎండ్ శ్రేణిలోనివే. వీటికి దాదాపు రెండు నెలల పాటు రిజిస్ట్రేషన్ జరక్కపోవటం వల్ల నష్టం వాటిల్లింది. ఇటీవల రోడ్డు సేఫ్టీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ప్రయాణికులను తరలించే రవాణా వాహనాలకు కచ్చితంగా ఫైర్ ప్రొటెక్షన్ సిస్టమ్ (ఎఫ్‌పీఎస్)ను ఏర్పాటు చేయాలని నిర్దేశించింది. అయితే, ఈ నిబంధనలు రాక ముందే ఆర్టీసీ కొత్త బస్సులకు ఆర్డర్ ఇచ్చేసింది. ఆ బస్సులు డెలివరీ కావటానికి జాప్యం జరిగింది. చాసిస్‌లకు బాడీ బిల్డింగ్‌కు ఇచ్చిన తర్వాత ఆదేశాలు వచ్చాయి. ఈ ఆదేశాల గురించి ఆర్టీసీ అధికారులకు అవగాహన లేకపోవటం వల్ల బాడీ బిల్డింగ్ పూర్తి చేసుకున్న బస్సులను రిజిస్ట్రేషన్ చేయించటానికి పంపగా, రవాణా శాఖ అధికారులు తిరస్కరించారు. ఎఫ్‌పీఎస్‌ను ఏర్పాటు చేస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు.

ఎఫ్‌పీఎస్ అంటే..

ఎఫ్‌పీఎస్ అనేది ప్రయాణికుల భద్రత కోసం ఏర్పాటు చేసే వ్యవస్థ. ఇటీవల కాలంలో బస్సుల నుంచి పొగ వచ్చి కాలిపోతున్న ఉదంతాలను చూస్తున్నాం. ఇలాంటి సందర్భాల్లో ఈ వ్యవస్థ ద్వారా బస్సులో అగ్ని ప్రమాదాలను ముందే గుర్తించి ప్రయాణికులను అప్రమత్తం చేయటంతో పాటు బస్సును కూడా కాపాడవచ్చు. డ్రైవర్ క్యాబిన్, ప్రయాణికుల కంపార్ట్‌మెంట్లలో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్ ఉపయోగిస్తారు. ఇవి అగ్ని ఎంత తీవ్రస్థాయిలో ఉన్నా మంటలను ఆర్పుతాయి. ఒకవేళ ఇంజన్ నుంచి మంటలు వచ్చినా ఫోమ్‌ను భారీగా వెదజల్లి ఆ బస్సు అగ్నికి ఆహుతి కాకుండా చేస్తాయి. ఒక ఎఫ్‌పీఎస్ ఏర్పాటుకు రూ.2 లక్షలు ఖర్చవుతుంది. అన్ని బస్సులకు ఈ బడ్జెట్ కేటాయించటం ఇప్పుడు ఆర్టీసీకి ఇబ్బందే. ఈ వ్యవస్థను బస్సు బాడీ బిల్డింగ్ సమయంలోనే ఏర్పాటు చేయాలి. కొత్త బస్సుల్లో ఏర్పాటు చేయాలంటే బాడీ బిల్డింగ్ మొత్తం తొలగించాలి. దీనికి ప్రతిగా ఫైర్ డిటెక్టివ్ అలారం (ఎఫ్‌డీఏ) ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ అధికారులు హామీ ఇచ్చారు. దీనిని డ్రైవర్ వద్ద ఏర్పాటు చేస్తారు. బస్సులో ఏ భాగం నుంచి పొగలు వచ్చినా అలారం మోగుతుంది. వెంటనే డ్రైవర్ ప్రయాణికులను అప్రమత్తం చేస్తాడు.

వెలగలేరుకు వెలుగులు

(3వ పేజీ తరువాయి)

రెగ్యులేటర్ వరకు చేరుకోకుండా, బుడమేరు వరద మళ్లింపు కాల్వ (బీడీసీ) ద్వారా కృష్ణానదిలోకి మళ్లించేలా రక్షణ గోడను నిర్మించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేసి గోడల మధ్యలో గేట్లను ఏర్పాటు చేస్తామని, హాయిస్ట్ బ్రిడ్జ్‌పై మోటార్లను రీప్లేస్ చేస్తామని ఏఈ వెంకటేశ్ తెలిపారు.

వైసీపీ పాపం.. రెగ్యులేటర్‌కు శాపం

1960లో రెగ్యులేటర్ నిర్మాణం జరిగాక ఎన్నడూ రానంత వరద గత సెప్టెంబరు 1న వచ్చింది. రెగ్యులేటర్ వద్దకు సుమారు 30 వేల క్యూసెక్కుల నీరు వచ్చింది. దీంతో గేట్లు ఎత్తకుండానే వరద నీరు బుడమేరు వరద మళ్లింపు కాల్వ ద్వారా మళ్లించారు. బీడీసీ సామర్థ్యానికి మించి వరద రావడంతో రెగ్యులేటర్ వద్ద నుంచి సుమారు నాల్గో కిలోమీటర్ వద్ద కట్టకు మూడుచోట్ల భారీ గండ్లు పడ్డాయి. ఆ వరద అంతా విజయవాడలోని పల్లపు ప్రాంతాలను ముంచేసింది. అయినా వరద తగ్గలేదు. గేట్లు ఎత్తకుంటే రెగ్యులేటర్ మొత్తం వరదకు కొట్టుకుపోయేది. తప్పనిసరి పరిస్థితుల్లో గేట్లు ఎత్తి వరదను దిగువకు విడుదల చేసి రెగ్యులేటర్‌ను కాపాడుకోగలిగారు. దీనివల్ల రెగ్యులేటర్ బేరింగ్స్, స్క్రూరాడ్స్ మోటార్లు పాడయ్యాయి. 2019-24 వైసీపీ హయాంలో ఇరిగేషన్ శాఖను నిర్లక్ష్యం చేసింది. రెగ్యులేటర్ నిర్వహణకు పైసా విదల్చకపోవడం, గేట్లకు కనీసం గ్రీజ్ పెట్టకపోవడంతో పాడైపోయాయి. అప్పుడే రెగ్యులేటర్ మెయింటెనెన్స్‌కు నిధులు ఇచ్చి ఉంటే గేట్లు సవ్యంగా పనిచేసి ఎంతో కొంత వరదను ఆపే వీలుండేది.

అన్నదాతలు, ప్రజల హర్షం

బుడమేరుకు వరద అనగానే వెలగలేరు, కవులూరు, ఈలప్రోలు, పైడూరుపాడు, రాయనపాడు గ్రామాల ప్రజలు హడలిపోతారు. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నిర్వహణ సరిగ్గా ఉంటే వరద ముంపు సాధ్యమైనంత వరకు నివారించవచ్చని వారు చెబుతారు. రెగ్యులేటర్ గేట్లు ఎత్తకుండా సుమారు 13,500 క్యూసెక్కుల వరద నీటిని బుడమేరు వరద మళ్లింపు కాల్వ ద్వారా కృష్ణానదిలో కలుపుతారు. అంతకుమించి వరద వస్తే రెగ్యులేటర్ గేట్లు కొంతమేర ఎత్తి, దాని దిగువ ఉన్న కాల్వ ద్వారా కొల్లేటిలోకి వరద వెళ్లేలా చూస్తారు. ఇందుకు రెగ్యులేటర్ గేట్లు ఎప్పటికప్పుడు కండీషన్‌లో ఉంచుకోవాలి. ప్రస్తుతం వీటి మరమ్మతులకు నిధులు కేటాయించడం, పనులు కొనసాగుతుండటంతో వరద నిర్వహణ సవ్యంగా సాగుతుందని అన్నదాతలు, పలు గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

విజయవాడ తూర్పు

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

గుణదల, మే 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం మాచవరం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వహణ ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. మాచవరం బీఆర్టీఎస్ రోడ్, క్యాన్సర్ హాస్పటల్ ఏరియా, నార్లవారి వీధి, కుటుంబరావు వీధి, బుల్లెమ్మవీధి, అక్కుళ్ల తాతయ్య వీధి, దుగ్గిరాల బలరామ కృష్ణయ్య వీధి, మాచవరం రైవస్ కాల్వ ఏరియా, పడవలరేవు సెంటర్ బీఆర్టీఎస్ రోడ్‌నుంచి మాచవరం ఆంజనేయస్వామి గుడి మధ్య ఉన్న ఏలూరు రోడ్ వైపు ఏరియాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గనుందని చెప్పారు.

పుల్లేటికట్ట డ్రెయిన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

ఎంపీ కేశినేని శివనాథ్

గుణదల, మే 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గంలోని ప్రధాన సమస్యల్లో ఒకటైన పుల్లేటికట్ట డ్రెయిన్ నిర్మాణం, రోడ్డు విస్తరణ సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తెలిపారు. తూర్పు పరిధి 3వ డివిజన్లో గుణదల పంచాయతీ ఆఫీస్ రోడ్ పోస్టాఫీసు ఏరియాల్లో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కార్పొరేటర్ దేవినేని అపర్ణలు గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, స్థానికులతో కలిసి పుల్లేటికట్ట రోడ్డును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చడానికి కూటమి ప్రభుత్వం మళ్లీ చర్యలు చేపట్టిందని చెప్పారు. అందులో భాగంగానే పుల్లేటికట్ట డ్రెయిన్ నిర్మాణంతోపాటు ఏకకాలంలో రోడ్డు విస్తరణ పనులుకూడా చేపట్టనున్నట్లు తెలిపారు. దీనికి అందరినీ సమన్వయం చేసుకుంటూ వెళ్లనున్నట్లు చెప్పారు. రోడ్డును రెండు పక్కల విస్తరించనున్నామన్నారు. దీనికి గాను పలు కాలనీల రోడ్లను తాత్కాలికంగా మూసేయాల్సి వస్తుందని దానికి స్థానికులు సహకరించాల్సి ఉంటుం దన్నారు. ఈ అంశంపై మున్సిపల్ కమిషనర్‌తో చర్చించనున్నట్లు తెలిపారు. ఈఎస్ఐ హాస్పటల్ నుంచి రమేష్ హాస్పటల్ వరకు డ్రెయిన్ పనులు ప్రారంభించ నున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ తూర్పులో చిన్నపాటి వర్షానికి కూడా కాలనీలు జలమయం కావడం, హైవే వరకు ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండటం వల్ల ఈ సమస్య పరిష్కారానికి ఎంత ఖర్చయినా నిధులు మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సుముఖంగా ఉన్నారని తెలిపారు. కార్పొరేటర్లు అపర్ణ, ముమ్మనేని ప్రసాద్, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి దేవినేని చందు, బొప్పన భవకుమార్, జనసేన నాయకులు గుత్తికొండ కృష్ణమోహన్, సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఏసీపీ, ఈఈ పాల్గొన్నారు.



పుల్లేటికట్ట డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె, కార్పొరేటర్ అపర్ణ తదితరులు



మంత్రి కొలుసు పార్థసారథిని సత్కరిస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ నేతలు

గ్రీన్‌ట్యాక్స్ తగ్గింపుపై లారీ ఓనర్స్ హర్షం

బెంజిసర్కిల్, మే 22 (ఆంధ్రజ్యోతి): రవాణా వాహనాలపై గత ప్రభుత్వం హరితపన్నును పెంచ డాన్ని కూటమి ప్రభుత్వం సమీక్షించి గణనీయంగా తగ్గించడం పట్ల ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగమోతు రాజా, ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు వారు గురువారం రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార మంత్రి కొలుసు పార్థసారథిని కలిసి రాష్ట్రప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపి మంత్రిని సత్కరించారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అల్లాడ సత్యనారా యణ, కార్యదర్శి రావి శరత్‌బాబు, కోశాధికారి చంద్రశేఖర రావు, స్టీరింగ్ కమిటీ సభ్యులు చెన్నుపాటి వజీర్, సురేష్ పాల్గొన్నారు.

రాజా రామ్మోహన్ రాయ్ జయంతి

గవర్నర్‌పేట, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎంజీ రోడ్డులోని రామ్మోహన్ పౌర గ్రంథాలయంలో గురువారం రాజా రామ్మోహన్ రాయ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్రరావు, సభ్యులు కోటా కృష్ణ భగవాన్, పి.చిదంబరేశ్వరరావు, మాధవ రావు పాల్గొన్నారు.







భక్తాంజనేయ స్వామి గుడిలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గద్దె క్రాంతి, కొక్కెర తిరుపతయ్య, పటమట పంచముఖ అభయాంజనేయస్వామి ధ్యాన మందిరంలో అన్నదానం, బెంజిసర్కిల్‌లోని తిరుమలరాయ మారుతీ మందిరంలో పూజలు

భక్తిశ్రద్ధలతో హనుమత్ జయంతి



కరెన్సీనగర్ దాసాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

రాణిగారితోట, మే 22 (ఆంధ్రజ్యోతి): రాణిగారితోట 18వ డివిజన్ తారక రామ నగర్‌లోని శ్రీ భక్తాంజనేయ స్వామి గుడిలో కమిటీ సభ్యుడు మచ్చ శివప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం హనుమన్ జయంతి వేడుకలు నిర్వహించారు. టీడీపీ యువ నాయకుడు గద్దెక్రాంతి పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం టీడీపీ తూర్పు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కొక్కెర తిరపతయ్య యాదవ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి తిరుపతయ్య యాదవ్ రూ.70వేలు విరాళం అందించగా, గద్దె క్రాంతి కూడా విరాళం అందజేయగా, 2వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

అన్నదానం

రామలింగేశ్వరనగర్: 14, 15 డివిజన్లలో గాంధీకాలనీ, చినవంతెన సెంటర్, ఎన్ఎస్ఎం స్కూల్ రోడ్డులో ఉన్న దేవాలయాల్లో హనుమత్ జయంతి వేడుకలు జరిగాయి. 15వ డివిజన్ గాంధీ కాలనీలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీకి అన్నదానం నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి వడ్డించారు. రెండు వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. జనసేన 15వ డివిజన్ నాయకుడు గాదిరెడ్డి అమ్ములు, చిన్నం ఈశ్వరరావు, దార జయరామకృష్ణ శాస్త్రి, వల్లభనేని నరసింహారావు, పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు

పటమట: పటమట ఎలక్ట్రిసిటీ కాలనీ, నలూరి చక్రధరరావు రోడ్డులో శ్రీ పంచ ముఖ అభయాంజనేయస్వామి ధ్యాన మందిరం ప్రథమ వార్షికోత్సవాన్ని, హనుమత్ జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామికి సుప్రభాత సేవ, విశేష సూత ఫలాసహిత నాగవల్లిసహస్ర నామార్చన నిర్వహించారు. శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించారు. ధాన్య మందిర గౌరవ ముఖ్య సలహాదారులు శాఖమూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 7 వేల మందికి అన్నదానం చేశారు. కాలనీ గౌరవాధ్యక్షుడు నల్లూరి కాశి, అధ్యక్షుడు గర్నేని చలపతిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బెంజిసర్కిల్‌లోని మారుతీ మందిరంలో ..

బెంజిసర్కిల్: బెంజిసర్కిల్‌లోని తిరుమలరాయ మారుతీ మందిరంలో స్వామికి అభిషేకం, తమలపాకుపూజ, అర్చన, కల్యాణ కార్యక్రమాలు జరిగాయి. ఆలయం ప్రధాన పూజారి అనిల్‌కుమార్, సహాయ పూజారి రవిశర్మలు స్వామికి పూజలు నిర్వహించారు. కార్పొరేటర్లు చెన్నుపాటి క్రాంతిశ్రీ, జాస్తి సాంబశివరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం కమిటీ నేతలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దాసాంజనేయ స్వామి ఆలయంలో...

భారతీనగర్: కరెన్సీనగర్ దాసాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామభక్త సేవాసమితి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయంలో స్వామికి పంచామృత అభిషేకాలు, సహస్రనామ ఆకు పూజ, మంత్ర పుష్పార్చన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భక్తులు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

మాచవరం ఆలయంలో...

గుణదల: మాచవరంలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు ముఖ్య అతిథిగా మంత్రి అచ్చెన్నాయుడు విచ్చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారిణి పాతూరి లోకేశ్వరి, ఆలయ అర్చకులు మంత్రిని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక ఆకుపూజలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా సెంట్రల్ ఎమ్మెల్యే విచ్చేసి దాసాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బొండా ఉమాలను ఆలయ మర్యాదలతో సత్కరించి దాసాంజనేయస్వామి చిత్రపటాన్ని అందజేశారు.

'పాలస్తీనా ముఖచిత్రం' పుస్తకావిష్కరణ

గాంధీనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఇజ్రాయెల్ దురాక్రమణకు, వివక్షకు గురై, ఆశించినస్థాయిలో ప్రపంచ దేశాల నుంచి మద్దతు లభించని పాలస్తీనాకు మానవత్వంతో ప్రపంచ యావత్తు అండగా ఉండాలని కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బుడిగ జమీందర్ పిలుపునిచ్చారు. రైతుకూలీ సంఘం (ఏపీ) రూపొందించిన 'పాలస్తీనా ముఖచిత్రం' పుస్తకావిష్కరణ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా అండదండలు, సామ్రాజ్యవాద దేశాల కనుసన్నలతో పాలస్తీనాను ఇజ్రాయెల్ నాశనం చేసిందని ధ్వజమెత్తారు. జనసాహితీ అధ్యక్షుడు దివి కుమార్ మాట్లాడుతూ ఇజ్రాయెల్ పాలస్తీనాపై చేసే దాడులను అమెరికా ఎందుకు నియంత్రించడం లేదని ప్రశ్నించారు. ఏపీటీఎఫ్ మాజీ ప్రధానకార్యదర్శి పాండురంగ వరప్రసాద్, మాట్లాడుతూ పాలస్తీనాలోని సహజ వనరులను కొల్లగొట్టేందుకే ఆదేశంపై ఇజ్రాయెల్ దాడులు చేస్తుందని ఆరోపించారు. ఆలిండియా కిసాన్ సంఘటన్ రాష్ట్ర కన్వీనర్ మరీదు ప్రసాద్‌బాబు మాట్లాడుతూ పాలస్తీనా కోసం ఏగొంతు మాట్లాడని, ప్రశ్నించని సమయంలో రైతుకూలీ సంఘం పాలస్తీనాకు అండగా ఉండాలని చారిత్రక నేపథ్యం కలిగిన పుస్తకాన్ని రూపొందించడం గొప్ప విషయమని హర్షం వ్యక్తం చేశారు. రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు య.వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎం.రాంబాబు, కార్యవర్గ సభ్యుడు జగన్ పాల్గొన్నారు.



సరుకులు అందిస్తున్న సీనియర్ సిటిజన్స్

వృద్ధాశ్రమానికి వితరణ

పటమట, మే 22 (ఆంధ్రజ్యోతి): పటమట సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నున్న గ్రామ శివారులో ఉన్న అనాథ వృద్ధాశ్రమానికి రూ.15 వేల విలువగల సరుకులను వితరణగావించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నగంటి సాంబశివరావు, గౌరవాధ్యక్షుడు సూర్యదేవర పాపారావు, కార్యదర్శి కొల్లిపర రామ్మోహన్‌రావు, సంయుక్త కార్యదర్శి నాగేశ్వరరావు, ఎం.పాండురంగారావు, కె.నాంచారయ్య, బాబురావు పాల్గొన్నారు.

దంత వైద్యశాల సెంటర్‌లో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



దంత వైద్యశాల సెంటర్‌లో అడ్డదిడ్డంగా వెళుతున్న వాహనాలు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ దంత వైద్యశాల సెంటర్‌లో ప్రయాణించడానికి పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహానాడు రోడ్డు, ఈఎస్ఐ ఆసుపత్రి రోడ్డు, లయోలా కళాశాల రోడ్డు, గుణదల పాత పంచాయతీ ఆఫీసు రోడ్లను కలిపే నాలుగు రోడ్ల కూడలి. ఈసెంటర్ వద్ద ప్రభుత్వ దంతవైద్యశాల ఉంది. ఈ ఆసుపత్రికి నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వస్తూంటారు. ఈ సెంటర్‌లోని రోడ్లకు స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో వాహనదారులు వేగంగా దూసుకు రావడంతో పాదచారులు రోడ్డు దాటాలంటే నానాఅవస్థలు పడుతున్నారు. ఉదయం, సాయంత్ర వేళ్లలో వాహనదారులు ఇష్టానుసారంగా రావడంతో వాహనాలు ఎదురెదురు పడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని వాహదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు వాహనదారులు త్వరగా వెళ్లాలనే ఉద్దేశ్యంతో స్పీడుగా వచ్చి ఎదురుగా వచ్చిన వాహనదారులను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం

విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ పాటిల్



మాట్లాడుతున్న విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ పాటిల్

రైల్వేస్టేషన్, మే 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్‌లో గురువారం ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దామన్న నినా దంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రెండు వారాల పాటు నిర్వహించే ప్రచార కార్యక్రమం జూన్ 5న ముగియనుంది. డివిజనల్ ఆఫీసు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ పాటిల్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తామన్న ప్రతిజ్ఞను చేయించారు. ఆయన మాట్లాడుతూ అందరూ పర్యావరణ అనుకూల కార్యక్రమాలను నిర్వహించాలని, ఇతరులను కూడా ప్రోత్సహించాలన్నారు. ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు, పరిశుభ్ర పరిచే ప్రత్యేక కార్యక్రమాలు, నాటికలు, మొక్కల పెంపకం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పాటిల్ తెలిపారు. కార్యక్రమంలో ఏడీ ఆర్ఎంలు పి.ఈ.ఎడ్విన్, శ్రీనివాసరావు కొండా, సీనియర్ డీఈఎన్ హెచ్ఎం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్ మృతుల్లో..

జంగు నవీన్, సజ్జా నాగేశ్వర్‌రావు

మొత్తం 27 మంది వివరాలు ప్రకటించిన ఛత్తీస్‌గఢ్ పోలీసులు

- నంబాల కేశవరావు బృందం మొత్తం తుడిచిపెట్టుకుపోయిందని వెల్లడి
- సుకుమాలో పేలిన ఐఈడీ.. జవాన్ మృతి, మరో ముగ్గురికి గాయాలు

చర్ల/హసన్‌పర్తి/విశాఖపట్నం/టెక్కలి, మే 22 (ఆంధ్రజ్యోతి): అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలక నేతలు జంగు నవీన్ అలియాస్ మధు (45), సజ్జా నాగేశ్వర్‌రావు (61) కూడా మృతి చెందినట్టు గుర్తించారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు బృందం మొత్తం తుడిచిపెట్టుకుపోయినట్టు ఛత్తీస్‌గఢ్ పోలీసులు ప్రకటించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మొత్తం 27 మంది మావోయిస్టుల వివరాలను గురువారం వెల్లడించారు. నారాయణపూర్ జిల్లా డీఆర్‌జీ పోలీసులు పక్కా సమాచారంతో కూంబింగ్ చేపట్టగా.. ఎదురుకాల్పులు జరిగాయని, 27 మంది మావోయిస్టులు మృతి చెందారని, వీరిలో 14 మంది మహిళలు ఉన్నట్టు ఛత్తీస్‌గఢ్ డీజీపీ గౌతమ్ చెప్పారు. వీరంతా పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) 7వ బెటాలియన్ సభ్యులని, వారిపై మొత్తం రూ.3.33 కోట్లు రివార్డు ఉందన్నారు. అబూజ్‌మడ్ ఒకప్పుడు మావోయిస్టు పార్టీకి కంచుకోట అని.. ఇప్పుడక్కడ మావోయిస్టులు లేరన్నారు. అబూజ్‌మడ్‌లో ఆపరేషన్ కొనసాగుతోందని చెప్పారు.



మావోయిస్టు బుర్ర రాకేశ్

బుర్ర రాకేశ్.. నంబాల కంప్యూటర్ ఆపరేటర్

అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టుకు చెందిన రాకేశ్ (32) అలియాస్ వివేక్ మృతి చెందారు. ఆయన మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్టు సమాచారం. రాకేశ్ తండ్రి బుర్ర బాబు ఆటో నడుపుతూ, తల్లి స్వరూప స్కూల్‌లో వంట మనిషిగా పనిచేస్తున్నారు. రాకేశ్ 2016 మేలో సీకేఎం కళాశాలలో పీజీ చదువుతున్న సమయంలో మావోయిస్టు భావజాలానికి ఆకర్షితుడై అడవిబాట పట్టారు. నాటి నుంచి అజ్ఞాతంలోనే ఉన్న ఆయన.. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. ఇదిలా ఉండగా.. ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా అడవుల్లో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి కోబ్రా 210 బెటాలియన్ జవాను సోలంకి (30) మృతి చెందారు. మరో ముగ్గురు జవాన్లు విక్రమ్ రాణా, మహదేవ్, ఆంటోనీరాజ్ తీవ్రంగా గాయపడ్డారు. పిడియ గుట్టల్లో కూంబింగ్‌కు వెళుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది.

కేశవరావు మృతదేహం అప్పగింతలో జాప్యం!

మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉన్నట్టు తెలిసింది. కేశవరావు స్వస్థలం శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలంలోని జీయన్నపేట. అక్కడేఆయన అంత్యక్రియలు నిర్వహించాలని కుటుంబసభ్యులు నిర్ణయించారు. మృతదేహాన్ని తెచ్చేందుకు కుటుంబసభ్యులు గురువారం ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్ వెళ్లారు. అక్కడి పోలీసులు మృతదేహాన్ని మూడ్రోజుల తర్వాత అప్పగిస్తామని చెప్పినట్టు సమాచారం. మృతదేహం ఇస్తే తప్ప కదలబోమని కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. 'వెంటనే వెళ్లకుంటే మీపైనా కాల్పులు జరుపుతా'మని పోలీసులు హెచ్చరించడంతో వారు వెనుదిరిగినట్టు తెలిసింది. కాగా కేశవరావు ఎన్‌కౌంటర్‌పై పౌరహక్కుల సంఘం ప్రతినిధులు శుక్రవారం హైకోర్టులో రిట్ పిటిషన్ వేయనున్నట్లు తెలిసింది. దీనికి సంబంధించి కేశవరావు తల్లి భారతమ్మ సంతకాలు సేకరించినట్టు సమాచారం.



కుటుంబసభ్యుల నుంచి రిలేషన్ సర్టిఫికెట్‌పై సంతకాలు తీసుకుంటున్న అధికారులు

కళాశాల నుంచి ఉద్యమ బాట!

- మావోయిస్టు పత్రికకు చీఫ్ ఎడిటర్‌గా బాధ్యతలు
- అగ్రనేత సజ్జా వెంకట నాగేశ్వరరావు ప్రస్థానం

చీరాల, మే 22 (ఆంధ్రజ్యోతి): అబూజ్‌మడ్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా చీరాల మండలం దేవాంగపురి పంచాయతీ జాండ్రపేటకు చెందిన మావోయిస్టు అగ్రనేత సజ్జా వెంకట నాగేశ్వరరావు అలియాస్ రాజన్న మృతి చెందారు. వీరిది చేనేత కుటుంబం. తల్లిదండ్రులు బాలగంగాధరరావు, సుబ్బరావమ్మ. నాగేశ్వరరావుకు చిన్నతనం నుంచి ముక్కుసూటిగా ఉండేవారనే పేరుంది. ఒంగోలులో విద్యాభ్యాసం తర్వాత పాలిటెక్నిక్ చదివేందుకు 16వ ఏట గుంటూరు వెళ్లారు. అక్కడే మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితులై అడవిబాట పట్టారు. 1980ల్లో కొంతకాలం జైలు జీవితం గడిపారు. తర్వాత పూర్తిగా అజ్ఞాతంలోకి వెళ్లారు. మావోయిస్టు పత్రిక 'అవామ్-ఇ-జంగ్'లో వివిధ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆ పత్రికకు చీఫ్ ఎడిటర్‌గా ఉన్నారు. తాజా ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఆయన మృతదేహం కోసం కుటుంబ సభ్యులు గురువారం ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లారు. స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

కర్రెగుట్ట కూడా.. నక్సల్బరీ అంత చరిత్రాత్మకమే

- 5 దశాబ్దాల ఉద్యమం ఇప్పుడు ఆవశ్యకతను కోల్పోయింది
- తెలంగాణ కేడర్ ఐపీఎస్ అధికారి సుదీప్ లఖ్టాకియా వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 22 (ఆంధ్రజ్యోతి): దాదాపు ఐదు దశాబ్దాల క్రితం 1967 మేలో నక్సల్బరీలో జన్మించిన నక్సలైట్ ఉద్యమం ఎంత చరిత్రాత్మకమో.. కర్రెగుట్టలో జరిగిన నక్సల్స్ నిర్మూలన ఉద్యమం కూడా అంతే చరిత్రాత్మకం, కవితాత్మకంగా భావిస్తానని తెలంగాణ కేడర్ ఐపీఎస్ అధికారి, జాతీయ భద్రతా గార్డు(ఎన్ఎస్‌జీ) బ్లాక్ కమాండో దళం మాజీ డైరెక్టర్ జనరల్ సుదీప్ లఖ్టాకియా అన్నారు. నక్సల్స్ ఏరివేతలో ఎంతో అనుభవం ఉన్న ఆయన.. ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పనిచేశారు. నక్సల్స్ నిర్మూలనకు ప్రత్యేకంగా ఏర్పర్చిన గ్రే హౌండ్స్‌కు సారథ్యం వహించారు. సీఆర్‌పీఎఫ్ ప్రత్యేక డీజీగా బాధ్యతలు నిర్వర్తించారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శితో పాటు అనేక మంది నక్సల్స్ మరణించడం ఐదు దశాబ్దాల ఉద్యమానికి తీవ్ర విఘాతమని ఆయన పేర్కొన్నారు. సమకాలీన ప్రపంచంలో ఆధునిక భారతంలో పూర్తిగా ఆవశ్యకత కోల్పోయిన ఒక సిద్ధాంతానికి మృత్యుఘంటికలు ధ్వనిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధికారం తుపాకి గొట్టం ద్వారా రాదని.. పరిజ్ఞానం, టెక్నాలజీ మాత్రమే మన ప్రజలు, సమూహాల తలరాతల్ని నిర్ణయించగలదని లఖ్టాకియా అభిప్రాయపడ్డారు. ఈ ఐదు దశాబ్దాల హింసాత్మక మార్గంలో ఎందరో అమాయక ప్రజలు తమ జీవితాల్ని కోల్పోవడం విషాదకరమని ఆవేదన వెలిబుచ్చారు. కాగా.. మొదట్లో మావోయిజాన్ని ఎదుర్కోవడంలో వ్యూహపరమైన తప్పిదాలు కొన్ని జరిగాయని లఖ్టాకియా అన్నారు. నక్సల్స్ ఉద్యమ రూపాన్ని అర్థం చేసుకోవడంలో, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఐక్యతలో, ఇంటెలిజెన్స్ సేకరణలో ఈ తప్పిదాలు జరిగాయని పేర్కొన్నారు. మావోయిస్టు ఉద్యమ రహస్య స్వభావాన్ని అర్థం చేసుకోవడంలో కూడా ఆలస్యం జరిగిందని.. రహస్యం వల్లనే ఆ సంస్థ ఉనికిలో కొనసాగిందని ఆయన అన్నారు. అందులో వ్యక్తులు ఎన్నో అలియాస్ పేర్లతో పనిచేస్తారని.. వారిని గుర్తించడానికి ప్రత్యేక ఇంటలిజెన్స్ ఆపరేషన్ అవసరమని.. గతంలో ఈ ఆపరేషనల్ ఇంటెలిజెన్స్ వల్లనే గ్రేహౌండ్స్ విజయాలు సాధించిందని ఆయన చెప్పారు.



రాష్ట్రపతి చేతుల మీదుగా కీర్తిచక్ర అవార్డు అందుకుంటున్న మేజర్ రామ్‌గోపాలనాయుడు

గోపాలనాయుడుకు కీర్తిచక్ర ప్రదానం

న్యూఢిల్లీ, సంతబొమ్మాళి, మే 22(ఆంధ్రజ్యోతి): దేశ చరిత్రలోనే సిక్కోలు మేజర్‌కు అపూర్వ గౌరవం దక్కింది. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నగిరిపెంటకు చెందిన ఆర్మీ మేజర్ మళ్ల రామ్‌గోపాలనాయుడుకు పీస్‌టైమ్‌లో ఇచ్చే రెండో అత్యుత్తమ పురస్కారం కీర్తిచక్ర దక్కింది. గురువారం రాత్రి రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. 56 రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన రామ్‌గోపాలనాయుడు జమ్ముకాశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో నియంత్రణ రేఖ వద్ద మోహరించిన పెట్రోలింగ్ బృందానికి లీడర్‌గా వ్యవహరించారు. 2023 అక్టోబరు 26న ఉగ్రవాదులు భారత భూభాగంలోకి చొరబడ్డారన్న సమాచారం అందిన వెంటనే.. గోపాలనాయుడు జవాన్‌లకు మార్గనిర్దేశం చేసి ఉగ్రవాదులను పట్టుకోవడానికి ప్రయత్నించారు. ఉగ్రవాదులు రాళ్ల వెనక దాగి కాల్పులు జరుపుతూ, గ్రెనేడ్ దాడులకు దిగినప్పటికీ అసాధారణ ధైర్యసాహసాలతో ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చారు. ఆ ఘటనలో మన సైన్యం మొత్తం ఐదుగురు ఉగ్రవాదులను అంతమొందించడంలో చూపిన తెగువకు గానూ గోపాలనాయుడుకు కేంద్రం కీర్తిచక్ర పురస్కారాన్ని ప్రకటించింది. కాగా, భారత నౌకదళంలో అసిస్టెంట్ ఇంజనీరింగ్ ఆఫీసర్‌గా విశాఖపట్నంలో విధులు నిర్వహించే లెఫ్టినెంట్ కమాండర్ కపిల్ యాదవ్‌కు శౌర్యచక్ర పురస్కారం దక్కింది. 2024 జనవరి 26న రాత్రి 10 గంటలకు ఒక ఇంధన నౌకలో భారీగా మంటలు ఎగిసిపడుతున్నా లెక్కచేయకుండా ప్రాణాలకు తెగించి ఇంధన ట్యాంకుకు ఆక్సిజన్ సరాఫరాను నిలిపివేసి మంటలను అదుపుచేశారు. ఈ ధైర్యసాహసాలకు మెచ్చిన కేంద్రం ఆయనకు శౌర్యచక్ర పురస్కారాన్ని ప్రదానం చేసింది.

పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్‌గా కుటుంబరావు!

అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): పీ4 ఫౌండేషన్‌కు వైస్ చైర్మన్‌గా రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు కుటుంబరావును నియమించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. పేదలకు ఆర్థిక సాయం అందించేందుకు, వారిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చేందుకు చంద్రబాబు పీ4 కార్యక్రమాన్ని అనే ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమం అమలు కోసం ఇటీవల పీ4 ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. దీనికి సీఎం చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

చిత్రజ్యోతి


SINCE 1965

కేన్స్ వేదికపై విశ్వంభర



చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్ బేనర్‌పై విక్రమ్ రెడ్డి, ప్రమోద్, వంశీ నిర్మిస్తున్నారు. నిర్మాత విక్రమ్‌రెడ్డి గురువారం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో 'విశ్వంభర' విశేషాలతో ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆ పుస్తకానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని త్వరలో వెల్లడిస్తామని ఆయన చెప్పారు. అలాగే ఈ సినిమా కథ, వీఎఫ్ఎక్స్‌కు ఉన్న ప్రాధాన్యం గురించి విక్రమ్‌రెడ్డి వివరించారు. 'విశ్వంభర' నిర్మాణానంతర కార్యక్రమాలు తుదిదశలో ఉన్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రంలో త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. సంగీతం: కీరవాణి, సినిమాటోగ్రఫీ: ఛోటా కె. నాయుడు

నవ్వులూ... చర్చలు



రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సాన తెరకెక్కిస్తున్న చిత్రం 'పెద్ది'. మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకటసతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది. దాదాపు 30 శాతం షూటింగ్ పూర్తైంది. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన ఓ కీలక షెడ్యూల్ హైదరాబాద్‌లో గురువారం ప్రారంభమైంది. ఇందుకోసం ఓ విలేజ్ సెట్‌ను నిర్మించారు. సుదీర్ఘంగా సాగే ఈ షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు బుచ్చిబాబు, నటుడు దివ్యేందు శర్మతో కలసి తీసుకున్న ఫొటోను రామ్‌చరణ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. 'నవ్వులు, చర్చలు, విపరీతమైన హార్డ్ వర్క్‌తో నిండిన ఈ షెడ్యూల్ హుషారుగా సాగుతోంది' అని పేర్కొన్నారు. ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయిక. జగపతిబాబు, శివరాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రత్నవేలు. వచ్చే ఏడాది మార్చి 27న సినిమా విడుదలవుతోంది.

మరోసారి సమావేశం

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

సినిమాలను థియేటర్లలో ఆడించాలంటే అద్దె విధానం బదులు, పర్సెంటేజీ పద్ధతిని అమలు చేయాలని, లేదంటే జూన్ 1 నుంచి థియేటర్లలో షోలు నిలిపివేస్తామని ఎగ్జిబిటర్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు ఏ నిర్ణయం తీసుకుంటారా అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఇప్పటికే విడివిడిగా నిర్మాతలూ, ఎగ్జిబిటర్లు సమావేశమయ్యారు. అయినా పరిష్కారం ఓ కొలిక్కి రాకపోవడంతో ఫిల్మ్ ఛాంబర్ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. నిర్మాతలూ, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లతో ఓ కమిటీ వేసి మరోసారి సమావేశం నిర్వహించనుంది. శనివారం జరిగే మీటింగ్‌లో ఈ సమస్యకు ఒక పరిష్కారం దొరకవచ్చని అందరూ భావిస్తున్నారు. జూన్ 5న కమల్‌హాసన్ నటించిన 'థగ్‌లైఫ్', జూన్ 12న పవన్‌కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' విడుదలకు సిద్ధమవుతుండడంతో ఈ మీటింగ్‌లో థియేటర్ల విషయంలో ఎగ్జిబిటర్లు తీసుకునే నిర్ణయం కీలకమవ్వనుంది.



రాజకీయాల్లో బిజీగా ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, తాను అంగీకరించిన చిత్రాలను వరుస పెట్టి పూర్తి చేయాలనే లక్ష్యంతో మేకర్స్‌కు కాల్షీట్లు కేటాయిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆయన నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రం షూటింగ్ పూర్తయి, జూన్ 12న విడుదలకు సిద్ధమైంది. ఇటీవలె ఆయన నటిస్తున్న మరో చిత్రం 'ఓజీ' షూట్ కూడా తిరిగి ప్రారంభమైనట్లు నిర్మాత డి.వి.వి.దానయ్య తెలిపారు. పవన్ కల్యాణ్ నటిస్తున్న మరో చిత్రం గురించి తాజాగా అప్డేట్ వచ్చింది. ఆయన నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం షూటింగ్ కూడా త్వరలోనే పునః ప్రారంభించనున్నట్లు మేకర్స్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. "పవన్ కల్యాణ్ కెరీర్‌లోనే గొప్ప పాత్రను తెరపై చూసి వేడుక చేసుకోవడానికి సిద్ధంగా ఉండండి. ఇది అభిమానులకు, సినీ ప్రియులకు కన్నులపండుగ లాంటిది. ఈ ప్రాజెక్ట్ అనేక సంవత్సరాలు గుర్తుండిపోయేలా ఉంటుంది. త్వరలోనే షూట్‌ను రీస్టార్ట్ చేస్తున్నాం" అని నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్ పేర్కొంది. హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో పవన్‌కల్యాణ్ శక్తిమంతమైన పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్నారు.

ప్రచారకర్తగా తమన్నా

కన్నడ సంఘాల ఆగ్రహం



కర్ణాటక ప్రభుత్వ రంగ సంస్థ 'కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్' ఉత్పత్తులైన 'మైసూరు శాండల్ సోప్' బ్రాండ్‌కు ప్రముఖ కథానాయిక తమన్నా భాటియాను ప్రచారకర్తగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రెండేళ్లపాటు ప్రచారకర్తగా నియమించుకునేందుకుగాను రూ.6.20 కోట్లు చెల్లించేందుకు ఆమెతో ఒప్పందం చేసుకొంది. అయితే, ప్రభుత్వ నిర్ణయాన్ని పలు కన్నడ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ సంస్థకు కన్నడ నటులను కాకుండా ఒక పరభాషా నటిని ప్రచారకర్తగా ఎలా నియమిస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

నాయకుడు కంటే పెద్ద హిట్ అవుతుంది

కమల్ హాసన్



'నేను మనసు పెట్టి చేసిన ప్రతి సినిమా గొప్ప విజయాన్ని సాధించింది. ఇలాంటి సినిమా మళ్లీ మళ్లీ రాదు. అందుకే సినిమాను బాగా ప్రమోట్ చేయడానికి ప్రయత్నిస్తున్నాను. 'నాయకుడు' కంటే 'థగ్ లైఫ్' పెద్ద విజయం సాధిస్తుంది' అని అన్నారు సీనియర్ నటుడు కమల్ హాసన్. ఆయన హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'థగ్ లైఫ్'. త్రిష, శింబు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రం జూన్ 5న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమల్ హాసన్ మాట్లాడుతూ 'మణిరత్నం సినిమాలో నేను నటించను, జస్ట్ బిహేవ్ చేస్తాను. 'ఇంద్రుడు చంద్రుడు' సినిమాకు తనికెళ్ల భరణి రాయాల్సింది. కానీ కుదరలేదు. ఆయనతో కలసి మరింత ప్రయాణం చేయాలని ఉంది' అని అన్నారు. దర్శకుడు మణిరత్నం మాట్లాడుతూ 'చాలా కాలం తర్వాత కమల్‌తో సినిమా చేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది. ఆయన 'నాయకుడు' సమయంలో ఎలా ఉన్నారో ఇప్పుడు కూడా అలానే ఉన్నారు' అని అన్నారు. నిర్మాత సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ 'ఇంతకు ముందు కమల్‌హాసన్ నటించిన రెండు సినిమాలు నేనే రిలీజ్ చేశాను. అవి బ్లాక్ బస్టర్ అయ్యాయి. ట్రైలర్, పాటలు చూసిన తర్వాత ఈ సినిమా కూడా బ్లాక్ బస్టర్ అవుతుందనే నమ్మకం కలిగింది' అని అన్నారు.

డ్రగ్స్ కోసం ప్రత్యేక బడ్జెట్

మలయాళ నిర్మాత శాండ్రా థామస్ ఆరోపణ



మలయాళ చిత్ర పరిశ్రమలో కొందరు డ్రగ్స్ తీసుకుంటున్నారంటూ ఆరోపణలు రావడం.. ఈ క్రమంలో వారిని అరెస్టు చేయడం తెలిసిందే. తాజాగా, మలయాళ పరిశ్రమలో డ్రగ్స్ వాడకం గురించి సంచలన ఆరోపణలు చేశారు నటి, నిర్మాత శాండ్రా థామస్. "చిత్రసీమలో మాదకద్రవ్యాల వాడకం ఎక్కువైంది. సెట్స్‌లో అది ఒక సాధారణ వ్యవహారంగా మారిపోయింది. అంతేకాక, వాటి కోసమే ప్రత్యేకంగా బడ్జెట్, గదులను కేటాయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎవరూ కఠిన చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఓ ఐదు.. పదేళ్ల ముందే మాదకద్రవ్యాల వాడకాన్ని అరికట్టి ఉండాల్సింది. ఇప్పుడు అందరూ మాదకద్రవ్యాలకి అలవాటు పడుతున్నారు. ఈ వ్యవహారంపై నోరువిప్పితే ఎక్కడ తమ ప్రాజెక్టులు ఆగిపోతాయన్న భయంలో నిర్మాతలు ఉన్నారు" అని పేర్కొన్నారు.

హృదయాన్ని కదిలించే బృందావనం



లవ్, సెంటిమెంట్ అంశాల మేళవింపుగా తెరకెక్కిన చిత్రం 'బృందావనం'. బాలు, షిన్నోవా జంటగా నటించారు. బొత్స సత్య దర్శకత్వంలో కిశోర్ టీ, వెంకట్ ఆర్ నిర్మించారు. మైత్రీ మూవీస్ ఈ చిత్రాన్ని శుక్రవారం విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకు హీరో నారా రోహిత్ ముఖ్య అతిథిగా హాజరై 'బృందావనం' ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. తెరపై అందమైన ప్రణయ భావనల్ని ఆవిష్కరిస్తుంది' అని చెప్పారు. అందమైన సంగీత ప్రయాణం ఈ చిత్రం, ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించే సున్నితమైన ప్రేమకథతో దర్శకుడు అద్భుతంగా రూపొందించాడు' అని నిర్మాతలు చెప్పారు.

అన్ని హంగులతో అలరిస్తుంది



విజయ్ సేతుపతి, రుక్మిణి వసంత్ జంటగా దర్శకనిర్మాత అరుముగ కుమార్ తెరకెక్కించిన చిత్రం 'ఏస్'. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తెలుగులో శ్రీ పద్మిని సినిమాస్ బ్యానర్‌పై బి. శివప్రసాద్ విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయ్ సేతుపతి మాట్లాడుతూ 'నాకు మొదట అవకాశం ఇచ్చిన అరుముగ కుమార్‌తో మళ్లీ సినిమా చేసినందుకు ఆనందంగా ఉంది. ఇందులో యాక్షన్, రొమాన్స్ వంటి అన్ని వాణిజ్య హంగులు ఉన్నాయి. అందరినీ ఆకట్టుకునేలా ఈ సినిమా ఉంటుంది' అని అన్నారు. నిర్మాత బి. శివప్రసాద్ మాట్లాడుతూ 'అందరి ముఖాల్లో సంతోషం చూస్తుంటే విడుదలకు ముందే ఈ సినిమా హిట్ అయినట్టు కనిపిస్తోంది. విజయ్‌తో 'రొమాంటిక్ డాన్' అనే సినిమాను త్వరలోనే ప్రకటిస్తాను' అని అన్నారు. 'ఈ చిత్రం విందు భోజనంలా ఉంటుంది. విజయ్ సేతుపతి ఆల్ రౌండర్. ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది' అని చిత్ర దర్శకనిర్మాత అరుముగ కుమార్ అన్నారు.

ప్రేమకథలో పలు మలుపులు



పలు సూపర్‌హిట్ సినిమాలు, వెబ్ సిరీస్‌తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన తమిళ హీరో శ్రీరామ్ తాజా చిత్రం 'నిశ్శబ్ద ప్రేమ'. ప్రియాంక తిమ్మేష్ కథానాయిక. రాజ్ దేవ్ దర్శకత్వంలో లవ్, రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని కార్తికేయన్ ఎస్ నిర్మించారు. శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా హీరో శ్రీరామ్ మాట్లాడుతూ 'లవ్‌స్టోరీలో థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కలిగిన గ్రిప్పింగ్ మూవీ ఇది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. తమిళంలో ఇప్పటికే హిట్ అయింది. మంచి సినిమాకు భాషా భేదాలు లేవు కనుక ఇక్కడ కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు.

అమ్మ ఆశీస్సులతో...



ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం 'వైభవం'. సాత్విక్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆయన సోదరుడు రుత్విక్ హీరోగా నటించారు. శుక్రవారం ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సాత్విక్ మాట్లాడుతూ 'మా అమ్మ రమాదేవి కోరిక మేరకు సినిమాల్లోకి అడుగుపెట్టాం. మా అమ్మే నిర్మాత. ఆమె ఆశీస్సులతో సినిమా ఘన విజయం అందుకుంటుందని ఆశిస్తున్నాం' అని చెప్పారు.

శ్రీశైలం జలాశయం సమీపాన మరో జల విద్యుత్కేంద్రం!

- యాప్రాన్ వద్ద కడితే 'ప్లంజ్‌పూల్' ముప్పుండదు
- సీడబ్ల్యూపీఆర్ఎస్ శాస్త్రవేత్తల సూచన

అమరావతి, మే 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం రిజర్వాయరు యాప్రాన్‌కు సమీపంలో ఇంకో జల విద్యుత్కేంద్రాన్ని నిర్మిస్తే ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన భారీ గొయ్యి వల్ల కలిగే నష్టాన్ని నివారించవచ్చని కేంద్ర జల-విద్యుత్ పరిశోధనా సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్) శాస్త్రవేత్తలు తెలిపారు. శ్రీశైలం డ్యాంలో ఏర్పడిన గుంతలు, దెబ్బతిన్న స్టీల్ సిలెండర్లు, గ్యాలరీ లీకేజీలు, యాప్రాన్‌కు జరిగిన నష్టం, టెయిలెండ్ వద్ద నిర్మించిన ఆనకట్ట, విద్యుత్కేంద్రం కుంగిపోవడం.. ప్లంజ్‌పూల్ స్థితిగతులపై వారు గత మూడ్రోజుల పాటు అధ్యయనం చేశారు. గురువారం శ్రీభ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకున్నాక పుణేకు పయనమయ్యారు. ప్లంజ్‌పూల్ వద్ద ఏర్పడిన భారీ గొయ్యి వల్ల నష్టం జరిగే అవకాశాలు తక్కువగా ఉన్నాయంటూనే.. జల విద్యుత్కేంద్రం నిర్మిస్తే నష్టాన్ని నివారించవచ్చని వారు ఈ సందర్భంగా జలవనరుల శాఖకు తెలిపారు. జూన్ మొదటివారంలో మళ్లీ వస్తామని.. ఆలోగా తాము సూచించిన డజను పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. జియోఫిజికల్ సర్వే కోసం యాప్రాన్‌కు రంధ్రాలు చేయాలని.. అలా చేసినప్పుడు వచ్చిన శబ్దాల ఆధారంగా దాని పటిష్ఠత తెలుసుకోవచ్చని చెప్పారు. అదే విధంగా స్పిల్‌వే చానల్‌కు ముందు భాగాన నీరు నిలబడకుండా రాతి మట్టాలు ఉండడం డ్యాంకు ఏమాత్రం మంచిది కాదన్నారు. గ్యాలరీల్లోనూ. అండర్ గ్రౌండ్ వాటర్‌లోనూ పరిశోధనలు చేయాలని.. దీనిద్వారా డ్యాం పునాదుల్లోకి నీరు ఏ మేరకు చేరిందో గుర్తించవచ్చని తెలిపారు. దేశంలోని ఇతర భారీ ప్రాజెక్టులతో పోల్చుకుంటే.. శ్రీశైలం జలాశయం చాలా పటిష్ఠంగా ఉందన్నారు.

13 నుంచి అబుదాబీ విమాన సర్వీసులు

విశాఖపట్నం, మే 22(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి అబుదాబీకి జూన్ 13వ తేదీ నుంచి ఇండిగో విమాన సర్వీసు ప్రారంభం కానుంది. ఇది వారానికి నాలుగు రోజులు (సోమ, బుధ, శుక్ర, ఆదివారాలు) నడుస్తుంది. అబుదాబీలో తెల్లవారుజామున బయలుదేరి ఉదయం విశాఖపట్నం చేరుతుంది. తిరిగి మధ్యాహ్నం అబుదాబీకి వెళ్తుందని ఇండిగో ప్రకటించింది.

రేపు డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల, మే 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరుగనుంది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై టీటీడీ ఈవో శ్యామలరావుతో నేరుగా ఫోన్‌లో మాట్లాడవచ్చు. దీని కోసం భక్తులు 0877 2263261 నంబరులో సంప్రదించాల్సి ఉంటుంది.



రాష్ట్రంలో మళ్లీ కరోనా.. విశాఖలో తొలి కేసు

28 ఏళ్ల మహిళకు కొవిడ్-19 నిర్ధారణ

అమరావతి, విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మళ్లీ కరోనా కలవరపెడుతోంది. విశాఖపట్నంలో తొలి కేసు నమోదయింది. మద్దిలపాలెంలోని పిఠాపురం కాలనీకి చెందిన 28 ఏళ్ల మహిళకు కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. బుధవారం ఉదయం ఆమె చలిజ్వరం, తీవ్రమైన దగ్గుతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా, వైద్య పరీక్షల్లో కొవిడ్-19గా నిర్ధారణ అయ్యింది. ఆరోగ్యశాఖ అధికారులు కేజీహెచ్‌లో మరోసారి శాంపిల్‌ను పరీక్షించగా, అది కూడా పాజిటివ్‌గానే నిర్ధారణ అయ్యింది. అయితే, ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండడంతో వైద్యులు గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేయగా, హోం ఐసోలేషన్‌లో ఉంచారు. ఆ వెంటనే ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మద్దిలపాలెంలో ఇంటింటి సర్వే చేస్తున్నారు. ఆమె కుటుంబ సభ్యులిద్దరికి కరోనా పరీక్షలు నిర్వహించేందుకు నమూనాలు సేకరించి కేజీహెచ్‌కు పంపించారు.

హెచ్చరికలు.. ఉపసంహరణ

ఏపీలో తొలి కొవిడ్ కేసు నమోదు కావడంతో రాష్ట్ర ప్రజలు కొవిడ్-19 జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ కోరింది. ఎవరికైనా లక్షణాలు కనిపిస్తే కొవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈమేరకు గురువారం హెల్త్ డైరెక్టర్ పద్మావతి ప్రత్యేక సూచనలు చేస్తూ ప్రకటన విడుదల చేశారు. బస్సు, రైలు ప్రయాణాల్లో విధిగా మాస్కు ధరించాలని చెప్పారు. తరచూ చేతులు శుభ్రపరుచుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటికే పొరుగు రాష్ట్రాలైన కేరళలో 95, తమిళనాడులో 66, మహారాష్ట్రలో 55, కర్ణాటకలో 13, పాండిచ్చేరిలో 10 కేసులు నమోదైనట్లు తెలిపారు. ముఖ్యంగా పండక్షు, ప్రార్థనా మందిరాల్లో జనం గుమిగూడరాదని కోరారు. జనసమ్మర్దం ఎక్కువగా ఉన్న మాల్స్, సినిమా హాల్స్ ప్రార్థనా మందిరాలు, మార్కెట్లలో సామాజిక దూరం పాటించాలని, దీర్ఘకాలిక సమస్యలున్నవారు, వృద్ధులు, చిన్నారులు ప్రయాణాలు మానుకోవడం మంచిదని సూచించారు. అయితే, డైరెక్టర్ ఇచ్చిన ఆదేశాలను సీఎంఓ అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. దీనిపై ఒకటి రెండ్రోజుల్లో ప్రత్యేక మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఇలాంటి హెచ్చరికలు జారీచేయడం సరికాదని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

ఇది మొదటి అడుగే

ప్రతి జిల్లాలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- 'ఆంధ్రజ్యోతి' ఈడీ వేమూరి ఆదిత్య ప్రకటన
- మున్సిపల్, తుడా నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించాం
- మహిళలకు భద్రత కోసం పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు
- ఇళ్ల పట్టాల సమస్యనూ పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే ఆరణి
- తిరుపతి జీవకోనలో 'అక్షరమే అండగా..' సభ
- రూ.1.06 కోట్లతో అభివృద్ధి పనులకు భూమి పూజ



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, చిత్రంలో కమిషనర్ మౌర్య, 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య



తిరుపతి, మే 22(ఆంధ్రజ్యోతి): 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' పేరుతో చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కారంలో ఇది మొదటి అడుగు మాత్రమేనని 'ఆంధ్రజ్యోతి' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేమూరి ఆదిత్య స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రకటించారు. గురువారం తిరుపతి నగరం జీవకోన అంబేడ్కర్ కూడలి సమీపంలోని శ్రీలలితా త్రిపుర సుందరి ఆలయ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది జనవరిలో జీవకోనలో నిర్వహించిన 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' సదస్సులో ప్రజలు ప్రస్తావించిన సమస్యలకు సంబంధించి రూ.62లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వివరించారు. మరో రూ.1.06కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేసినట్లు తెలిపారు. సభలో ప్రజల నుంచి మరిన్ని వినతులు అందాయని, వాటిని కూడా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజా సమస్యలను వార్తలుగా ప్రచురించడానికే పరిమితం కాకుండా వాటి పరిష్కారానికి 'ఆంధ్రజ్యోతి' చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని కొనియాడారు. జీవకోనలో గంజాయి బ్యాచ్‌లు, ఆకతాయిల ఆగడాలను అరికట్టి మహిళలకు భద్రత కల్పించేందుకు పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేశామని చెప్పారు. శ్మశానానికి ప్రహరీ, గేట్లు ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేశామన్నారు. జీవకోన ప్రాంతంలో ఎక్కువ ఇళ్లకు శాశ్వత పట్టాలు, పత్రాలు లేకపోవడం ప్రధాన సమస్యగా ఉందని, దీనిపై రెవెన్యూ, అటవీ, టీటీడీ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. 'ఆంధ్రజ్యోతి' వేసిన పునాదిని కొనసాగించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ మౌర్య అన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్‌తో కలసి జీవకోనలో రూ.1.06 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేసిన అభివృద్ధి పనులకు జరిగిన భూమి పూజలో ఆదిత్య పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన రెండు ఆర్వో ప్లాంట్లను పరిశీలించారు. అంబేడ్కర్ కూడలిలో జిల్లా పోలీసు శాఖ ఏర్పాటు చేసిన పోలీసు ఔట్ పోస్టు ప్రారంభోత్సవ కార్యక్రమంతో పాటు సత్యనారాయణపురం నుంచీ ఎర్రమిట్టకు నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలోనూ ఆయన పాల్గొన్నారు. సభలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, 'ఆంధ్రజ్యోతి' అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు, బ్రాంచి మేనేజర్ సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీజీఓ రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యాసాగర్

- 30న అధ్యక్ష ఎన్నికలు.. ఎన్నిక లాంఛనమే!


విద్యాసాగర్

విజయవాడ, మే 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్ అండ్ గజిటెడ్ ఉద్యోగుల సంఘం (ఏపీఎన్‌జీజీఓ) రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలకు రంగం సిద్ధం అవుతోంది. ప్రస్తుత అధ్యక్షుడు కేవీ శివారెడ్డి పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో, సంఘం బాధ్యతల నుంచి కూడా తప్పుకోవాల్సి వస్తోంది. ఈ నెల 30వ తేదీన ఏపీఎన్‌జీజీఓ సంఘ రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక జరగనుంది. ప్రస్తుతం సంఘ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఎ.విద్యాసాగర్‌నే రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకోవటం లాంఛనమని తెలుస్తోంది. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాజీలేని వ్యవహారశైలి ఉండటం కారణంగా ఆయన వైపే అన్ని జిల్లాల నాయకత్వాలు మొగ్గు చూపిస్తున్నాయి. శివారెడ్డి పదవీ విరమణతో సాగర్ పేరు రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవంగా తెరమీదకు వచ్చింది. ఈ క్రమంలో ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో విద్యాసాగర్ పేరును సమష్టిగా జిల్లాల నాయకత్వాలు ప్రతిపాదించే అవకాశం ఉంది.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

- ప్రభుత్వానికి ఏపీపీఈసీఎంఏ విజ్ఞప్తి

అమరావతి, గుంటూరు కార్పొరేషన్, మే 22(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సకాలంలో విడుదల చేయాలని, రాబోయే విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ అడ్మిషన్స్ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏపీపీఈసీఎంఏ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం అసోసియేషన్ తరఫున ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా అపెక్మా అధ్యక్షుడు వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ, ప్రస్తుత 2024-25 విద్యా సంవత్సరంతో పాటు 2023-24 విద్యా సంవత్సరం, అంతకు ముందు సంవత్సరాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సాధ్యమైనంత త్వరగా విడుదల చేసి ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలను ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2023-24కు సంబంధించి మూడు వాయిదాలు, 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండు వాయిదాలతో పాటు అంతకు ముందు నుంచి వున్న పీజీ కోర్సుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చాలా వరకు పేరుకుపోయాయని తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ కోర్సుల ఫీజులను ఖరారు చేసి అడ్మిషన్ల ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా మొదలుపెట్టాలని కోరారు.

జేఎల్స్‌కు పనితీరు పాయింట్లు

- విద్యార్థుల ఉత్తీర్ణతే ప్రామాణికం.. బదిలీలకు షెడ్యూలు విడుదల


అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): జూనియర్ లెక్చరర్ల బదిలీలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 22 నుంచి జూన్ 8 వరకు బదిలీల షెడ్యూలుగా పేర్కొన్నారు. ఈసారి కొత్తగా బదిలీల్లో పనితీరు పాయింట్లు ఇస్తున్నారు. ప్రస్తుత కాలేజీలో ఐదేళ్లు దాటిన ప్రిన్సిపాళ్లు, జూనియర్ లెక్చరర్లు తప్పనిసరిగా బదిలీ కావాలి. రెండేళ్లు దాటిన వారు కావాలంటే బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం ఆన్‌లైన్ విధానంలోనే బదిలీలు జరుగుతాయి. నాలుగు కేటగిరీలుగా ప్రిన్సిపాళ్లు, జేఎల్స్‌కు పాయింట్లు ఇస్తారు. 16శాతం హెచ్‌ఆర్‌ఏ ఉన్న కేటగిరీ-ఎలో ఉంటే ఏడాదికి 2 పాయింట్లు, 12శాతం హెచ్‌ఆర్‌ఏ ప్రాంతం కేటగిరీ-బిలోని జేఎల్స్‌కు ఏడాదికి 4పాయింట్లు, 10శాతం హెచ్‌ఆర్‌ఏ కేటగిరీ-సి ఉన్న జేఎల్స్‌కు ఏడాదికి 6, గిరిజన ప్రాంతాల్లో కేటగిరీ-డి ఏడాదికి 8 పాయింట్లు ఇస్తారు. ఎ కేటగిరీలో ఉన్నవారు బీ, సీ, డీ కేటగిరీలకు మాత్రమే అర్హులు. మిగిలిన కేటగిరీల్లో వారు అన్ని కేటగిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. జేఎల్స్‌కు.. వారి సబ్జెక్టులో 40శాతం వరకు మాత్రమే విద్యార్థులు ఉత్తీర్ణులైతే పనితీరు పాయింట్లు ఇవ్వరు. 41 నుంచి 60శాతం వరకు పాస్ అయితే 2, 61 నుంచి 80శాతం వరకు అయితే 4, 81శాతం నుంచి 100శాతం లోపు ఉంటే 6 పాయింట్లు ఇస్తారు. ప్రిన్సిపాళ్లకు ఇదే నిష్పత్తిలో కాలేజీని ప్రాతిపదికగా తీసుకుని పాయింట్లు ఇస్తారు.

ఏజెన్సీలో టీచర్లకు అదనపు పాయింట్లు ఇవ్వాలి

అమరావతి, మే 22 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న టీచర్లకు ఏడాదికి ఒకటి చొప్పున అదనపు పాయింట్లు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారని, కానీ ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని, వెంటనే అదనపు పాయింట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని నోబుల్ టీచర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, బి.హైమారావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే 2017లో బదిలీ అయిన టీచర్లకు ఏడేళ్ల తొమ్మిది నెలలు దాటినా ఎనిమిదేళ్లుగా పరిగణించి తప్పనిసరి బదిలీ చేస్తున్నారని, కానీ పాయింట్లు మాత్రం ఎనిమిదేళ్లకు ఇవ్వడం లేదన్నారు.

డిమాండ్‌కు తగ్గట్టు సాగు

- ఏ పంటలు వేయాలో ముందే చెప్పాలి
- ప్రణాళికలపై వ్యవసాయ శాఖ దృష్టిపెట్టాలి
- కోకో పంట నిల్వల కొనుగోలుకు చర్యలు
- హెచ్‌డీ బర్లీ పొగాకుకు క్రాప్ హాలిడే
- కేంద్ర మంత్రుల దృష్టికి రైతు సమస్యలు
- కేబినెట్ సబ్ కమిటీతో సీఎం సమీక్ష



అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ల డిమాండ్‌కు తగ్గట్టు రాష్ట్రంలో పంటల సాగు జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇందుకు అనుగుణంగా పంటల వారీగా సాగు ప్రణాళికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతులు ఎదుర్కొంటున్న స్వల్ప, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం కేబినెట్ సబ్ కమిటీ కూడా దృష్టి పెట్టాలని సూచించారు. గురువారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి మంత్రులు, అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా పొగాకు, కోకో, మామిడి, ధాన్యం ధరలు, రైతు సమస్యలపై సీఎం సమీక్ష చేశారు. సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ పంట, ఎంత విస్తీర్ణంలో సాగు చేయాలో రైతులకు ముందే చెప్పడం వల్ల డిమాండ్-సప్లై మధ్య సమతూకం ఉంటుందన్నారు. డిమాండ్ ఉన్న పంటల్ని మాత్రమే సాగు చేస్తే రైతులు నష్టపోకుండా ఉంటారని, పంట ప్రణాళిక అనేది పూర్తిగా శాస్త్రీయంగా జరగాలని అన్నారు. దిగుబడులను ఎప్పటికప్పుడు ఆర్టీజీఎస్, వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించాలని సూచించారు. రైతుల దగ్గర ఉన్న కోకో పంట నిల్వలను కిలో రూ.500కు కంపెనీలు కొనుగోలు చేసేలా చూడాలని ఆదేశించారు. అవసరమైతే ప్రభుత్వమే నేరుగా కొనుగోళ్లు జరుపుతుందన్నారు. రైతుల దగ్గరున్న 20వేల మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకు నిల్వలను కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,200 నుంచి 1,500 టన్నుల కోకో పంట నిల్వలు ఉండగా, 600 టన్నులు మాత్రమే రైతుల దగ్గర ఉన్నాయని, వాటిని మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉందని అధికారులు వివరించారు. డిమాండ్ లేనందున రైతులు నష్టపోకుండా ఈ ఏడాది హెచ్‌డీ బర్లీ పొగాకు రకానికి క్రాప్ హాలిడే ప్రకటిస్తున్నట్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రైతుల దగ్గర హెచ్‌డీ బర్లీ పొగాకు ఎంత నిల్వ ఉందో యాప్ ద్వారా కచ్చితమైన వివరాలు సేకరించాలని సీఎం సూచించారు. పొగాకు బోర్డులో సెల్ ఏర్పాటు చేసి, రోజువారీ కొనుగోళ్ల వివరాలు నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. హెచ్‌డీ బర్లీ, వైట్ బర్లీ రకాలను పొగాకు బోర్డులో చేర్చాల్సిందిగా కేంద్ర వాణిజ్య శాఖ మంత్రికి లేఖ రాశామని, ఈ వారం తన ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులతో రైతాంగ సమస్యలపై చర్చిస్తానని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రోత్సాహం

మ్యాంగో పల్ప్‌కు సంబంధించి ఆర్డర్లు రాకపోవడంతో మామిడి రైతులు ఆందోళన చెందకుండా తక్షణమే పల్ప్ ప్రాసెసింగ్ కంపెనీలు కొనుగోళ్లు జరిపేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. అయితే పాత నిల్వలు కంపెనీల దగ్గర మిగిలిపోవడంతో కొత్తగా కొనుగోళ్లు చేయడానికి ఆస్కారం లేకుండా పోయిందని, అలాగే పల్ప్ ప్రాసెసింగ్ కంపెనీలకు బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడం కూడా ఇందుకు కారణమైందని అధికారులు వివరించారు. ఈ సమస్య పరిష్కారానికి పల్ప్ ప్రాసెసింగ్ కంపెనీలకు బ్యాంకులు రుణాలిచ్చేలా అధికారులు చూడాలని సీఎం అన్నారు. ఫ్యూర్ జ్యూస్‌లపై సైతం కేంద్ర ప్రభుత్వం 40 శాతం జీఎస్టీ విధించడంతో మామిడి కొనుగోళ్లు మందగించాయని అధికారులు వివరించారు. ఫ్యూర్ జ్యూస్‌లపై జీఎస్టీ తగ్గించేలా కేంద్రంతో సంప్రదింపులు జరపాలని సీఎం నిర్ణయించారు. మ్యాంగో జ్యూస్ వినియోగం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు మ్యాంగో జ్యూస్ ఇవ్వడంతో పాటు తిరుమల వెళ్లే భక్తులకు టీటీడీ మ్యాంగో జ్యూస్ అందించే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. వరి, టమాటా రైతుల సమస్యలపైనా చర్చించారు. రాష్ట్రంలో టమాటా ప్రాసెసింగ్ యూనిట్లు పెరిగేలా ప్రోత్సహించి, రైతులకు ఆశించిన ధర వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు ధాన్యం సేకరణలో ఎలాంటి సమస్యా లేదని, ఏ ప్రాంతాల్లో అయితే తడిసిన ధాన్యం ఉందో పరిశీలించి, దానిని కూడా కొనుగోలు చేస్తున్నామని అధికారులు చెప్పారు. సమీక్షలో మంత్రులు అచ్చెన్నాయుడు, మనోహర్, రవికుమార్, రామానాయుడు, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'తో వ్యవసాయం!

- పాడి పరిశ్రమాభివృద్ధికి ప్రణాళిక

అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి ఉపాధి పథకాన్ని అనుసంధానం చేయాలన్న డిమాండ్‌ను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఉపాధి నిధులతో పశుసంపదను పెంచి, గణనీయంగా పాల దిగుబడి సాధించేందుకు కేంద్ర పథకాన్ని వినియోగించుకోనున్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకంలో పలు వ్యవసాయ, వ్యవసాయేతర పనులు చేస్తున్నారు. దీన్ని మరింత ముందుకు తీసుకువెళుతూ.. పాడిరైతులకు చేయూతనందిస్తే వారు సుస్థిర ఆదాయం సాధించే అవకాశం ఉంటుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు నిర్ణయించారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో పశుగ్రాసం అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే ఉపాధి ద్వారా మినీ గోకులాలు నిర్మించిన ప్రభుత్వం, గ్రామాల్లో నీటి తొట్టెలు నిర్మించి పశువులకు తాగునీటి ఇక్కట్లు తీర్చింది. ఇప్పుడు పశుగ్రాసం అభివృద్ధికి 'హరిత గోపాలం' పథకాన్ని తీసుకువస్తున్నారు. పశుసంవర్థక, గ్రామీణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా ఈ పథకాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. దీని ద్వారా ఒక్కో రైతు ఎకరాకు రూ.40వేల నుంచి రూ.50 వేల దాకా లబ్ధి పొందే అవకాశముంది. ఈ పథకం ద్వారా రైతులు తమ పొలాల్లో పశుగ్రాసం పెంచుకుని, ఉపాధి పథకంలో వేతనం తీసుకోవచ్చు. రెండు పాడి పశువులు కలిగిన రైతులకు 25 సెంట్లు, 3-5 పశువులకు 50 సెంట్లు, 5కంటే ఎక్కువ పశువులు ఉన్న రైతులు ఒక ఎకరాలో పశుగ్రాసం ఉత్పత్తి చేసుకోవచ్చు. స్వయం సహాయక బృందాలు, ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్(ఎఫ్‌పీఓ)లకు యూనిట్‌కు (10 ఎకరాల వరకు) శాశ్వత పశుగ్రాస పంటలు వేసేందుకు అవకాశం కల్పిస్తారు. ఆయా కుటుంబాలు సొంత పొలంలోనే పని చేసుకుని ఉపాధి వేతనం పొందవచ్చు. హరిత గోపాలం ద్వారా రెడ్ నేపియర్, సీఓ-4, సీఓ-3, సీఓ-5, డీహెచ్ఎన్-6 సూపర్ హైబ్రిడ్ నేపియర్ గ్రాస్, సూపర్ నేపియర్ గ్రాస్(పాక్‌చాంగ్ గ్రాస్), ఎన్‌బీ 21 రకాలు పెంచుకునేందుకు ఉపాధి నిధులు అందిస్తారు. 2025-26లో లక్ష ఎకరాల్లో పశుగ్రాసం అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

జీవో 4తో ఆందోళనలో వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్లు

- వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు

విజయవాడ (గాంధీనగర్), మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో 4తో రెవెన్యూ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్.రవీంద్రరాజు తెలిపారు. ఆయా సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా రవీంద్రరాజు మాట్లాడుతూ.. క్లస్టర్ విధానం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7,500 మంది వీఆర్వోలు, 4,722 విలేజ్ సర్వేయర్లను తగ్గిస్తూ ఏ సచివాలయంలోనూ చూపించలేదన్నారు. దీని వల్ల పదోన్నతులకు అర్హులైన వీఆర్ఏలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు సచివాలయాలను కలిపి క్లస్టర్ చేయడం వల్ల గ్రామస్థాయిలో రెవెన్యూకు సంబంధించి రైతులు, ప్రజలకు సేవలందించడంలో భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు.

సారు.. తూకానికీ రేటు!

- చలానా కంటే అదనంగా రూ.400 డిమాండ్
- రూ.1.78 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిన కాశీబుగ్గ డివిజన్ తూనికలు-కొలతల శాఖ అధికారి


ఏసీబీకి పట్టుబడిన శ్రీధర్(నీలం-ఎరుపు గళ్ల షర్టు వేసుకున్న వ్యక్తి)... పక్కనే ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి

పలాస, మే 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గలో పనిచేస్తున్న తూనికలు-కొలతల శాఖ అధికారి టి.శ్రీధర్ రూ.1.78 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు గురువారం పట్టుబడ్డారు. ఈయన ఎలక్ట్రానిక్ తూకాలకు ఏడాదికోసారి వేయాల్సిన సీళ్ల కోసం ప్రభుత్వ చలానా కన్నా అదనంగా రూ.400 డిమాండ్ చేశారు. ఈ విధంగా కాశీబుగ్గ తూనికలు-కొలతలశాఖ పరిధిలో ఉన్న మొత్తం 14 మండలాలకు చెందిన 445 మంది వ్యాపారుల నుంచి రూ.1.78 లక్షలు లంచం తీసుకున్నారు. దీంతోపాటు ఏడాది నుంచి సంబంధిత కాటాలకు సీళ్లు వేయకుండా.. అదనపు డబ్బుల కోసం కార్యాలయం చుట్టు తమను తిప్పుతున్నట్టు వ్యాపారులు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వ్యాపారుల నుంచి రూ.1.78 లక్షలు లంచం తీసుకుంటున్న శ్రీధర్‌ను శ్రీకాకుళం ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి బృందం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఆయన్ను శుక్రవారం విశాఖపట్నం ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పలాస రెవిన్యూ సబ్ డివిజన్‌లో ఓ అధికారిపై ఏసీబీ కేసు నమోదు కావడం ఇదే మొదటిసారి.

తిరుమలలో నమాజ్ చేసిన డ్రైవర్


కల్యాణ వేదికపై నమాజ్ చేస్తున్న దృశ్యం

తిరుమల, మే 22(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఓ డ్రైవరు నమాజ్ చేయడం కలకలం సృష్టించింది. టీటీడీ నిబంధనల ప్రకారం ఇతర మతస్థులు తిరుమలలో తమ ప్రార్థనలు చేయడం నిషేధం. అయితే టీటీడీ సామూహిక వివాహాలు చేసే కల్యాణ వేదిక వద్దకు గురువారం మధ్యాహ్నం ఓ వ్యక్తి టీఎస్ 83 టీ 6705 నెంబరు కారులో వచ్చారు. కొంత సమయం పార్కింగ్‌లోనే గడిపిన ఆ వ్యక్తి.. కల్యాణ వేదికపైకి చేరుకున్నారు. తన వద్దనున్న వస్త్రాన్ని నేలపై పరిచి నమాజ్ చేశారు. తిరిగి కారులో తిరుమల నుంచి వెళ్లిపోయారు. అక్కడి సిబ్బంది ఎవరూ దీనిని గుర్తించకపోవడం గమనార్హం. ఈ విషయం మీడియాలో రావడంతో తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు కల్యాణ వేదికను పరిశీలించారు. ఓ భక్త బృందంతో తిరుమలకు వచ్చిన డ్రైవర్.. వారు దర్శనానికి వెళ్లిన తర్వాత నమాజ్ చేసినట్లు సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. అప్పటికే ఆ వ్యక్తి తిరుమల నుంచి వెళ్లిపోయారు. తిరుమలలో నమాజ్ చేసిన వ్యక్తి ఎవరు? నిబంధనలు తెలియక చేశారా లేదా తెలిసే చేశారా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

వైసీపీ నాయకుల పనే: భానుప్రకాశ్ రెడ్డి

'తిరుమలలోని కల్యాణ వేదిక వద్ద అన్య మతస్థుడు నమాజ్ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వచ్చింది. దాని గురించి మేము విచారిస్తే కొందరు వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా తిరుమల ప్రతిష్ఠను దిగజార్చేలా ఈ చర్యకు పాల్పడినట్టు తెలిసింది. దీనివెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు పెడతాం. భగవంతుడిని అడ్డుపెట్టుకుని ఇలా రాజకీయం చేయడం సరికాదని వైసీపీ నాయకులను హెచ్చరిస్తున్నా' అని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
8
నవ్య
నివేదన
శుక్రవారం • 23 మే 2025

కాలాలకు అతీతం ఆయన మార్గం

ప్రపంచంలో పలు మతాలు ఉన్నాయి. పుట్టుకతోనే మనిషికి ఒక మతం ఉంటుంది. పెరిగే వయసుతోపాటు ఆ మతం తాలూకు నమ్మకాలు అతనితో పెనవేసుకుపోతాయి. కొందరిలో అవి తర్కాన్ని చిదిమేసి, మూఢనమ్మకాలవైపు నడిపిస్తాయి. ఆ మనుషులు ఏర్పరచుకున్న భావనల్లో మానవత్వం మరుగుపడిపోతుంది మనిషి, అతని నడవడిక, ఆలోచన, ఆచరణలే కేంద్రంగా ఏర్పడిన మతం... బౌద్ధం. ప్రపంచానికి ప్రేమను, కరుణను, అహింసను మొదటిసారిగా అందించినవాడు బుద్ధుడు.

హిందూ ధర్మంలో కర్మ సిద్ధాంతానికి ఎంతో ప్రాధాన్యత ఉన్నదనేది మనకందరికీ తెలిసినదే. హిందువులు పవిత్ర గ్రంథంగా భావించే 'భగవద్గీత'లో కర్మ గురించి ఒక అధ్యాయమే ఉంది. అలాగే బౌద్ధం కూడా కర్మకు ప్రాధాన్యాన్నిచ్చింది. అయితే హైందవం 'బుద్ధి కర్మానుసారిణీ' అంటే... 'కర్మ బుద్ధ్యానుసారిణీ' అంటుంది బౌద్ధం. 'కర్మను బట్టి మన బుద్ధి నడుచుకుంటుంది. ఏ ఆలోచన వచ్చినా, ఆపద కలిగినా, ఉపద్రవం సంభవించినా అది మన కర్మ ఫలితమే' అనే భావన హైందవానిది. దానికి భిన్నంగా... 'మనం చేసే ప్రతి కర్మా మన ఆలోచనల ఫలితం' అని బౌద్ధం చెబుతుంది. చాలా చిన్నదిగా కనిపించే ఈ తేడా... ఆ మతాలను అనుసరించే మనుషుల మీద, సంఘం మీద పెను ప్రభావం ఎలా చూపిస్తుందనేది పరిశీలించవలసిన అవసరం ఉంది.

> **ధర్మపదం**
>
> హైందవం 'బుద్ధి కర్మానుసారిణీ' అంటే... 'కర్మ బుద్ధ్యానుసారిణీ' అంటుంది బౌద్ధం. 'కర్మను బట్టి మన బుద్ధి నడుచుకుంటుంది. ఏ ఆలోచన వచ్చినా, ఆపద కలిగినా, ఉపద్రవం సంభవించినా అది మన కర్మ ఫలితమే' అనే భావన హైందవానిది. దానికి భిన్నంగా... 'మనం చేసే ప్రతి కర్మా మన ఆలోచనల ఫలితం' అని బౌద్ధం చెబుతుంది. చాలా చిన్నదిగా కనిపించే ఈ తేడా... ఆ మతాలను అనుసరించే మనుషుల మీద, సంఘం మీద పెను ప్రభావం ఎలా చూపిస్తుందనేది పరిశీలించవలసిన అవసరం ఉంది.

ధర్మచింతనా ముఖ్యమే...

ప్రతిదాన్నీ కర్మే నిర్ణయిస్తే... వ్యక్తి తను చేస్తున్న పనుల గురించి దృఢమైన ఆలోచనలు ఎలా చేయగలడు? పేదరికంలో ఉన్నవాడు, అణచివేతకు, అన్యాయాలకు గురవుతున్నవాడు ఇదంతా తన కర్మ ఫలితమేననే ఉదాసీనతకు గురవుతాడు. 'మనం ఏమిటనేది మన ఆలోచనల ఫలం, మన ఆలోచనల ఆధారంగానే మనం నిర్మితం అవుతాం' అనే 'ధర్మపదం' ప్రజలకు చేరడం, వారు అంగీకరించడం. త్రిశరణాలుగా ఖ్యాతి పొందిన 'బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి' అనేవి బుద్ధునికి ప్రతీకలు. సంఘం అంటేనే మనుషుల సమూహం. నైతిక ప్రవర్తన, ధర్మ చింతన, స్వీయ పరిశీలన లేని మనుషులు ఉండే సంఘంలో అశాంతి, ఆటవికత రాజ్యం ఏలుతాయి.



కాబట్టి మనిషికి సంఘం ఎంత ముఖ్యమో... ఆ సంఘంలో ఉండే మనుషుల్లో ధర్మ చింతన కూడా అంతే ముఖ్యమని వేల సంవత్సరాల క్రితమే తెలియజెప్పిన బుద్ధుని బోధలు కాలాలకు అతీతంగా మానవతకు మార్గదర్శకాలు.

• నరసింహ ప్రసాద్ గొర్రెపాటి
94407 34501

సహజయోగ



'బాహ్య సౌందర్యం కన్నా ఆత్మ సౌందర్యం మిన్న' అనే మాట మనం తరచుగా వింటూ ఉంటాం. ఇంతకూ 'ఆత్మ సౌందర్యం' అంటే ఏవిటి? దాన్నెలా పెంపొందించుకోవాలి? ఇవి తెలుసుకోవలసిన ఆసక్తికరమైన విషయాలు.

ఆ సౌందర్యమే శాశ్వతం

చాలామంది దృష్టిలో... అందానికి అంటే సౌందర్యానికి ప్రతీక - మోనాలిసా. ఆ చిత్రాన్ని గీసిన కళాకారుడు లియోనార్డో డావిన్సీ. అతను ఫ్రాన్స్‌కు చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి. అతను సృజించిన చిత్రపటం మోనాలిసా నిజానికి ఒక బిడ్డను కోల్పోయిన తల్లిది. సంతాన వియోగంతో ఆమె చాలా కాలంగా బాధపడుతూ ఉంటుంది. ఒక రోజు... తన బిడ్డ పోలికలున్న మరొకరి బిడ్డను చూసినప్పుడు.. ఆమె ముఖంలో చిరునవ్వు ఉదయించింది. దాన్ని డావిన్సీ యథాతథంగా చిత్రించారు. ఆమె ముఖంలో విరిసిన చిరునవ్వు ఎన్ని తరాలు గడచినా... ఇప్పటికీ సౌందర్యానికి ప్రతీకగా నిలిచిపోయింది. ఆధునిక కాలంలో అందానికి ఉన్న నిర్వచనాల ప్రకారం మోనాలిసా పెద్ద అందగత్తె కాదు. కానీ ఆమె సౌందర్యానికి చిహ్నంగా ఆకర్షిస్తూనే ఉంది. ఆ చిత్రపటం నుంచి వచ్చే చైతన్య తరంగాలు మానవుల అంతరాత్మను స్పృశించడమే దీనికి కారణం. అది ఆత్మ సౌందర్యాన్ని ప్రతిబింబించే చిత్రపటం. ఎందుకంటే... ఒక మహిళ ముఖంలో మాతృప్రేమ ప్రతిఫలిస్తున్నప్పుడు... ఆమె అత్యంత సుందరంగా కనిపిస్తుంది.

మీ లోపలికి చూడండి...

మానవుల దృష్టిని అధోముఖంగా తీసుకువెళ్ళే భౌతికమైన శరీర ఆకర్షణ అంత ముఖ్యమైనది కాదు. మన శరీరంలోని ప్రతి భాగం నుంచి చైతన్య తరంగాలు ప్రవహించేలా మనం ఉండాలి. మనం దేనినైనా మనం తాకితే... దాని నుంచి చైతన్య తరంగాలు ప్రవహించడం ప్రారంభించాలి. అటువంటి సౌందర్యం... దైవికమైన సౌందర్యం. బాహ్య సౌందర్యం వెంట, కృత్రిమమైన ఆకర్షణల వెంట పరుగెత్తడం మంచిది కాదు. వేల సంవత్సరాల నుంచి వారసత్వంగా పొందిన సంస్కృతీ సంప్రదాయాలు మన భారతీయులకు ఉన్నాయి. వాటిని నిలబెట్టుకోవడానికి మనం ప్రయత్నించాలి. సంప్రదాయ కళలు, ఆభరణాలు, దుస్తులు... ఇవి వేల ఏళ్ళుగా వినియోగంలో ఉన్నాయి. వాటిని మనం ఉపయోగించుకోవాలి. కానీ పాశ్చాత్య దేశాల ప్రభావంతో మనం మన సంస్కృతిని మరిపోయాం. బయటి వాటిని అనుసరిస్తున్నాం. దీనివల్ల మనం మనలోని 'ఆత్మ'గా పిలిచే అతి ముఖ్యమైన అంశం అజ్ఞానంతో కప్పడిపోతోంది. మన దేశంలో ఆత్మకు అలంకారం

> **మన కళ్ళు బాహ్యమైన విషయాల మీద త్వరగా కేంద్రీకృతం అవుతాయి. మానవులమైన మన ధ్యాస ఎప్పుడూ బయటే ఉండడం దీనికి కారణం. అలాకాకుండా మన లోపలికి చూడడానికి ప్రయత్నించినప్పుడు... ఆ అంతర్ సౌందర్యాన్ని, దానిలోని ఆనందాన్ని గ్రహించగలుగుతాం.**

లాంటి విషయాలు వేలకొద్దీ ఉన్నాయి. అవి ఆత్మను అణచివేయవు. కానీ మన కళ్ళు బాహ్యమైన విషయాల మీద త్వరగా కేంద్రీకృతం అవుతాయి. మానవులమైన మన ధ్యాస ఎప్పుడూ బయటే ఉండడం దీనికి కారణం. అలాకాకుండా మన లోపలికి చూడడానికి ప్రయత్నించినప్పుడు... ఆ అంతర్ సౌందర్యాన్ని, దానిలోని ఆనందాన్ని గ్రహించగలుగుతాం.

ఆ మెరుపు మీలోనే ఉంది...

మరి ఆ ఆనందాన్ని వదిలేసి... మన ధ్యాస బయట ఎందుకు తిరుగుతోంది? ఎందుకంటే అంతర్ సౌందర్యాన్ని గ్రహించగలిగే స్థితిని మనం సాధించలేదు. అందుకే ఆత్మను పాడుచేసే వాటిని ఇష్టపడుతున్నాం. కానీ ఆ సంగతి తెలుసుకోవడం లేదు. సహజయోగ దీనికి మార్గం చూపుతుంది. సహజయోగ సాధన ద్వారా తమ లోపల ఉన్న కుండలినీ శక్తి జాగృతం చేసుకున్నవారు... భగవంతుని ఆశీస్సుల వల్ల ఆత్మ స్వరూపులుగా మారుతారు. అంటే పవిత్రత, మాతృప్రేమ, సంతృప్తి, సృజనాత్మకత, ధైర్యం, అందరితో కలసిపోయే స్వభావం, క్షమాగుణం లాంటి ఆత్మకు ఉండే శుభ లక్షణాలన్నిటినీ పొందుతారు. ఈ లక్షణాలతో జీవించడం వల్ల మనం ఆత్మ సౌందర్యాన్ని పొందగలం. కాబట్టి మీ లోపల ఉన్న 'ఆత్మ' అనే వజ్రాన్ని గుర్తించండి. దాని లక్షణాలను గ్రహించండి. మీరే ఆ వజ్రం అని తెలుసుకోండి. దాని మెరుపు మీలోనే ఉంది. ఆత్మ సాక్షాత్కారం ద్వారా మీ ఆత్మ సౌందర్యం అనే ఆ మెరుపు ప్రజల్లో మీ పట్ల గౌరవాన్ని పెంచుతుంది. మీలో శాశ్వతంగా నిలిచేది అదే. కాబట్టి ఆత్మ సౌందర్యాన్ని పెంపొందించుకోవడానికి ప్రయత్నించండి. భౌతిక సౌందర్యం కోసం వెంపర్లాడి అనుకరణల జోలికి పోకుండా... మీలో ఉన్న 'మిమ్మల్ని' గుర్తించండి. అదే మీ శాశ్వతమైన విలువ. దాన్ని అభివృద్ధి చేసుకోండి.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

సందేశం

సలామ్.. ఒక ప్రార్థన

'సలామ్' అనే పదం అల్లాహ్ మహోన్నతమైన శుభ నామాల్లో ఒకటి. దానికి 'శాంతి ప్రదాత' అని, 'అల్లాహ్ శాంతికి మూలం. మీపై శాంతి శ్రేయస్సులు వర్షించుగాక' అని అర్థాలు ఉన్నాయి. తొలి మానవుడైన ఆదం (అలై)ను సృష్టించిన అల్లాహ్... అతనికి అన్నిటికన్నా ముందు సలామ్ చేసే సంస్కారాన్ని నేర్పాడు.



ఎదుట ఉన్న వ్యక్తి ఒక్కరే అయినప్పటికీ... బహువచనాన్ని ఉపయోగిస్తూ సలామ్ చేయడం, బదులుగా ఎదుటి వ్యక్తి కూడా అదే రీతిలో సలామ్ చేయడం అభిలషణీయమైన పద్ధతి. "ఎవరైనా మీకు గౌరవభావంతో సలామ్ చేస్తే... మీరు అంతకన్నా ఉత్తమమైన పద్ధతిలో ప్రతి సలామ్ చేయండి. లేదా కనీసం ఆ విధంగానైనా చేయండి. ఇతరుల ఇళ్ళకు వెళ్ళినప్పుడు... వారికి సలామ్ చేసి, వారి అంగీకారం పొందిన తరువాతే లోపలికి ప్రవేశించండి. ఇది ఎంతో ఉత్తమమైన పద్ధతి. అది మేలు కోసం చేసే ప్రార్థన. అల్లాహ్ తరఫున నిర్ణయించిన ఈ పద్ధతి ఎంతో శుభవంతమైనది, పరిశుద్ధమైనది" అని దివ్య ఖుర్ఆన్ చెబుతోంది. ఎదుటి వ్యక్తులకు ముందుగా సలామ్ చేసేవారు అల్లాహ్ దృష్టిలో అందరికన్నా శ్రేష్ఠులనీ, తనకోసం అల్లాహ్‌ను ప్రార్థించనివాడు మూర్ఖుడైతే, సలాం చేయడంలో అలసత్వం వహించేవాడు అందరికన్నా లోభి అని అంతిమ దైవ ప్రవక్త మహమ్మద్ స్పష్టం చేశారు.

• మహమ్మద్ వహీదుద్దీన్

గీతాసారం

నిశ్చితి-అనిశ్చితి

జీవితంలో మనకు ఎదురైన రకరకాల సందర్భాల్లో భావోద్వేగాలకు గురి అవుతూ ఉంటాం. అప్పుడు మనలో అనిశ్చితి నెలకొంటుంది. భావోద్వేగానికి లోనై... సరైన సాక్ష్యాధారాలు లేకుండా నిర్ణయాలు తీసుకోవడం, నిర్ధారణలకు రావడం, అంచనాలు

> **శాశ్వతమైన నిశ్చయత అనేది సొంత జీవన అనుభవాల నుంచి వస్తుంది. ఇది డ్రైవింగ్ లేదా సైక్లింగ్ లాంటిది. అది ప్రతి ఒక్కరికీ వారి వారి సొంత అనుభవం. ఈ అనుభవాలను పుస్తకాలనుంచో లేదా ఇతరుల నుంచో అరువు తెచ్చుకోలేం. కాబట్టి దాన్ని మనం కష్టపడే సంపాదించుకోవాలి.**




వేయడం లాంటివి వదిలేయాలని శ్రీకృష్ణుడు సూచించాడు. యుద్ధంలో తన బంధువులను చంపడం వల్ల ఎలాంటి మంచి జరగదనే భావనతో అర్జునుడు యుద్ధాన్ని తప్పించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆ తరువాత... తన నిర్ణయాన్ని సమర్థించుకోవడం కోసం 'ఏది సముచితం, ఏది కాదు?' అనే చర్చను ముందుకు తెచ్చాడు. "అన్నిటికన్నా వివేకమే ఉన్నతమైనదిగా భావిస్తే నన్ను ఈ భయంకరమైన యుద్ధంలోకి ఎందుకు దించావు? ప్రసంగాలతో నాకు కలవరం కలిగించవద్దు. నా క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని... అన్నిటికన్నా ఏది మంచిదో నాకు నిశ్చయంగా చెప్పు" అని శ్రీకృష్ణుణ్ణి అడిగాడు. ఈ ప్రశ్న అవగాహన కోసం, అన్వేషణ కోసం కాకుండా స్వీయ సమర్థనకోసం వేసినట్టు కనిపిస్తుంది.

మన పరిస్థితి కూడా అర్జునుడికన్నా భిన్నంగా ఏమీ లేదు. ఎందుకంటే... మనం ఈ లోకంలోకి వచ్చీ రాగానే... మతం, జాతి, కులం, కుటుంబ స్థితి, జాతీయత, ఆడ-మగ మొదలైన వాటితో మనకు గుర్తింపు ఏర్పడుతుంది. వాటిని నిలబెట్టుకోవడానికి, వాటిని సమర్థించుకోవడానికి జీవితాంతం పోరాడుతూనే ఉంటాం. అలాగే అర్జునుడు కూడా సమర్థన కోసం నిశ్చయమైన సమాధానాన్ని శ్రీకృష్ణుడి నుంచి ఆశిస్తున్నాడు. ఈ లోకంలో ఆశాశ్వతత్వం, అనిశ్చితి అనేవి ప్రమాణాలుగా ఉంటాయి. అంటే ఏదీ శాశ్వతం కాదు, ఏదీ నిశ్చయంగా ఉండదు. కానీ మనకు హాయిని ఇచ్చే నిశ్చయత లేదా నిశ్చితి (సర్టెనిటీ) కోసం ఎదురుచూస్తాం. హేతుబద్ధమైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలుచూపే మరిన్ని విషయాలను తెలుసుకోవడానికి, అనిశ్చితిలోనే నిరీక్షించడానికి ధైర్యం, ఓర్పు కావాలి. శాశ్వతమైన నిశ్చయత అనేది సొంత జీవన అనుభవాల నుంచి వస్తుంది. ఇది డ్రైవింగ్ లేదా సైక్లింగ్ లాంటిది. అది ప్రతి ఒక్కరికీ వారి వారి సొంత అనుభవం. ఈ అనుభవాలను పుస్తకాల నుంచో లేదా ఇతరుల నుంచో అరువు తెచ్చుకోలేం. కాబట్టి దాన్ని మనం కష్టపడే సంపాదించుకోవాలి.



కె.శివప్రసాద్

సద్బోధ



బుద్ధఘోషుడి జ్ఞానదీక్ష

బౌద్ధ ధర్మంలోని మహాయాన మార్గంలో ఆచార్య నాగార్జునుడిది ఎంత గొప్ప స్థానమో... థేరవాదంలో బుద్ధఘోషుడిది అంతటి ఉన్నతమైన స్థానం. దీనికి కారణం అతనిలో నేర్చుకోవాలనే జిజ్ఞాస. జ్ఞాన సాధనకు పట్టుదల, కృషి ఎంతో అవసరమని అతని కథ చెబుతుంది. బుద్ధఘోషుడు క్రీస్తుశకం నాలుగు, అయిదు శతాబ్దాలకు చెందినవాడు. అతను తెలుగువాడనే అభిప్రాయం కూడా ఉంది. బాల్యం నుంచే జ్ఞానతృష్ణ కలిగిన బుద్ధఘోషుడు... ఎక్కడ పండితులు ఉన్నారని తెలిస్తే అక్కడికి వెళ్ళేవాడు. వారితో చర్చలు జరిపేవాడు. చివరకు ఒక బౌద్ధ విహారానికి చేరుకున్నాడు.

అతనికి ఆ విహారాధిపతి ఆచార్య రేవతుడు ఆశ్రయం ఇచ్చాడు. అప్పటికే చీకటిపడింది. నిద్రపోవడానికి ముందు బుద్ధఘోషుడు సముద్ర ఘోషలాంటి గంభీర స్వరంతో పతంజలి యోగ సూత్రాలను వల్లె వేశాడు. వాటిని జాగ్రత్తగా విన్న రేవతుడు "ప్రస్తుతానికి విశ్రాంతి తీసుకో. రేపటి ఉదయం నా వద్దకు రా" అన్నాడు.

మరుసటిరోజు ఉదయం రేవతుణ్ణి బుద్ధఘోషుడు కలుసుకున్నాడు. అప్పుడు రేవతుడు "రాత్రి గాడిదలా ఓండ్ర పెట్టింది నువ్వేనా?" అని ప్రశ్నించాడు. అప్పుడు బుద్ధఘోషుడు "నాది గాడిద ఓండ్ర అంటున్నారే? నేను చదివినది మీకు కాస్తయినా అర్థమయిందా?" అని అడిగాడు.

రాత్రి తనకు విశ్రాంతి కోసం విహారంలో చోటు ఇచ్చిన వ్యక్తితో ఏమాత్రం తటపటాయించకుండా మాట్లాడిన బుద్ధఘోషుడి ఆత్మవిశ్వాసం, కపటంలేనితనం రేవతుడికి నచ్చాయి. ఆయన చిరునవ్వు నవ్వుతూ బుద్ధఘోషుడి భుజం తట్టి "అలా కూర్చో" అని తన ఎదుట ఉన్న ఆసనాన్ని చూపించాడు. పతంజలి యోగ సూత్రాలను చాలా స్పష్టంగా వల్లిస్తూ... వాటిపై అద్భుతమైన వ్యాఖ్య చేశాడు. ఆశ్చర్యంతో నోట మాటరాక... కొయ్యబొమ్మలా కూర్చొని వినడం బుద్ధఘోషుడి వంతయింది. తనకు 'తెలిసింది గోరంత, తెలుసుకోవలసింది కొండంత' అని అర్థమయింది. అతని అహంకారం అణగిపోయింది. రేవతుడి ముందు మోకరిల్లాడు. తనను శిష్యుడిగా స్వీకరించి జ్ఞానబోధ చేయాలని రెండు చేతులూ జోడించి ప్రార్థించాడు.

అప్పుడు రేవతుడు 'అభిదమ్మ పిటకం' నుంచి కొంత భాగాన్ని చదివి వినిపించి "దీన్ని 'సమ్మా సంబుద్ధవాదం' అంటారు. దీని గురించి తెలుసుకోవాలంటే ముందుగా ప్రవజ్య దీక్ష తీసుకోవాలి" అన్నాడు. బుద్ధఘోషుడు తక్షణమే తన అంగీకారం తెలిపాడు. అతని కంఠస్వరంలోని గాంభీర్యాన్ని చూసి... రేవతుడు ఇచ్చిన దీక్షానామమే బుద్ధఘోష. దానితో అతని అసలు పేరు మరుగున పడిపోయి... ఆ పేరే జగత్ప్రసిద్ధం అయింది. రేవతుడి శిష్యరికంలో జ్ఞానదీక్ష చేపట్టిన బుద్ధఘోషుడు త్రిపిటకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. రేవతుడి ఆదేశానుసారం సింహళద్వీపానికి వెళ్ళి, అక్కడ ఆచార్యులను కలిసి, చర్చలు జరిపాడు. 'విశుద్ధ మగ్గ' అనే గ్రంథాన్ని రచించాడు. దాన్ని బౌద్ధ పండితులు 'థేరవాద సర్వస్వం'గా పరిగణిస్తారు.

• రాచమడుగు శ్రీనివాసులు

చింతన

అదే అసలైన స్వేచ్ఛ

సుఖదుఃఖాలు మన జీవితంలో రెండు భాగాలు. సుఖంగా ఉన్నప్పుడు... ఆ సుఖం అలాగే కొనసాగాలని మనిషి ఆరాటపడతాడు. దుఃఖం, బాధ కలిగినప్పుడు విలవిలలాడిపోతాడు. ఎందుకంటే ఇది మనిషి స్వభావం. మంచి చెడుల విచక్షణాభావం అందరికీ ఉంటుంది. కాని సత్యం అనేది ఒకటి ఉంది. అది మంచి చెడులకు అతీతమైనది. ఆ సత్యం మన హృదయాలలో నిక్షిప్తమై ఉంది. దానికి మీరు సుపరిచితులు కావాలని కోరుకుంటున్నాను.

సమస్యలన్నిటికీ మూలకారణం... మనమే

కష్టాల్లో, సమస్యలలో కూరుకుపోయినప్పుడు.. మనం పొందినవాటితో, మనం కోల్పోయినవాటితో జీవితాన్ని బేరీజు వేసుకుంటాం. ఉద్యోగాన్ని, కుటుంబాన్ని, బాధ్యతలను చూసుకొని... అదే తమ జీవితం అని అందరూ భావిస్తారు. కానీ జీవితం అంటే ఇవేవీ కావు. జీవితంలో అన్నిటికన్నా ముఖ్యమైనది ఏదైనా ఉందంటే... అది మనలో నడిచే శ్వాస. ఈ శ్వాస రాకపోకలు ఆగిపోయినప్పుడు... మీ గౌరవ ప్రతిష్ఠలు, మీ బంధాలు, బాంధవ్యాలు, ఉద్యోగం, ధన సంపదలు... వేటినైతే మీరు జీవితం అని ఈనాడు భావిస్తున్నారో అవన్నీ అంతమైపోతాయి. దేనివల్ల ఈ రోజు జీవించి ఉన్నారో, దేనివల్ల మీకంటూ ఈనాడు ఒక విలువ ఉందో... దాన్ని తెలుసుకోవడమే ఈ జీవితం తాలూకు సర్వ శ్రేష్ఠమైన లక్ష్యం. దాన్ని తెలుసుకోకపోతే జీవితం నిరర్థకం అవుతుంది. జీవితం ఉన్నందువల్లే సమస్యలు కూడా ఉన్నాయి. మనిషి సమస్యల నుంచి తప్పించుకోలేడు. మనకున్న సమస్యలన్నిటికీ మూలకారణం... మనమే. అవన్నీ మనం సృష్టించుకున్నవే. ఈ ప్రాపంచిక నియమావళి అందరికీ సమానమే. సమస్యలనేవి అందరినీ ఒకేలా వేధిస్తాయి. వాటన్నిటికీ కారణం... మనిషి తన భుజస్కంధాలమీద అనవసరమైన భారాన్ని మోస్తూ ఉండడం.



ఈ రోజు.... మరో అవకాశం

జీవితంలో నిరాశకు స్థానం ఉండకూడదు. జీవితంలో నిరాశతో కుంగిపోతున్న స్థితిలో కూడా... ఆశ అనేది మీలోనే ఉద్భవిస్తుంది. రేపటి రోజున సూర్యుడు తిరిగి ఉదయిస్తాడు, అస్తమిస్తాడు. ఉదయించిన సూర్యుడు తప్పనిసరిగా అస్తమించినా... మరుసటి రోజు మళ్ళీ ఉదయించి, మనకు మరొక కొత్త రోజును అందిస్తాడు. అలాగే మీ జీవితాన్ని కూడా తిరిగి ప్రారంభించడానికి మీకొక కొత్త రోజు... ప్రతిరోజూ లభిస్తుంది. ఆ రోజుకు స్వాగతం పలకండి. మీలోని ఆశాజ్యోతులను వెలిగించండి. మీలోని ఆనందాన్ని వీక్షించండి. నిన్నటి రోజు మీరు చేసిన తప్పిదాలను సరిదిద్దుకోవడానికి ఈరోజు మీకు మరొక అవకాశాన్ని కల్పిస్తోంది. కాబట్టి మీ జీవితంలో ఆశాకిరణాలను ప్రకాశింపజేయండి. ఆ భగవంతుడు మీకు ఈ శరీరాన్ని, ఈ శ్వాసను కానుకగా ఇచ్చాడు. వాటినుంచి లాభాన్ని పూర్తిగా పొందండి.

జీవితం ఒక కానుక


మీలో సాగే ఈ శ్వాస అత్యంత అమూల్యమైనదని మీరు ఎప్పుడైనా గుర్తించారా? భగవంతుడి అనుగ్రహం వల్ల... ఎవ్వరి ప్రమేయం లేకుండా తనకుతానే ఈ శ్వాస మీ లోపలికి వస్తోంది, పోతోంది. అది మీకు మళ్ళీ దొరకని ఒక అవకాశాన్ని, ఒక కానుకను అందిస్తోంది. జీవితం అనే ఆ కానుకను మనిషి అందుకోవాలి. మీరు ఈ ప్రపంచంలో ఉత్త చేతులతో జన్మించినప్పటికీ... ఉత్త చేతులతో వెనుతిరగవలసిన అవసరం లేదు. మీ వెంట ఏదైనా తీసుకువెళ్ళండి. మరి మీరు మీ వెంట దేన్ని తీసుకువెళ్ళగలరు? హృదయపాత్రను ప్రేమతో, ఆనందంతో నింపుకొంటే... దాన్ని తీసుకువెళ్ళగలరు. మీకు లభించిన ఈ శ్వాస, ఈ సమయం, ఈ జీవితం... ఇవన్నీ ఎంతో అమూల్యమైనవి. వాటని వృథా చేసుకోకూడదని మీరు గ్రహిస్తే... మీ జీవితం రూపురేఖలే మారిపోతాయి. ఆ మార్పు మీకు బయటకు కనిపించకపోవచ్చు, కానీ మీలో ఎంతో పరివర్తన వస్తుంది. మీ శ్వాస గొప్పతనాన్ని మీరు అర్థం చేసుకున్న రోజున... మిమ్మల్ని మీరు తెలుసుకుంటారు. సందేహాలకు స్థానంలేని స్థితిలో జీవితాన్ని కొనసాగిస్తారు. మీలోనికి వచ్చే పోయే శ్వాసతో మీకు అనుబంధం ఏర్పడితే... అప్పుడు మీకు మీ జీవితం మీద ప్రేమ కలుగుతుంది. ఎప్పుడైతే మీకు మీ జీవితంపై ప్రేమ కలుగుతుందో... అప్పుడు మిమ్మల్ని మీరు స్వతంత్రులుగా భావిస్తారు. అదే మీలోని అసలైన స్వేచ్ఛ.



ప్రేమ్‌రావత్

సౌదీ తటస్థ వేదికగా చర్చలు

» పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆశాభావం



ఇస్లామాబాద్, మే 22: కశ్మీర్, సింధూ జలాలు, వాణిజ్యం, ఉగ్రవాదం వంటి కీలక అంశాలపై సౌదీ అరేబియా తటస్థ వేదికగా భారత్, పాక్ మధ్య చర్చలు జరగొచ్చని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆశాభావం వ్యక్తం చేశారు. సౌదీ ఇరు దేశాలకు ఆమోదయోగ్యమైన తటస్థ వేదికగా ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కరాచీకి చెందిన డాన్ పత్రిక కథనం ప్రచురించింది. అయితే చైనాలో చర్చలు జరిగే అవకాశాన్ని ఆయన తోసిపుచ్చారు. దీనికి భారత్ ఎప్పటికీ అంగీకరించబోదని చెప్పారు. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించే దిశగా చర్చలకు మధ్యవర్తిత్వం వహించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు సౌదీ ప్రకటించింది. కాగా, ఉగ్రవాదం, పీవోకేను అప్పగించడంపై మాత్రమే పాక్‌తో చర్చలు జరుపుతామని, ఇందులో మూడో పక్షం జోక్యానికి తావులేదని భారత్ ఇప్పటికే స్పష్టం చేసింది.

ఆపరేషన్ సిందూర్‌లో 3వేల మంది అగ్నివీరులు

న్యూఢిల్లీ, మే 22: ఆపరేషన్ సిందూర్‌లో మన సైన్యంలోని అగ్నివీరులూ కీలకపాత్ర పోషించారు. భారత్ దాడులకు ప్రతిదాడుల కోసం దాయాది పాక్ ప్రణాళికలను చిత్తు చేయడంలో 3వేల మందికిపైగా అగ్నివీరులు గట్టి పోరాట పటిమ కనబర్చారు. కీలకమైన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల వద్ద సైనికులతో పాటు విధుల్లో పాల్గొన్నారు. తద్వారా పాక్ క్షిపణులు, డ్రోన్ దాడుల నుంచి మనదేశ సైనిక స్థావరాలను పరిరక్షించారు. అంతా 20 ఏళ్ల వయసువారైన ఈ అగ్నివీరులు గత రెండేళ్లలో అగ్నిపథ్ పథకం కింద సైన్యంలోకి వచ్చారు. ఆపరేషన్ సిందూర్ సక్సెస్‌లో అగ్నివీరుల సహకారం ప్రశంసనీయమైనదని సైనిక వర్గాలు పేర్కొన్నాయి. ఎల్-70, జెడ్‌యూ-23-2బీ లాంటి యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ గన్స్ నిర్వహణలో, ఆకాశ్ వంటి క్షిపణులను మోహరించడం, ప్రయోగించడంలోనూ అగ్నివీరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ గదిలో 12 ఏళ్ల బాలికపై గ్యాంగ్ రేప్!

» యూపీలో ఘటన.. ఐదుగురు బాలుర అరెస్టు

బరెయిలీ, మే 22: పన్నెండేళ్ల దళిత బాలికపై ఐదుగురు బాలురు తాము చదువుకుంటున్న పాఠశాలలోని ప్రిన్సిపల్ గదిలో సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఆ ఘోరాన్నంతా సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. యూపీలోని మొరాదాబాద్‌లో ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఐదుగురు నిందితులు 12-15 ఏళ్లలోపు వారే. బాలికతో పాటు అదే స్కూల్లో ఏడో క్లాసు నుంచి తొమ్మిదో క్లాసు చదువుతున్నారు. నిందితులంతా కూడా బాలిక ఇంటి సమీపంలోనివారే.. ఆమె సామాజిక వర్గానికి చెందిన పిల్లలే! మే 8న బాలిక, తన ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా ఆమెతో మాటలు కలిపిన ఐదుగురు బాలురు.. కొద్దిసేపటికి ఆమెను అక్కడి నుంచి ఎత్తుకెళ్లారు. వారిలో ఒకరి తండ్రి స్కూల్లో వాచ్‌మన్ కావడంతో బడి తాళం చెవులు తెచ్చాడు. బడి గేటు తాళం తీసి.. ఆమెను నేరుగా ప్రిన్సిపల్ గదిలోకి తీసుకెళ్లారు. అక్కడ మత్తు మందు కలిపిన కూల్ డ్రింక్‌ను బాలికతో తాగించారు. ఆమె మత్తులోకి జారుకోగానే ఒకరి తర్వాత మరొకరు అత్యాచారానికి ఒడిగట్టారు. కొన్నిరోజులకు ఆ వీడియోను ఆ బాలురే నెట్‌లో పెట్టారు. ఈ నెల 19న బాలిక పొరుగింటి మహిళ ఆ వీడియోను చూసి.. దారుణం గురించి బాధితురాలి తల్లికి చెప్పింది. బాలిక తల్లి అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట ప్రవేశపెట్టారు.

బీజేపీపై రెండే నిమిషాలా?

వరంగల్ సభలో ఆ పార్టీని ఇంకా టార్గెట్ చేయాల్సింది

బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌కు కవిత 7 పేజీల లేఖాస్త్రం

హైదరాబాద్, మే 22, (ఆంధ్రజ్యోతి): కిందటి నెలలో వరంగల్‌లో నిర్వహించిన పార్టీ రజతోత్సవ సభలో బీజేపీని ఇంకా గట్టిగా లక్ష్యంగా చేసుకుని మాట్లాడాల్సి ఉందంటూ.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ఆయన కుమార్తె, తెలంగాణ ఎమ్మెల్సీ కవిత సంచలన లేఖ రాశారు. కేసీఆర్ అలా చేయకపోవడం వల్ల.. బీఆర్ఎస్ భవిష్యత్తులో బీజేపీతో పొత్తు పెట్టుకుంటుందనే ఊహాగానాలు మొదలయ్యాయని అందులో పేర్కొన్నారు. బీజేపీపై కేసీఆర్ ఇంకా బలంగా మాట్లాడాలని తనకు కూడా ఉందని తెలిపారు. మే 2వ తేదీన ఆమె రాసిన ఏడు పేజీల లేఖ.. ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. "డాడీ.. సభ విజయవంతం అయినందుకు ముందుగా మీకు శుభాకాంక్షలు. ఈ సందర్భంగా నా దృష్టికి వచ్చిన కొన్ని సానుకూల, ప్రతికూల స్పందనలను మీతో పంచుకోవాలనుకుంటున్నాను." అంటూ తొలి మూడు పేజీల్లో సానుకూల అంశాలను ప్రస్తావించిన ఆమె.. తర్వాతి నాలుగు పేజీల్లో ప్రతికూల అంశాల గురించి సవివరంగా వెల్లడించారు. కాంగ్రె‌స్‌పై కిందిస్థాయిలో నమ్మకం పోయిందని ఆ లేఖలో పేర్కొన్న ఆమె.. ఆ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీ అవుతుందేమో అనే భావనను పార్టీ కార్యకర్తలే వ్యక్తం చేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేయకుండా బీజేపీకి సాయం చేశామనే సందేశాన్ని కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. "ఇలాంటి రాజకీయ పరిస్థితులను ఎదుర్కోవడానికి మీరు ఒక నిర్దిష్ట కార్యాచరణ ఇస్తారని అందరూ ఆశించారు. కనీసం ఇప్పటికైనా ఒకటి, రెండు రోజులు పార్టీ ప్లీనరీ నిర్వహించండి. వీలైనంత ఎక్కువమంది అభిప్రాయాలు వినండి. ఈ విషయాన్ని కొంచెం సీరియస్‌గా తీసుకోండి." అని సూచించారు. కార్యకర్తలను ఆకట్టుకోవడంలో "ధూం.. ధాం" విఫలమైందన్నారు. "జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే స్థాయి వాళ్లు కూడా మిమ్మల్ని కలవడానికి అవకాశం దొరకడంలేదని బాధపడుతున్నారు. కొంతమందే కలవగలుగుతున్నారు. ఎంపికచేసిన వాళ్లే కలిసే పరిస్థితి ఉందని భావిస్తున్నారు. దయచేసి అందరినీ కలవండి" అని కేసీఆర్‌కు కవిత సూచించారు.

ఐటీ ఇలాకాలో బ్యూటీల తడాఖా

» శిల్పారామంలో ప్రపంచ సుందరి పోటీదారుల ఆటాపాటా

» టాలెంట్ ఫినాలేలో 24 మంది ఫైనలిస్టుల పోటాపోటీ



విక్టోరియా హోమ్‌లో విద్యార్థులతో మిస్ వరల్డ్ పోటీదారులు

హైదరాబాద్, ఎల్బీనగర్, హైటెక్ సిటీ, మే 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఐటీకి చిరునామా అయిన హైటెక్ సిటీ ప్రాంతం మిస్ వరల్డ్ 2025 పోటీదారుల ఆటాపాటలతో గురువారం ఉర్రూతలూగింది. హైటెక్ సిటీలోని సైబర్ టవర్స్‌కు ఎదురుగా ఉన్న శిల్పారామంలో ప్రపంచ సుందరీమణులు గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు గడిపారు. శిల్పారామంలో మహిళా సంఘాల ఉత్పత్తులను పరిశీలించారు. కొనుగోలు చేశారు. అలాగే అక్కడున్న మట్టి పాత్రల తయారీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్న చిన్న కుండలు చేసి ఆనందించారు. అనంతరం సాయంత్రం జరిగిన టాలెంట్ ఫినాలే పోటీకి ఎంపికైన 24 దేశాల ప్రతినిధులు తమ సంగీత, నృత్య ప్రదర్శనలతో అదరగొట్టారు. ఇటీవల అత్యంత ప్రజాదరణ పొందిన 'రాను బొంబయికి రాను'... అనే తెలంగాణ జానపద పాటపై నైజీరియా భామ చేసిన ఇండో ఆఫ్రికన్ నృత్యం ఆహూతులను అమితంగా ఆకట్టుకుంది. ఫ్లోర్ డ్యాన్స్ ద్వారా ఈస్టోనియా భామ, 'ఐ లవ్ స్టోరీస్' అనే అద్భుత గీతంతో బ్రెజిల్ భామ సభికులను ఉర్రూతలూగించగా.. పియానోతో చెక్ రిపబ్లిక్, డ్యాన్స్‌తో అర్జెంటీనా భామ, తమ దేశ సంప్రదాయ నృత్యంతో శ్రీలంక ప్రతినిధి అనుది గుణశేఖర ప్రేక్షకులను కట్టిపడేశారు. అత్యవసర వేళల్లో సీపీఆర్ ఎలా చేయాలో వేల్స్ ప్రతినిధి వినూత్నంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. హిందీ చిత్రం రామ్‌లీలాలోని 'ఢోల్ బాజే ... పాటకు భారత ప్రతినిధి నందిని గుప్తా చేసిన నృత్యం పోటీల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె నృత్యం చేస్తున్నంతసేపు ప్రేక్షకులు చప్పట్లు, కేరింతలతో ఆమెను ప్రోత్సహించారు. చివరగా కెన్యా భామ జుంబా డీజేతో పోటీ ముగిసింది. చివరగా డీజేతో 24 దేశాల ప్రతినిధులు చేసిన నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. అందరి ప్రదర్శన అనంతరం తొలి మూడు స్థానాలను నిర్వాహకులు ప్రకటించారు. అద్భుత పియానో ప్రదర్శనతో ఆకట్టుకున్న ఇండోనేషియా సుందరి మోనికా కేజియాను టాలెంట్ ఫినాలే విజేతగా ప్రకటించారు. కామెరూన్, ఇటలీ ప్రతినిధులు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

పాక్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాం!

(మొదటి పేజీ తరువాయి)

సిందూర్ తర్వాత ప్రధాని మొదటిసారి రాజస్థాన్ వచ్చారు. బికనేర్‌లో భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. పహల్గాంలో ఏప్రిల్ 22న అమాయక పర్యాటకులను టెర్రరిస్టులు పొట్టనపెట్టుకున్నారని.. మతం అడిగి మరీ కాల్చిచంపారని అన్నారు. వారు కురిపించిన బుల్లెట్ల వర్షానికి 140 కోట్ల మంది భారతీయుల గుండె గాయపడిందని తెలిపారు. అయితే మన మహిళల నుదుట బొట్టు చెరిపేసినవారిని మన సైనికులు మట్టిలో కలిపేశారని చెప్పారు. 22 నిమిషాల్లో ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేశారన్నారు. మన సాయుధ బలగాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని.. మన సైనికులు ఆ దేశాన్ని మోకాళ్లపై కూర్చోబెట్టారని తెలిపారు. అణుబాంబుల బూచికి భారత్ వెనక్కి తగ్గదని స్పష్టంచేశారు. జాతీయ భద్రతపై దృఢ వైఖరి అవలంబిస్తుందన్నారు. 'సాధారణంగా నేను ప్రశాంతంగా ఉంటాను. అయితే దేశం విషయానికొస్తే మాత్రం తీవ్ర భావావేశంతో, సంకల్పంతో నా రక్తం వేడెక్కుతుంది. ఇప్పుడిక్కడ భారత మాత సేవకుడు సగర్వంగా నిలబడి ఉన్నాడన్న సంగతి పాక్ మరచిపోయింది. మోదీ మనసు శాంతమే. కానీ రక్తం మాత్రం వేడివేడి. మోదీ నరాల్లో రక్తం కాదు.. వేడివేడి సిందూరం ప్రవహిస్తోంది. పాక్ ఏనాడూ మనపై ప్రత్యక్ష యుద్ధంలో గెలవలేదు. అందుకే ఉగ్రవాదాన్ని ఆయుధంగా వాడుతోంది. స్వాతంత్ర్యం వచ్చాక దశాబ్దాల నుంచి ఇదే వ్యూహం అమలు చేస్తోంది. ఇకపై భారత్‌పై ఉగ్రదాడికి దిగితే ఆ దేశం ప్రతి పైసాకూ అడుక్కోవలసి వస్తుంది. భారత నీటిలో వాటా దక్కదు. భారతీయుల నెత్తుటితో ఆటలాడితే మూల్యం చెల్లించక తప్పదు. ఇది మా దృఢ సంకల్పం. ప్రపంచంలోని ఏ శక్తీ ఈ విషయంలో మనల్ని కదిలించజాలదు. ఇది ఆపరేషన్ సిందూర్. ఇది కేవలం కోపమే కాదు. యావత్ భారత ఉగ్రరూపం. ఇదే భారత నూతన రూపం' అని తేల్చిచెప్పారు.

అప్పుడు శపథం చేశాను..

2019లో బాలాకోట్ దాడుల తర్వాత రాజస్థాన్‌లోనే చురులో తొలి సభ నిర్వహించానని ప్రధాని గుర్తుచేశారు. 'దేశాన్ని తలవంచనివ్వనని ఈ మట్టిపై శపథం చేశా.. ఇప్పుడు మళ్లీ రాజస్థాన్‌లోని బికనేర్ వీరభూమి నుంచి చెబుతున్నాను.. భారతీయుల నెత్తురు కళ్లచూసిన వాళ్ల ప్రతి రక్తపు బొట్టుకూ మూల్యం చెల్లించారు. భారత్ నోరుమూసుకుని కూర్చుంటుందని అనుకున్నవాళ్లు ఇప్పుడు తమ ఇళ్లలో దాక్కున్నారు. తమ ఆయుధాలు చూసి గర్వించినవాళ్లు.. వారి శిథిలాల కిందే సమాధి అయ్యారు. అయితే పహల్గాంలో ఉగ్రదాడికి ఇది ప్రతీకారం కాదు.. కొత్త తరహా న్యాయం. పాక్‌తో ఇక వాణిజ్యం గానీ, చర్చలు గానీ ఉండవు. పాక్ ఆక్రమిత కశ్మీరుపైనే చర్చిస్తాం. అణు బెదిరింపులకు భయపడేది లేదు' అని స్పష్టం చేశారు.

వసతుల కల్పనకు పెద్దపీట

అభివృద్ధి చెందిన భారత్‌లో అధునాతన మౌలిక వసతుల కల్పనకు పెద్దఎత్తున కృషిసాగుతోందని ప్రధాని అన్నారు. గత 11 ఏళ్లలో రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాల ఆధునికీకరణకు అసాధారణంగా పనిచేశామని చెప్పారు. గతంలో కంటే ఎన్నో ఎక్కువ రెట్ల సొమ్మును అభివృద్ధి ప్రాజెక్టులపై ఖర్చుచేస్తున్నామని తెలిపారు. రూ.1,100 కోట్లతో దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 86 జిల్లాల్లో నవీకరించిన 103 అమృత్ రైల్వే స్టేషన్లను బికనీర్ సభ నుంచి వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు. 1,300కిపైగా రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నట్లు ఈ సందర్భంగా మోదీ తెలిపారు. వందేభారత్ రైలు దాదాపు 70 మార్గాల్లో నడుస్తోందని చెప్పారు. గత 11 ఏళ్లలో వందల కొద్దీ రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలను నిర్మించామన్నారు. మొట్టమొదటి బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పని విస్తృతంగా సాగుతోందని చెప్పారు. మౌలిక వసతులపై ఖర్చుచేసే డబ్బుతో ఉపాధి, వ్యాపార అవకాశాలు కూడా సృష్టిస్తున్నామన్నారు.

అన్నీ సినిమా డైలాగులే: కాంగ్రెస్

రాజస్థాన్‌లో ప్రధాని వ్యాఖ్యలు గొప్పగా ఉన్నాయని.. కానీ అవన్నీ సినిమా డైలాగులేనని కాంగ్రెస్ ఎద్దేవాచేసింది. తన వల్లే భారత్-పాక్ యుద్ధం ముగిసిందన్న ట్రంప్ వ్యాఖ్యలపై మోదీ ఎందుకు నోరెత్తరని ప్రశ్నించింది. 'ప్రధాని తక్షణమే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు పెట్టాలి. కాల్పుల విరమణపై ట్రంప్ వ్యాఖ్యలకు వివరణ ఇవ్వాలి' అని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. పహల్గాంలో దాడిచేసిన క్రూరహంతకులు ఇంకా స్వేచ్ఛగా ఎందుకు తిరుగుతున్నారని ప్రశ్నించారు.

ట్రంప్ జోక్యం లేదు

కాల్పుల విరమణ కోసం పాకిస్థానే దిగొచ్చింది

న్యూఢిల్లీ, మే 22: భారత్, పాక్ మధ్య శాంతి స్థాపనకు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించుకోవడాన్ని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తీవ్రంగా ఖండించారు. ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం వెనుక వాస్తవంగా ఏం జరిగిందో ఆయన నెదర్లాండ్స్‌కు చెందిన ఎన్‌వోఎస్ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. 'రెండు దేశాలు పరస్పరం మాట్లాడుకోవడానికి మాకు హాట్‌లైన్ వ్యవస్థ ఉంది. కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నామని మే 10న మాకు పాక్ ఆర్మీ నుంచి సందేశం వచ్చింది. దానికి అనుగుణంగా మేం స్పందించాం' అని జైశంకర్ తెలిపారు. ఉద్రిక్తతల సమయంలో అమెరికాతో సహా అనేక దేశాలు తమతో సంప్రదింపులు జరిపాయని అయితే ద్వైపాక్షిక చర్చలతోనే సమస్య పరిష్కారమైందని ఆయన స్పష్టం చేశారు. 'అమెరికా.. అమెరికాలోనే ఉంది. ఆ దేశ ఉపాధ్యక్షుడు వాన్స్ మన ప్రధాని మోదీకి ఫోన్ చేశారు. విదేశాంగ మంత్రి రూబియో నాతో ఫోన్‌లో మాట్లాడారు. ఇతర దేశాల తరహాలోనే వారు పాక్‌తో కూడా సంప్రదింపులు జరిపారు. అదే విధంగా కొన్ని గల్ఫ్ దేశాలు కూడా భారత్‌ను సంప్రదించాయి. రెండు దేశాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్నప్పుడు ప్రపంచ దేశాలు వారికి కాల్ చేయడం సాధారణమే. అయితే కాల్పుల విరమణ, సైనిక చర్యలు ఆపేయడం అనేది భారత్, పాక్ మధ్య నేరుగా జరిగిన ఒప్పందం. ఫైరింగ్ ఆగాలని పాకిస్థానీలు కోరుకుంటే దాని గురించి వారే మాకు చెప్పాలి. వారి డీజీఎంవో మా డీజీఎంవోకు ఫోన్ చేసి ఈ విషయాన్ని చెప్పాల్సి ఉంటుందని అమెరికాతో పాటు మాతో మాట్లాడిన ప్రతి ఒక్కరికీ స్పష్టంగా చెప్పాం. చివరకు అదే జరిగింది' అని జైశంకర్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, ప్రతి అంశంలో పాక్‌కు వత్తాసు పలుకుతూ వస్తున్న తుర్కియే.. మొదట సీమాంతర ఉగ్రవాదాన్ని వీడాలని పాకిస్థాన్‌కు చెప్పాలని భారత్ స్పష్టం చేసింది.



చూడచక్కగా.. సూళ్లూరుపేట రైల్వే స్టేషన్

సూళ్లూరుపేట, మే 22(ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయ గోపురం ఆర్చి నమూనాతో అందంగా నిర్మించిన ఈ భవనాన్ని చూశారా! ఇదేదో కల్యాణ మండపం కాదు. ఆధునీకరించిన సూళ్లూరుపేట రైల్వే స్టేషన్. కేంద్ర ప్రభుత్వం రైల్వేల అభివృద్ధిలో భాగంగా రూ.14.5 కోట్ల అమృత్ భారత్ పథకం నిధులతో తిరుపతి జిల్లా సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించింది. దీనిని గురువారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించగా.. సూళ్లూరుపేట స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొని, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఈ స్టేషన్‌లో రెండు లిఫ్టులు, ప్లాట్‌ఫారాల పైకప్పుల వెడల్పు, నీటి శుద్ధీకరణ ప్లాంటు ఏర్పాటు చేశారు.

లోకం తీరు



చైనా చౌక బేరం!

» జే-35ఏ ఫైటర్లపై పాక్‌కు 50% డిస్కౌంట్

» 30 విమానాల కొనుగోలుకు ఒప్పందం

న్యూఢిల్లీ, మే 22: ఆపరేషన్ సిందూర్ పరిణామాల నేపథ్యంలో చైనా, పాకిస్థాన్ మధ్య కీలక పరిణామం చోటు చేసుకుంది. చైనా తమ 'జే-35ఏ' ఐదోతరం యుద్ధ విమానాలను సగం ధరకే పాకిస్థాన్‌కు ఇస్తామని ఆఫర్ చేసింది. అమెరికాకు చెందిన ఎఫ్-35, రష్యాకు చెందిన సుఖోయ్-57లతో పోటీపడగలదని చైనా చెబుతున్న ఈ ఫైటర్ జెట్ల కొనుగోలు కోసం పాక్-చైనా మధ్య ఇప్పటికే ఒప్పందం కుదిరింది. మొత్తం 30 విమానాలకు ఆర్డర్ చేయగా.. అందులో తొలి బ్యాచ్ ఈ ఏడాది ఆగస్టులోనే పాక్‌కు అందనున్నాయి. దీనికి సంబంధించి చెల్లింపులు, ఇతర అంశాలపై పాక్ ఉప ప్రధాని ఇషాక్‌దార్ ఇటీవలే చైనా రక్షణ శాఖ అధికారులతో సమావేశమై చర్చించారు కూడా. ఈ క్రమంలోనే.. జే-35ఏ ఫైటర్ జెట్లపై 50శాతం డిస్కౌంట్ ఇస్తామని, అది కూడా చిన్న వాయిదాల్లో చెల్లించే అవకాశం కల్పిస్తామని చైనా ఆఫర్ చేసినట్టు సమాచారం. దీనిని చైనా, పాక్ మధ్య స్నేహానికి గుర్తుగా, భారత్ దాడిని సమర్థవంతంగా ఎదుర్కొన్నందుకు 'బహుమతి'గా పేర్కొన్నట్టు తెలిసింది. ఈ అంశాలతో పలు ఆంగ్ల మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. పాకిస్థాన్‌లో పౌర, మిలటరీ సదుపాయాల కల్పన కోసం 25 బిలియన్ డాలర్లు (సుమారు రూ.2.14 లక్షల కోట్లు) పెట్టుబడులు పెడతామని కూడా హామీ ఇచ్చినట్టు పేర్కొన్నాయి. కాగా, పాకిస్థాన్‌కు సగం ధరకే జే-35ఏ ఫైటర్లను చైనా ఇవ్వడం వెనుక ఆయుధాలు అమ్ముకునే ఎత్తుగడ దాగి ఉందని రక్షణ నిపుణులు చెబుతున్నారు. చైనా అధునాతన యుద్ధ విమానాలు, ఆయుధాలు అభివృద్ధి చేసినా, అమ్మకానికి పెట్టినా.. వాటి పనితీరుపై సందేహాలతో కొనుగోలు చేయడానికి వెనుకాడే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో జే-35ఏ ఫైటర్లను వీలైనంత త్వరగా పాక్‌కు అందించి.. అవి యుద్ధాలకు సిద్ధమనే సంకేతాలు ఇవ్వడం, వాటి పై నమ్మకం కలిగించడం కోసం చైనా ప్రయత్నాలు చేస్తోందని వివరిస్తున్నారు.



అమెరికాలో ఇజ్రాయెలీల కాల్చివేత

» భారత్ సహా ప్రపంచ దేశాల ఖండన

వాషింగ్టన్, మే 22: అమెరికాలో ఇజ్రాయెల్ ఎంబసీ సిబ్బందిపై కాల్పులు జరపడంతో ఇద్దరు మరణించారు. వాషింగ్టన్ డీసీలోని యూదు మ్యూజియం వద్ద బుధవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. మృతులను యరాన్ లిస్కిన్స్కీ, సారా మిల్‌గ్రిమ్‌గా గుర్తించారు. వీరు యూదు మ్యూజియంలో ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి వెళ్తుండగా దుండగుడు వీరి సమీపానికి వచ్చి కాల్పులు జరిపాడు. అనంతరం దుండగుడు నడుచుకుంటూ మ్యూజియంలోకి వెళ్లిపోయాడు. అక్కడి భద్రతా సిబ్బంది అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నిందితుడు 'ఫ్రీ..ఫ్రీ..పాలస్తీనా' అంటూ నినాదాలు చేశాడు. నిందితుడిని షికాగోకు చెందిన ఇలియాస్ రోడ్రిగూజ్(30)గా గుర్తించారు. లిస్కిన్స్కీ, మిల్‌గ్రిమ్ ప్రేమజంట అని, త్వరలో పెళ్లి బంధంతో ఒక్కటవ్వాలనుకున్నారని అమెరికాలోని ఇజ్రాయెల్ రాయబారి యెచీల్ లీటర్ తెలిపారు. వచ్చేవారం జెరూసలెంలో వారి నిశ్చితార్థ కార్యక్రమం జరగాల్సి ఉందన్నారు. ఈ ఘటనను భారత్ సహా ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. 'యూదులకు వ్యతిరేకంగా ఇలాంటి భయంకరమైన హత్యలకు ముగింపు పలకాలి. అమెరికాలో విద్వేషాలకు, రాడికలిజానికి స్థానం లేదు' అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు.

అన్ని హద్దులూ దాటేశారు



» తక్షణమే దర్యాప్తును నిలిపివేయండి

» తమిళనాడు మద్యం వివాదంలో ఈడీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

చెన్నై, మే 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ సమాఖ్య స్వరూపాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఉల్లంఘిస్తోందని సుప్రీంకోర్టు ఆక్షేపించింది. తమిళనాడు ప్రభుత్వ మద్యం క్రయవిక్రయాల సంస్థలో (తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్- టాస్మాక్) అక్రమాల వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్న ఈడీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 'టాస్మాక్ కేసు వ్యవహారంలో ఈడీ అన్ని హద్దులూ దాటేసిందని దుయ్యబట్టింది. కొంతమంది వ్యక్తులు చేసిన ఉల్లంఘనలకు ఒక సంస్థపై ఎలా చర్యలు తీసుకుంటారని నిలదీసింది. టాస్మాక్‌పై ఈడీ చేపట్టిన మనీలాండరింగ్ దర్యాప్తును నిలిపివేసింది. ఈ వివాదంలో తమిళనాడు ప్రభుత్వం, టాస్మాక్ దాఖలు చేసిన అప్పీలు పిటిషన్లపై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఈడీని ఆదేశిస్తూ తదుపరి విచారణను వేసవి సెలవుల అనంతరం చేపడతామని తెలిపింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. టాస్మాక్ సంస్థలో రూ.వెయ్యి కోట్ల విలువైన మద్యం స్కామ్ జరిగిందంటూ వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా గత మార్చిలో ఈడీ అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. మద్యం సరఫరా ఆర్డర్ల కోసం డిస్టిలరీలు ముడుపులు చెల్లించాయనే ఆరోపణలపై దర్యాప్తు జరుపుతోంది. దీనిని సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. అయితే, ఈడీ చర్యలను హైకోర్టు సమర్థిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 23న తీర్పు ఇచ్చింది. దీంతో తమిళనాడు ప్రభుత్వం, టాస్మాక్‌లు సుప్రీంకోర్టు ఈ నెల 20న తలుపుతట్టాయి. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. పిటిషనర్ల తరఫున కపిల్ సిబాల్, ముకుల్ రోహిత్గి తదితరులు వాదనలు వినిపించారు. టాస్మాక్‌లో 2014 నుంచి మద్యం వ్యవహారంలో కొంతమంది వ్యక్తులు డబ్బు అందుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 41 కేసులు నమోదుచేసిందన్నారు. కానీ ఈడీ ఇప్పుడీ వ్యవహారాన్ని ముందుకు తెచ్చి హడావుడిగా సోదాలు చేపట్టిందని ఆరోపించారు. టాస్మాక్ కార్యకలాపాలు స్తంభింపజేసేలా కార్యాలయంలోని కంప్యూటర్లు, పెన్ డ్రైవ్ సహా పలు పరికరాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అలాగే, టాస్మాక్ సంస్థలోని ఉద్యోగుల సెల్‌ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని, మహిళా ఉద్యోగులను సైతం వేధింపులకు గురిచేస్తూ నిర్బంధంలో ఉంచుతున్నారని ఆరోపించారు. అవినీతికి పాల్పడిన వ్యక్తులపై రాష్ట్ర ప్రభుత్వమే చర్యలకు ఉపక్రమించిన నేపథ్యంలో ఈడీ ఇలాంటి చర్యలకు పాల్పడడం ఎంతమేరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న టాస్మాక్‌పై 'మీరెలా దాడి చేస్తారు' అని ఈడీ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజును ప్రశ్నించింది. ఈడీకి నోటీసులు జారీచేసింది. కాగా, సుప్రీంకోర్టు తీర్పు ఈడీకి చెంపపెట్టులాంటిదని అధికార డీఎంకే అధికార ప్రతినిధి ఆర్ఎస్ భారతి వ్యాఖ్యానించారు.

వక్ఫ్‌పై మధ్యంతర ఉత్తర్వులను వాయిదా వేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 22: వక్ఫ్ సవరణ చట్టం-2025లోని మూడు కీలక అంశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలన్న వినతులపై గురువారం సుప్రీంకోర్టు నిర్ణయాన్ని వాయిదా వేసింది. కోర్టులు వక్ఫ్ భూములుగా గుర్తించిన ఆస్తులను (వక్ఫ్ బై కోర్ట్స్), వినియోగదారుల చేతిలో ఉన్న వక్ఫ్ ఆస్తులను (వక్ఫ్ బై యూజర్), పత్రాలు ద్వారా దఖలుపడ్డ వక్ఫ్ ఆస్తులను (వక్ఫ్ బై డీడ్)లను డీ-నోటిఫై చేయకూడదని కోరుతూ పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఒకవేళ డీ-నోటిఫై చేస్తే వక్ఫ్ ఆస్తులన్న గుర్తింపును అవి కోల్పోతాయి. ప్రభుత్వం వీటిని డీ-నోటిఫై చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్లు కోరారు. ఈ వ్యాజ్యాలపై సీజేఐ జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం వరుసగా మూడురోజుల పాటు విచారణ జరిపింది.

నీట్ పీజీలో 'సీట్ల బ్లాక్'ను నిరోధించండి!

నీట్ పీజీ అడ్మిషన్ల కౌన్సెలింగ్‌లో సీట్ల బ్లాకింగ్‌పై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. కొంత మంది అభ్యర్థులు పాల్పడే ఈ చర్య వలన మెరిట్ విద్యార్థులకు నష్టం జరుగుతుందని పేర్కొంది. సీట్ల బ్లాకింగ్ అనేది కేవలం తప్పు మాత్రమే కాదని, ఇది పాతుకుపోయిన లోతైన వ్యవస్థాగత లోపాలను ఎత్తిచూపుతుందని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో సీట్ల బ్లాకింగ్‌కు చెక్ పెట్టేందుకు కోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. నీట్ పీజీ కోసం అన్ని ప్రైవేటు/డీమ్డ్ వర్సిటీలు కౌన్సెలింగ్‌కు ముందుగానే ట్యూషన్, హాస్టల్, కాషన్ డిపాజిట్ తదితర ఫీజుల వివరాలను తప్పనిసరిగా వెల్లడించాలని ఆదేశించింది. సీట్ల బ్లాకింగ్‌కు పాల్పడితే సెక్యూరిటీ డిపాజిట్లు జప్తు, భవిష్యత్తు నీట్ పీజీ పరీక్షకు అనర్హత, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే కాలేజీను బ్లాక్ లిస్టులో పెట్టడం వంటి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆధార్ ఆధారిత సీట్ల ట్రాకింగ్‌ను అమలు చేయాలని సూచించింది.

సద్గురు ధ్యానంతో.. చలాకీ మెదడు

» సంయమ సాధనతో 5.9 ఏళ్లు వెనక్కి..

» హార్వర్డ్ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, మే 22: శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండటానికి యోగా, ధ్యానం తోడ్పడతాయని అందరికీ తెలుసు. అయితే ఓ వినూత్న ధ్యానంపై పరిశోధనల్లో సరికొత్త విషయం ఇప్పుడు గుర్తించారు. సద్గురు జగ్గీవాసుదేవ్ అభివృద్ధి చేసిన సంయమ సాధనతో మెదడు వృద్ధాప్యం తగ్గుతోందని హార్వర్డ్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. హార్వర్డ్ మెడికల్ స్కూల్‌తో కలసి మసాచుసెట్స్ జనరల్ హాస్పటల్, బెత్ ఇస్రాయెల్ డీకొనెస్ మెడికల్ సెంటర్‌కు చెందిన నిపుణులు సంయమ సాధన మెడిటేషన్‌పై ఇటీవల అధ్యయనం చేశారు. ఈ ధ్యానంలో 8 రోజులు పూర్తి శిక్షణ తీసుకుని సాధన చేస్తున్న వ్యక్తులను వీరు పరిశీలించారు. సంయమ సాధన చేస్తున్న వారి ప్రస్తుత వయసు కంటే వారి మెదడు 5.9 సంవత్సరాల వెనక్కు మళ్లిందని పరిశోధనల్లో గుర్తించారు. కొంతమంది విషయంలో అది పదేళ్లకు పైగా వెనక్కి వెళ్లిందని చెప్పారు. అంటే వారి వయసుతో పోలిస్తే వారి మెదడు వృద్ధాప్యం తక్కువగా ఉందన్నారు. ధ్యానానికి మెదడుకు ఉన్న సంబంధాన్ని గుర్తించడానికి కొందరిపై ఈఈజీ స్కాన్లను ఉపయోగించి పరిశీలన చేశారు. ధ్యాన సాధన ఫలితాలను పోల్చి చూడటానికి ఈ అధ్యయనంలో పాల్గొన్న వారిలో పూర్తి ఆరోగ్యంతో ఉన్న వారితో పాటు వయసుతో పాటు వచ్చే మెదడు సమస్యలు ఉన్న వారిని కూడా చేర్చారు. సంయమ సాధన చేసిన వారు సుఖంగా నిద్రపోతున్నారని, స్పష్టమైన ఆలోచన, పదునైన జ్ఞాపకశక్తి కలిగి ఉన్నారని వారు వెల్లడించారు. హార్వార్డ్ మెడికల్ స్కూల్‌కు చెందిన బాల సుబ్రమణియం నేతృత్వంలో జరిగిన ఈ అధ్యయన అంశాలను 'మైండ్‌ఫుల్‌నెస్' జర్నల్‌లో ప్రచురించారు.



సంయమ సాధన అంటే ఏమిటి?

ఇది 8 రోజులు నిశ్శబ్దంగా చేసే తీవ్రమైన సాధన. దీనికి నెలల కొద్దీ సన్నద్ధత కావాలి. సాధకులు ప్రతిరోజు యోగా, ధ్యానం సాధన కచ్చితంగా చేయాలి. వీగన్ డైట్‌ను అనుసరించాలి. శాంభవి మహాముద్ర, శక్తి చలన క్రియ తదితర క్రియా యోగాలను, యోగాసనాలు, శూన్య మెడిటేషన్ తప్పనిసరిగా చేయాలి. దీనిని సద్గురు జగ్గీ వాసుదేవ్ అభివృద్ధి చేశారు.


ఇదొక అద్భుతం..: సద్గురు

మానవ శరీరంపై ఆధ్యాత్మిక సాధన శాస్త్రాల ప్రభావాన్ని ఆధునిక సైన్స్ మదించడం, గుర్తించడం అద్భుత విషయం అని సద్గురు జగ్గీవాసుదేవ్ పేర్కొన్నారు. ప్రతి మనిషి తన భౌతిక, మానసిక ఆరోగ్యంపై పెట్టుబడి పెట్టాలని, అలా చేయడం వల్ల మనకు, భవిష్యత్ తరాలకు ఉపయోగకరమని చెప్పారు.

హస్తిన చేరిన చంద్రబాబు

నేడు ఏడుగురు కేంద్ర మంత్రులతో వరుస భేటీలు

రేపు నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ భేటీకి హాజరు



న్యూఢిల్లీ, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న, ప్రతిపాదిత ప్రాజెక్టుల సత్వర అమలుకు కేంద్రప్రభుత్వం మద్దతు కోరేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. శుక్ర, శనివారాల్లో ఇక్కడే ఉంటారు. సీనియర్ కేంద్ర మంత్రులతో వ్యూహాత్మక సమావేశాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఏడుగురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నారు. శుక్రవారం ఉదయం తొలుత కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల మంత్రి ప్రహ్లాద్ జోషీతో సమావేశమవుతారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు సహకారంపై చర్చిస్తారు. అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలుస్తారు. వ్యూహాత్మక రక్షణ, ఏరోస్పేస్ కార్యక్రమాలపై చర్చిస్తారు. జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీలో పోలవరం ప్రాజెక్టు, రాష్ట్రంలో నీటి మౌలిక సదుపాయాల కల్పన, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల ప్రతిపాదనలపై మాట్లాడతారు. పరిశోధన, ఆవిష్కరణ, పారిశ్రామిక విజ్ఞాన సహకారాలపై సైన్స్ అండ్ టెక్నాలజీ (స్వతంత్ర) మంత్రి జితేంద్ర సింగ్‌తో చర్చిస్తారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోనూ సీఎం సమావేశమవుతారు. రాష్ట్ర ఆర్థిక రోడ్ మ్యాప్ కోసం మెరుగైన ఆర్థిక కేటాయింపులు, మద్దతు కోరతారు. సాయంత్రం 4 గంటలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన రాష్ట్రాల్లో కొత్త క్రిమినల్ చట్టాల అమలుపై జరిగే కీలక సమీక్షా సమావేశంలో చంద్రబాబు పాల్గొంటారు. రాత్రికి రైల్వే, ఎలక్ట్రానిక్స్-ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అవుతారు. డిజిటల్ మౌలిక సదుపాయాలు, భవిష్యత్ సాంకేతిక ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ పాత్రపై చర్చిస్తారు. శనివారం భారత్ మండపంలో జరిగే నీతి ఆయోగ్ 10వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి సీఎం హాజరవుతారు.



హనుమజ్జయంతి సందర్భంగా విజయవాడలో నిర్వహించిన శోభాయాత్రలో మహిళల నృత్యం

రైస్ కార్డులకు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు

గడువు ఏమీ లేదు.. తొందరపడొద్దు

▸ మ్యారేజ్ సర్టిఫికెట్, పెళ్లికార్డులు అక్కర్లేదు: నాదెండ్ల



అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): కొత్త బియ్యం కార్డులు, పాత వాటిల్లో మార్పులు, చేర్పుల కోసం స్వీకరిస్తున్న దరఖాస్తులకు గడువు లేదని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అర్హత ఉన్న వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎవరూ తొందరపడాల్సిన అవసరం లేదని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రైస్ కార్డులు అందిస్తామని స్పష్టం చేశారు. కొత్త రైస్ కార్డులు, ఇతర సేవల కోసం వచ్చిన దరఖాస్తులన్నింటినీ 21 రోజుల్లోపే పరిశీలించి జూన్‌లో క్యూఆర్ కోడ్‌తో మొత్తం 4,24,59,128 మంది లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ కార్డులను అందజేస్తామన్నారు. గురువారం విజయవాడలోని సివిల్ సప్లయిస్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. కొత్త రైస్‌కార్డులు, మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తులు సమర్పించేవారు మ్యారేజ్ సర్టిఫికెట్లు, పెళ్లి ఫోటోలను జత చేయాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. ఈ మేరకు సచివాలయాలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఉన్న రైస్ కార్డుల్లో పేర్ల తొలగింపు ప్రక్రియను డెత్ కేసులకు మాత్రమే పరిమితం చేశామని చెప్పారు. కార్డుల్లో పిల్లలను చేర్చడానికి వయసుతో సంబంధం లేదన్నారు. ఈనెల 7 నుంచి ఇప్పటి వరకు 5 లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రైస్ కార్డుల డేటాను గ్రామ, వార్డు సచివాలయాలకు అనుసంధానం చేయడంతో సర్వర్లు డౌన్ అయ్యాయని, దీనివల్ల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియలో ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమేనని మంత్రి అంగీకరించారు. ప్రజలకు క్షమాపణలు చెప్పారు.

మ్యాపింగ్ సమస్యలపై ఉన్నతస్థాయి కమిటీ

గత ప్రభుత్వం నిర్వహించిన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ వల్ల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, వీటిపై ముఖ్యమంత్రితో చర్చించిన తర్వాత ఒక ఉన్నతస్థాయి కమిటీని వేసి వారం రోజుల్లోనే ఈ సమస్యను పరిష్కరిస్తామని మంత్రి మనోహర్ హామీ ఇచ్చారు.

నా పని తీరుపై మూడు నిఘా నేత్రాలు

▸ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, సిక్కోలు ప్రజలు

▸ అందుకే మరింత మెరుగ్గా పనిచేస్తున్నా: రామ్మోహన్



శ్రీకాకుళం, మే 22(ఆంధ్రజ్యోతి): 'నాపై మూడు నిఘా నేత్రాలు పనిచేస్తున్నాయి. ఒకరు ప్రధాని మోదీ, రెండు సీఎం చంద్రబాబు, మూడు సిక్కోలు జిల్లా ప్రజలు. వీళ్లంతా నా పనితీరును తూనికతో కొలుస్తున్నారు' అని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. అందుకే ఎప్పటికప్పుడు మెరుగ్గా పని చేసేందుకు ప్రయత్నిస్తున్నానని చెప్పారు. గురువారం శ్రీకాకుళంలో నిర్వహించిన జిల్లా మహానాడులో ఆయన మాట్లాడారు. దేశంలో కొత్తగా 50 ఎయిర్ పోర్టులు ఏర్పాటు చేస్తున్నామని, వీటిలో శ్రీకాకుళం జిల్లా పలాస కూడా ఉందని చెప్పారు.

ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి: సీపీఐ

అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావుతోపాటు 27 మంది చనిపోయారని, ఇవి ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేసిన హత్యలేనని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ 6 హామీల అమలు కోసం జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా మండల కేంద్రాల్లో తలపెట్టిన ధర్నాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను రామకృష్ణ ఆవిష్కరించారు. జల్లి విల్సన్, జి.ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

20 సూత్రాల అమలులో మార్పులు కావాలి: లంకా

అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వినూత్న విధానాలు, పథకాలు, లక్ష్యాలకు అనుగుణంగా 20 సూత్రాల కార్యక్రమం అమలులో నిర్మాణాత్మక మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ అన్నారు. ఈ విషయమై కేంద్రానికి లేఖ రాయగా, ప్రధాని కార్యాలయం సానుకూలంగా స్పందిస్తూ ప్రత్యుత్తరం పంపిందన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం: పీతల సుజాత

▸ మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్‌గా బాధ్యతల స్వీకరణ

గుంటూరు, మే 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొస్తున్న నూతన సంస్కరణలకు అనుగుణంగా రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ పని చేస్తుందని ఆ సంస్థ నూతన చైర్‌పర్సన్ పీతల సుజాత చెప్పారు. గుంటూరు మహిళా ప్రాంగణంలోని ఏపీ మహిళా సహకార ఆర్థిక సంస్థ కార్యాలయంలో సంస్థ నూతన చైర్‌పర్సన్‌గా పీతల సుజాత పదవి బాధ్యతలు చేపట్టారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న సుజాత

ఆగ్రోస్ చైర్మన్‌గా సుబ్బానాయుడు ప్రమాణం

అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాలేపాటి సుబ్బానాయుడు గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కావలి నియోజకవర్గానికి చెందిన సుబ్బానాయుడు వడ్డేశ్వరంలోని ఏపీ ఆగ్రోస్ ప్రధాన కార్యాలయంలో పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే నాయకులు, కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు, గౌరవం లభిస్తాయన్నారు.

ఏపీకి 4.. తెలంగాణకు 10.26 టీఎంసీలు

▸ సాగర్ నుంచి రాష్ట్రానికి రోజూ 5,500 క్యూసెక్కులు

అమరావతి/హైదరాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): తాగునీటి అవసరాల కోసం కృష్ణా బేసిన్ నుంచి ఆంధ్రప్రదేశ్ నాలుగు టీఎంసీలు, తెలంగాణ 10.26 టీఎంసీలు వాడుకోవచ్చని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. శ్రీశైలం జలాశయంలో కనీస నీటి మట్టం 800 అడుగులు, నాగార్జునసాగర్‌లో 505 అడుగుల దాకా వినియోగించుకోవచ్చని పేర్కొంది. ఏపీ అవసరాల కోసం ఈనెల 22 నుంచి 30 వరకు సాగర్ కుడి ప్రధాన కాలువ నుంచి రోజుకు 5,500 క్యూసెక్కులు విడుదల చేయాలని తెలంగాణను ఆదేశించింది. ఇక, జూలై 31 వరకు శ్రీశైలం నుంచి తెలంగాణకు నీటిని విడుదల చేయాలని, కనీస నీటి మట్టం కన్నా దిగువకు పడిపోకుండా చూసుకోవాలని బోర్డు ఏపీని కోరింది. నీటి విడుదలకు సంబంధిత రాష్ట్రాల చీఫ్ ఇంజనీర్లు బాధ్యత తీసుకోవాలని, సంయుక్త ప్రకటన విడుదల చేయాలని నిర్దేశించింది.

లండన్ ఎన్నికల్లో 'ఉదయి'ంచిన తెలుగుతేజం

▸ డిప్యూటీ మేయర్‌గా పశ్చిమగోదావరి వాసి



భీమవరంరూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ లండన్‌లోని రాయల్‌బరో ఆఫ్ కెన్సింగ్టన్, చెల్సియా డిప్యూటీ మేయర్‌గా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం తుందుర్రుకు చెందిన ఉదయ్ ఎన్నికయ్యారు. 2018లో ఆర్బీకేసీ కౌన్సిలర్‌గా ఎన్నికైన ఉదయ్... ఇప్పుడు డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. గురువారం ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా స్వగ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. భీమవరం కేజీఆర్ఎల్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఆరేటి వీరవెంకటసత్యనారాయణ కుమారుడే ఉదయ్.

28లోగా ఏపీకి 'నైరుతి'!

▸ అరేబియా సముద్రంలో అల్పపీడనం

▸ 27న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

విశాఖపట్నం, అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): తూర్పు మధ్య అరేబియా సముద్రంలో గురువారం అల్పపీడనం ఏర్పడింది. ఇది బలపడి ఉత్తర దిశగా పయనించి వాయుగుండంగా మారనుంది. దీని ప్రభావంతో వచ్చే రెండు మూడు రోజుల్లో కేరళ, తమిళనాడుల్లో నైరుతి రుతుపవనాలు ప్రవేశించనున్నాయి. ఇదిలావుండగా, ఈ నెల 27న పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది మరింత బలపడనుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడనుంది. తాజా అంచనాల ప్రకారం రుతుపవనాలు ఈ నెల 28వ తేదీలోగా రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయి. కాగా, రాష్ట్రంలో గురువారం పలుచోట్ల వర్షాలు కురిశాయి. శుక్రవారం పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని విపత్తుల శాఖ తెలిపింది.

గ్రామాభివృద్ధిలో భాగం అవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టిన 'మన ఊరికోసం మాటామంతీ' కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రావివలస గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ఆయన మాట్లాడారు. టెక్కలిలోని భవానీ థియేటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయం నుంచి ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. రావివలసలో ఎండలమల్లికార్జున స్వామి ఆలయానికి టూరిజం, దేవదాయశాఖ ద్వారా అవసరమైన నిధులు మంజూరు చేద్దామన్నారు. గ్రామంలో గ్రంథాలయం, రోడ్లు, కాలువలు, క్రీడామైదానాలు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటుకు రూ.15 కోట్లు మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు. త్వరలో మల్లికార్జునస్వామి ఆలయాన్ని సందర్శిస్తానని తెలిపారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా రావివలస: మంత్రి అచ్చెన్న

మంత్రి, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కూడా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడింది. స్థానిక సంస్థల నిధులు ఇతర రంగాలకు మళ్లించారు. స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు, అధికారాల కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేస్తున్న కృషి అభినందనీయం. రావివలసను ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సి ఉంది. జలజీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం. ప్రకృతి వ్యవసాయాన్ని రెట్టింపు చేస్తాం' అని తెలిపారు. మాజీ జడ్పీటీసీ ఎల్.ఎల్.నాయుడు మాట్లాడుతూ.. 'రావివలసలో ఎండల మల్లికార్జునస్వామి ఆలయానికి వెళ్లే మార్గాన్ని విస్తరించాలి. గ్రామంలో ఇంటర్నల్ డ్రైనేజ్ సదుపాయం కల్పించాలి. అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించాలి. శ్మశానవాటికకు రోడ్డు, సీత పుష్కరిణికి మెట్లు సదుపాయం కల్పించాలి' అని కోరారు. దీనిపై పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. 'సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేద్దాం. డ్రైనేజ్ నిర్మాణాల్లో చాలాచోట్ల లోపాలున్నాయి. ఆ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. శ్మశానవాటికకు సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలి' అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆదేశించారు. ఈ మేరకు ఎండల మల్లన్న ఆలయానికి వెళ్లే రహదారి విస్తరణకు రూ.3 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.



జీవవైవిధ్య సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

సనాతన ధర్మం మతోన్మాదం కాదు

▸ ప్రతి జిల్లాకో బయోడైవర్సిటీ పార్కు..

గ్రామానికో పల్లెవనం: పవన్ కల్యాణ్

విజయవాడ, మే 22 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం మతోన్మాదం కాదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అటవీ భూములను ఆక్రమించుకునే వారు ఉన్నారు కానీ.. చెట్లు లేని ప్రాంతంలో మొక్కలు నాటాలనే ఆలోచన ఏ ఒక్కరిలోనూ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి కనిపిస్తే కొందరికి ఆక్రమించుకోవాలనిపిస్తుందని... కానీ తనకు మాత్రం వైవిధ్యం నెలకొల్పాలనిపిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరైన విశాఖపట్నానికి చెందిన భూషణ్ అనే ప్రకృతి సేవకుడిని చూపిస్తూ 'మనకు సంబంధం ఉన్న ప్రదేశమైనా ఖాళీగా కనిపిస్తే అక్కడ విత్తనాలు, మొక్కలు నాటడం వృత్తిగా చేసుకున్న ఆయన్ని చూసి మనం నేర్చుకోవాలి' అన్నారు. ప్రతి జిల్లాలో ఒక బయోడైవర్సిటీ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

పండుగలా రేషన్ పంపిణీ

▸ రాష్ట్ర చౌక ధరల దుకాణదారుల సంఘం పిలుపు

అమరావతి, మే22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రేషన్ వాహనాలను నిలిపివేసి చౌక ధరల దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా జూన్ 1న రేషన్ షాపులను అలంకరించి పండుగ వాతావరణంలో సరుకులు పంపిణీ చేయాలని రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు దివి లీలామాధవరావు డీలర్లకు పిలుపునిచ్చారు. గురువారం విజయవాడలోని కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈనెల25న అన్ని రేషన్ షాపుల వద్ద బ్యానర్లు కట్టి ప్రచారం చేయాలని సూచించారు..

1న కానిస్టేబుల్ పోస్టుల తుది పరీక్ష

▸ నేటి నుంచి హాల్‌టిక్కెట్లు: పీఆర్‌బీ చైర్మన్ మీనా

అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): 6,100 పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు జూన్ 1న తుది రాత పరీక్ష నిర్వహించనున్నట్లు రాష్ట్ర స్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు(ఎస్ఎల్‌పీఆర్‌బీ) వెల్లడించింది. దేహదారుఢ్య, శారీరక సామర్థ్య పరీక్షల్లో అర్హత సాధించిన 38,910 మంది తుది రాత పరీక్షకు అర్హత పొందినట్లు తెలిపింది. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, తిరుపతిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ పరీక్షను జేఎన్‌టీయూ ద్వారా నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. అభ్యర్థులు ఏపీ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి ఈనెల 31 వరకు హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పీఆర్‌బీ చైర్మన్ మీనా ఒక ప్రకటనలో సూచించారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే ప్రభుత్వ కార్యాలయాల పనివేళల్లో 9441450639 లేదా 9100203323 నంబర్లకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు.

కడప మేయర్ సురేష్‌బాబుకు హైకోర్టు షాక్

▸ బాధ్యతల తొలగింపు ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరణ

అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సురేశ్‌బాబుకు హైకోర్టు షాక్ ఇచ్చింది. మేయర్ బాధ్యతల నుంచి ఆయనను తొలగిస్తూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది. తొలగింపు జీవోను సస్పెండ్ చేయాలంటూ సురేష్‌బాబు వేసిన అనుబంధ పిటిషన్‌ను కొట్టివేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ గురువారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. తనను మేయర్ పదవి నుంచి తొలగిస్తూ ఈ నెల 14న ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ సురేశ్‌బాబు హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది వీఆర్ రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపించారు. వర్ధిని కనస్ట్రక్షన్స్ కంపెనీ పిటిషనర్ సతీమణి, కుమారుడికి చెందినది అని చెప్పారు. ఆ కంపెనీకి పనుల కేటాయింపునకు సంబంధించి పిటిషనర్‌కు అవగాహన లేదన్నారు. పనులు కేటాయించే అధికారం మున్సిపల్ కమిషనర్‌కే ఉందన్నారు. వివరణ ఇచ్చేందుకు సమయం కోరిన పిటిషనర్ వినతిని పరిగణలోకి తీసుకోకుండానే పదవి నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. పురపాలకశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది, కడప ఎమ్మెల్యే మాధవి తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పిటిషనర్.. తన పదవిని దుర్వినియోగం చేశారన్నారు. తన కుటుంబ సభ్యులకు చెందిన వర్ధిని కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి పనుల కేటాయింపు విషయం తనకు తెలియదన్న పిటిషనర్ వాదనలో అర్థం లేదన్నారు. పిటిషనర్‌కు నోటీసు ఇచ్చి వివరణ తీసుకున్నతర్వాతే ముఖ్యకార్యదర్శి తొలగింపు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. దీనిలో జోక్యం చేసుకోవద్దని అభ్యర్థించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, పిటిషనర్ వేసిన అనుబంధ పిటిషన్‌ను కొట్టివేశారు. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

సొంత గడ్డపైనే పేలుళ్లకు కుట్ర..!

▸ గుర్తించకుంటే భారీ నష్టమే జరిగేది

▸ కొనసాగుతున్న ఎన్ఐఏ దర్యాప్తు

▸ నేడు పోలీసు కస్టడీకి సిరాజ్, సమీర్

విజయనగరం/క్రైం మే22(ఆంధ్రజ్యోతి): ఊపిరి పోసుకున్న నేలపైనే రక్తపుటేర్లు పారించాలని చూశాడా! జన్మనిచ్చిన స్థలంలోనే అమాయక ప్రజల మృత్యుఘోషను వినాలనుకున్నాడా? విజయనగరంలో భారీ పేలుళ్ల కుట్ర కేసులో ఎఫ్ఐఆర్‌ను పరిశీలిస్తే అవుననే భావన కలగకమానదు. మతోన్మాదంతో నిందితుడు సిరాజ్ పెద్ద కుట్రే పన్నినట్లు భావిస్తున్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో పేలుళ్లకు పక్కా ప్రణాళిక వేసినట్టు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. గగుర్పాటు కలిగించే అంశాలు బయటపడటంతో జిల్లా వాసులు ఉలిక్కిపడుతున్నారు. విజయనగరం వాసి సిరాజ్ కదలికలపై ఆంధ్రా, తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు గత ఆరు నెలలుగా ప్రత్యేక నిఘా పెట్టారు. జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు ఇచ్చిన సమాచారంతో కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు మూడునెలలుగా జిల్లా కేంద్రంలోనే ఉంటూ సిరాజ్ కదలికలను డేగ కన్నుతో పరిశీలిస్తున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో పేలుళ్లకు కుట్రలు పన్నినట్లు నిర్ధారణకు వచ్చి తరచూ జిల్లా పోలీస్ ఉన్నతాధికారులను సంప్రదిస్తున్నారు. స్థానిక పోలీసుల సహకారంతో ఈ నెల 16న సిరాజ్‌ను వల వేసి పట్టుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారించటంతో పోలీసు అధికారులకు విస్తుపోయే నిజాలు తెలిశాయి. అతని వద్ద ఉన్న పేలుళ్ల సామగ్రిని స్వాధీనం చేసుకుని దర్యాప్తును వేగవంతం చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 17 నుంచి విజయనగరంలోని వివిధ ప్రాంతాల్లో సోదాలు చేశారు. అనుమానం వచ్చిన ప్రతి అంశాన్నీ కూలంకషంగా పరిశీలించి మరిన్ని క్లూలు సేకరిస్తున్నారు. వీరికి తోడుగా జిల్లా పోలీస్ యంత్రాంగం సిరాజ్ కుటుంబీకులతో పాటు స్కూల్ వయసు నుంచి అతనితో పరిచయం ఉన్న స్నేహితుల వివరాలపై ఆరా తీస్తోంది. ఆయా విభాగాల అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. సిరాజ్ పలువురితో ప్రత్యేక కోడ్ భాషలో మాట్లాడినట్టు కూడా గుర్తించారు. సిరాజ్ పేలుళ్లకు కుట్ర పన్నినట్లు తెలిశాక ఎన్ఐఏ అధికారులు ఢిల్లీ నుంచే ఆపరేషన్ మొదలు పెట్టారు. ఆపై ఆంధ్రా, తెలంగాణల్లో విధులు నిర్వర్తించే ఆ సంస్థ అధికారులు నగరానికి వచ్చి వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ సమాచారం సేకరిస్తున్నారు. జిల్లా కేంద్రంలో సిరాజ్‌కు ఎవరైనా సహకరించారా అని ఆరా తీస్తున్నారు. స్థానికంగా సిరాజ్‌కు పేలుడు సామగ్రి అమ్మిన వ్యాపారులతో దర్యాప్తు అధికారులు ఇప్పటికే మాట్లాడారని తెలిసింది.

పోలీస్ కస్టడీకి సిరాజ్, సమీర్..

పేలుళ్ల కుట్ర కేసులో ఏ1 సిరాజ్ , ఏ2 సమీర్ నుంచి మరింత సమాచారాన్ని రాబట్టేందుకు వారిని పోలీస్ కస్టడీకీ ఇవ్వాలని టూటౌన్ పోలీసులు న్యాయస్థానంలో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. రెండు రోజుల పాటు వాదనలు విన్న తరువాత వారిద్దరినీ ఏడు రోజుల కస్టడీకీ ఇస్తూ విజయనగరం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో వారిద్దరినీ శుక్రవారం జైలు నుంచి విజయనగరం తీసుకురానున్నారు. వీరి పోలీస్ కస్టడీతో మరిన్ని కీలక ఆధారాలు బయట పడే అవకాశం ఉంది.

రంగంలోకి ఏటీఎస్!

పేలుళ్ల కుట్రలో దర్యాప్తు మరింత వేగవంతం చేసేందుకు ఉగ్రవాద వ్యతిరేక దళం(ఏటీఎస్) రంగంలోకి దిగినట్టు సమాచారం. కాగా, సిరాజ్ పేరున అనేక బ్యాంకు ఖాతాలు ఉన్నట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలోని డీసీసీబీలో సిరాజ్ పేరున ఖాతా ఉండగా తండ్రి పేరున లాకర్ ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. సిరాజ్‌ను రిమాండ్‌కు తరలించిన తరువాత లాకర్‌ను తెరిచేందుకు ఆయన తండ్రి విఫలయత్నం చేశారు. లాకర్ తెరిచేందుకు ఎందుకు ఆరాట పడుతున్నాడు? లాకర్‌లో ఏముంది? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

అమెరికా పౌరులే టార్గెట్..!

అమెజాన్ కస్టమర్లకు మెసేజ్‌లు పంపి ఎర

▸ గిఫ్ట్ కోడ్ పేరిట ఖాతాల్లో డబ్బులు మాయం

▸ అచ్యుతాపురం కేంద్రంగా సైబర్ మోసాలు..33 మంది అరెస్ట్

అనకాపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని అమెజాన్ కస్టమర్లను టార్గెట్ చేసుకుని.. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం కేంద్రంగా సైబర్ మోసాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈశాన్య, ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన యువతీ యువకులతో కాల్ సెంటర్ నిర్వహిస్తూ అమెరికా, తదితర దేశాల ప్రజలను లక్ష్యంగా చేసుకున్నట్టు గుర్తించినట్టు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. సైబర్ ముఠా వివరాలను వెల్లడించారు. ఈ నెల 20వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి అందించిన సమాచారంతో అచ్యుతాపురం భోగాపురం వీధిలో పవన్ రెసిడెన్సీతో పాటు మరో రెండు అపార్టుమెంట్లలో ఆకస్మిక సోదాలు నిర్వహించి మేఘాలయ,సిక్కిం తదితర ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 33 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసినట్టు చెప్పారు. 3 లక్షలు నగదు, 32 హార్డ్ డిస్క్‌లు, 32 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ముంబై, రాజస్థాన్‌కు చెందిన పునీత్‌గోస్వామి, అవిహంత్ దాగా ఆధ్వర్యంలో మోసాలు సాగినట్టు తెలిపారు. 15 కోట్ల నుంచి 20కోట్ల వరకు కాజేసినట్టు గుర్తించామన్నారు.

ఎలా మోసం చేస్తారంటే... సైబర్ ముఠా వాయిస్ ఓవర్ ఇంటర్‌నెట్ ప్రొటోకాల్ (వీఓఐపీ)ను ఉపయోగించుకుని అమెరికాలోని అమెజాన్ కస్టమర్లకు మెసేజ్‌లు పంపుతుంటారు. ముందుగా..ఏదైనా వస్తువు కొన్నారా..? అని మెసేజ్ పంపుతారు.అటు నుంచి కస్టమర్ స్పందించి... కొనలేదని సమాధానమిస్తే.. మీ బ్యాంకు అకౌంట్‌ను వాడుకొని ఎవరో వస్తువు కొనుగోలు చేసినట్టు పక్కనే ఉండే మరో ముఠా సభ్యుడు కనెక్ట్ అవుతాడు. మీ అకౌంట్‌లో డబ్బు పోకుండా ఉండాలంటే గిఫ్ట్ కోడ్‌ను ఎంటర్ చేయాలని సూచిస్తారని, నిజమేనని నమ్మి వారు అడిగిన బ్యాంకు ఖాతాల వివరాలు చెప్పగానే.. డబ్బులు కాజేస్తున్నారని ఎస్పీ తెలిపారు.

ఫైవ్‌స్టార్ హోటల్స్‌కు రాయితీలు

▸ టూరిజం పాలసీ ప్రకారం భూ కేటాయింపులు

▸ ఉత్తర్వులు జారీ చేసిన పర్యాటక శాఖ

అమరావతి, మే 22 (ఆంధ్రజ్యోతి): టూరిజం పాలసీ 2024-29 ప్రకారం రాష్ట్రంలో ఏర్పాటయ్యే స్టార్ హోటల్స్‌కు ప్రభుత్వం రాయితీలు ఇవ్వడంతో పాటు భూకేటాయింపులు చేసింది. ఈ మేరకు పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖలో ఒకటి, తిరుపతిలో రెండు ఫైవ్ స్టార్ హోటళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే అనుమతిచ్చింది. బెంగుళూరుకు చెందిన స్రవంతి హోటల్స్ అండ్ రిసార్ట్స్ సంస్థ తిరుపతిలో ఐబీఎస్ శైలిలో త్రీస్టార్ హోటల్‌తో పాటు నోవోటెల్ ఫైవ్‌స్టార్ క్లస్టర్ హోటల్‌ను ఏర్పాటు చేయనుంది. వీటి కోసం దాదాపు రూ. 327 కోట్లు ఖర్చు చేయనుంది. దీనికి టూరిజం పాలసీ ప్రకారం ప్రభుత్వం భారీగా రాయితీలు ఇచ్చింది. ఎస్‌జీఎస్‌టీలో 12 ఏళ్ల పాటు వంద శాతం రాయితీ ప్రకటించింది. వంద శాతం స్టాంప్ డ్యూటీ రాయితీ, పరిశ్రమల ధరలకే విద్యుత్‌తో పాటు మరికొన్ని ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందించనుంది. అలాగే ఒడిసాకు చెందిన బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ సంస్థ తిరుపతిలోని ఎస్.వి.పురం వద్ద రూ. 150 కోట్లతో ఫైవ్‌స్టార్ హోటల్ ఏర్పాటు చేయనుంది. దీనికి 12.7 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. అద్దె ప్రాతిపదికన 66 ఏళ్లకు భూ కేటాయింపులు చేయడంతో పాటు హోటల్ నిర్వహణ ఆదారంగా మరో 33 ఏళ్లకు దానిని పొడిగించుకునేందుకు అవకాశం కల్పించింది. పదేళ్లకు ఎస్‌జీఎస్‌టీ వందశాతం రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం చేస్తుంది. వీటితోపాటు మరికొన్ని రాయితీలను ప్రభుత్వం నుంచి అందిస్తుంది. ఇక విశాఖలో వరుణ్ నోవోటెల్‌కు కొనసాగింపుగా మరో ఫైవ్‌స్టార్ హోటల్‌తో పాటు డీలక్స్ రూమ్స్ కమ్ సర్వీస్ అపార్ట్‌మెంట్స్ ఏర్పాటుకు వరుణ్ హాస్పిటాలిటీ సంస్థ ముందుకు వచ్చింది. ఈ ప్రాజెక్ట్ కోసం 899.50 కోట్ల పెట్టుబడి పెడుతోంది. 15ఏళ్లపాటు ఎస్‌జీఎస్‌టీ వంద శాతం రీయింబర్స్‌మెంట్, వంద శాతం స్టాంప్ డ్యూటీ రాయితీ ప్రభుత్వం అందించనుంది.

వాళ్లంతా మంచోళ్లు!



మద్యం స్కామ్‌తో వాళ్లకేం సంబంధం?.. కుంభకోణం ఎక్కడ జరిగింది?

బాబుకు సాయిరెడ్డి అమ్ముడుపోయాడు.. వాసుదేవరెడ్డిని బెదిరించి వాంగ్మూలం తీసుకున్నారు

నేను ఇక్కడే ఉన్నా అరెస్టు చేసుకోవచ్చు.. వెన్నుపోటు దినంగా 'జూన్ 4': వైఎస్ జగన్

అమరావతి, మే 22 (ఆంధ్రజ్యోతి): 'నా హయాంలో మద్యం స్కామ్ జరగలేదు! జరిగే అవకాశమే లేదు. నా చుట్టూ ఉన్న వాళ్లంతా మంచోళ్లు! వాళ్లను అన్యాయంగా వేధిస్తున్నారు'... అని మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 'అసలు నా పాలనలో మద్యం స్కామ్ ఎక్కడ జరిగింది' అని ప్రశ్నించారు. గురువారం తాడేపల్లి ప్యాలె‌స్‌లో ఎప్పట్లాగే ఎంపిక చేసిన మీడియా ప్రతినిధులతో సుదీర్ఘంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

అంతా పారదర్శకమే...

2014-19లో లిక్కర్ సేల్స్ పెంచుకుంటూ పోయారు. నా హయాంలో లిక్కర్ సేల్స్ తగ్గాయి. అలాంటప్పుడు స్కామ్ ఎలా జరుగుతుంది? ప్రతి మద్యం బాటిల్ మీదా క్యూఆర్ కోడ్‌ను ముద్రించాం. అమ్మకం జరిగిన వెంటనే ఆన్‌లైన్‌లోకి వివరాలన్నీ వెళ్లిపోయాయి. ఇక స్కామ్‌కు ఆస్కారం ఎక్కడుంది? భయపెట్టి తప్పుడు సాక్ష్యాలను సృష్టించి, తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించి మద్యం స్కామ్ జరిగిందని ప్రచారం చేస్తున్నారు. మా ప్రభుత్వ హయాంలో లాభాపేక్ష లేకుండా ప్రభుత్వమే మద్యం అమ్మకాలను సాగించింది. ప్రైవేటు షాపుల చేత ఎంపిక చేసుకున్న డిస్టిలరీలకు ఇండెంట్ ఇస్తే లంచాలు ఇస్తారా? లేక .. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డైనమిక్‌గా, పారదర్శకంగా ఆర్డర్లు ఇస్తే లంచాలు ఇస్తారా? వైసీపీ ప్రభుత్వం కొత్తగా ఒక్క డిస్టిలరీకి కూడా లైసెన్సు ఇవ్వలేదు. 2014-19 సమయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు లిక్కర్ షాప్‌లకు రూ.1300 కోట్లు లబ్ధి చేకూరుస్తూ మూడు సంతకాలు చేసి బలమైన సాక్ష్యాధారాలతో సహా అడ్డంగా దొరికారు. దాని నుంచి తప్పించుకునేందుకే అంతకంటే పెద్దస్కామ్ జరిగినట్లుగా భేతాళ కథలను అల్లుతున్నారు.

సాయిరెడ్డి సాక్ష్యానికి విలువుందా?

వైసీపీకి ఎమ్మెల్యేల బలం లేదని.. మా పార్టీ నుంచి కొత్తగా ఎవరికీ రాజ్యసభ సీటు ఇవ్వలేమని తెలిసీ విజయసాయిరెడ్డి రాజీనామా చేశారు. తన రాజీనామా వల్ల చంద్రబాబుకూ, కూటమికీ మేలు జరుగుతుందని తెలిసీ ఇలా చేశారు. ప్రలోభాలకు లోనై తన రాజ్యసభ సభ్యత్వాన్ని చంద్రబాబుకు అమ్మేశారు. అలాంటి వ్యక్తి ఇచ్చే వాంగ్మూలానికి విలువేం ఉంటుంది? అప్పటి బేవరేజెస్ ఎండీ వాసుదేవరెడ్డిని బెదిరించి, తమకు అనుకూలంగా వాంగ్మూలం ఇచ్చాకే తిరిగి కేంద్ర సర్వీసులకు వెళ్లేందుకు చంద్రబాబు అనుమతించారు. బేవరేజెస్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్ సత్య ప్రసాద్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని అనూషను బెదిరించి స్టేట్‌మెంట్లు తీసుకున్నారు.

కసిరెడ్డికి ఏం సంబంధం?

కసిరెడ్డి రాజశేఖరరెడ్డికి మద్యంతో ఏం సంబంధం? ఆయనకు ఐటీ సలహాదారు పదవి ఇచ్చాం. అయినా.. ఆయన విజయవాడకు వచ్చిందే తక్కువ. ఆయనను కూడా బెదిరించారు. అబద్ధాలు చెప్పకపోవడం వల్లే నిందితుడిని చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డికి మద్యంతో ఏం సంబంధం? ఆయన లోక్‌సభలో వైసీపీ పక్ష నేత. ఆయనకు ఈ రాష్ట్రంతో ఏం సంబంధం? అప్పటి సీఎంవో కార్యదర్శి ధనుంజయరెడ్డి, నా పీఎస్ కృష్ణమోహన్‌రెడ్డికి మద్యం కుంభకోణంతో ఏం సంబంధం? ధనుంజయరెడ్డి సీఎంవోలో మద్యం శాఖ చూడలేదు. సీఎంవోకు ఒక్క మద్యం ఫైల్ వచ్చిందా? ఒక్క సంతకమైనా చూపించగలుగుతారా? ధనుంజయ రెడ్డి మచ్చలేని ఐఏఎస్ అధికారి!

బాలాజీ గోవిందప్ప ఎంతో గొప్ప!

బాలాజీ గోవిందప్ప ఫ్రాన్స్‌కు చెందిన వీకార్డ్ అనే మల్టీ నేషనల్ కంపెనీలో హోల్ టైమ్ డైరెక్టర్. ఆయన ఏపీలోనే ఉండరు. అసలు ఆయనకు టైమ్ ఉండదు. నా కంపెనీ డైరెక్టర్లు కాని వాళ్లు నాకోసం ఎందుకు పని చేస్తారు? గోవిందప్పకు భారతీ సిమెంట్స్‌లో షేర్లు ఉన్నాయి. నాకూ రిలయన్స్ షేర్లు ఉన్నాయి. అంతమాత్రాన నాదైపోతుందా?

పిల్లల పెళ్లిళ్లకు ముందు...

ధనుంజయరెడ్డి కుమారుడికి ఈ మధ్యనే పెళ్లి సంబంధం సెటిల్ అయింది. కృష్ణ మోహన్ రెడ్డి కూతురికి కూడా సంబంధం ఖాయమైంది. గోవిందప్ప కూతురికీ ఇటీవలే పెళ్లి ఖాయమైంది. పీఎస్సార్ ఆంజనేయులు డీజీపీ స్థాయి అధికారి. చాలా మంచి అధికారి. ఆయన రెండో కుమారుడికి పెళ్లి సంబంధం ఖాయమైంది. పిల్లల పెళ్లిళ్ల సమయంలో ఇలా అరెస్టులు చేయడం న్యాయమేనా?

ఐపీఎస్‌లను వేధిస్తారా?

డీజీ స్థాయి అధికారి సునీల్ దళిత అధికారి. ఆయన్ను సస్పెండ్ చేశారు. ఐపీఎస్ అధికారులు కాంతిరాణా తాతా, జాషువా, విశాల్ గున్నీ, కొల్లి రఘురామిరెడ్డి... తదితరులను వేధిస్తున్నారు. లిక్కర్ స్కామ్‌లో షరతులతో కూడిన బెయిల్‌పై ఉన్న చంద్రబాబు అరెస్టవుతారు. రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయింది. రాక్షస పాలన సాగుతోంది. అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోంది. ఎన్నికల ఫలితాలు వెలువడి, కూటమి గెలిచిన రోజైన 'జూన్ 4'ను రాష్ట్రవ్యాప్తంగా వెన్నుపోటు దినంగా జరుపుతాం.

వెల్‌కమ్... అరెస్టు చేసుకోవచ్చు

కేసుల్లో ఇరికించి అరెస్టులు చేస్తే ఏం చేయగలం? విజయవాడలోనే ఉంటా. ఎప్పుడైనా అరెస్టు చేసుకోవచ్చు వెల్‌కమ్! రాజకీయ కక్షలతో అరెస్టులు చేస్తూ వేధిస్తే.. దేవుడు పైనుంచి చూస్తున్నాడు జాగ్రత్త! ఎల్లకాలం ప్రతీకార చర్యలు సాగవు.

అడ్డంగా... అబద్ధాలు!

ప్రెస్‌మీట్‌లో జగన్ విన్యాసాలు.. భారతీ సిమెంట్స్‌లో బాలాజీ ఫుల్‌టైమ్ డైరెక్టర్ అయినా... ఆయనెవరో తెలియనట్లు బిల్డప్

నాడు ఐఏఎస్, ఐపీఎస్‌లపై వేధింపులు.. అవి మరిచి నేడు ఆవేదన, ఆక్రోశం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అబద్ధమని తెలిసీ... పదేపదే దాన్నే చెబుతూ... అదే నిజమని ప్రజల్ని నమ్మించాలని ప్రయత్నించడం! వైఎస్ జగన్మోహన్ రెడ్డిది ఆది నుంచీ ఇదే వ్యూహం! గురువారం ఎంపిక చేసుకున్న మీడియా ప్రతినిధులతో ఆయన రెండుగంటలకు పైగా మాట్లాడి... అనేక అసత్యాలు, అర్ధసత్యాలు, వక్రీకరణలు, వింత భాష్యాలతో ప్రజలను బురిడీ కొట్టించే ప్రయత్నం చేశారు. కొందరైనా నమ్మకపోతారా అనే ధీమాతో కాబోలు... రకరకాల విన్యాసాలు ప్రదర్శించారు. వాటిలో మచ్చుకు కొన్ని చూద్దాం...



బాలాజీ గోవిందప్పతో సంబంధంలేదా?

జగన్ మాట: 'నా కంపెనీతో సంబంధంలేని వాళ్లు నాకోసం ఎందుకు పని చేస్తారు. బాలాజీ గోవిందప్పకు భారతీ సిమెంట్స్‌లో షేర్స్ ఉన్నాయి. అంతమాత్రాన కంపెనీ ఆయనదైపోతుందా?'

వాస్తవం: జగన్ చెప్పింది నిజమే! అదే సమయంలో... షేర్స్ ఉన్న వాళ్లంతా ఫుల్‌టైమ్ డైరెక్టర్లు, డైరెక్టర్లు కాలేరు. కానీ... భారతీ సిమెంట్స్‌లో బాలాజీ గోవిందప్ప సాధారణ షేర్ హోల్డర్ కాదు. ఆయన పూర్తిస్థాయి డైరెక్టర్. భారతీ సిమెంట్స్ వెబ్‌సైట్‌లోనే ఈ విషయం స్పష్టంగా ఉంది. భారతీ పాలిమర్స్‌లో కూడా బాలాజీ ఒక డైరెక్టర్. ప్రపంచంలో ఐదో అతి పెద్ద సిమెంట్ కంపెనీల్లో పని చేసే వ్యక్తికి తీరికే ఉండదంటున్న జగన్.... తన కుటుంబానికి చెందిన కంపెనీల్లో ఆయనను ఫుల్‌టైమ్ డైరెక్టర్‌గా ఎలా చేర్చుకోగలిగారో ఆయనకే తెలియాలి. తన కంపెనీలు వేరే, తన సతీమణి భారతీ కంపెనీలు వేరే అన్నట్లుగా జగన్ మాట్లాడటమే అన్నింటికంటే విచిత్రం.

జగన్ మాట: చంద్రబాబు లిక్కర్ కేసులో కండిషనల్ బెయిలుపై ఉన్నారు. అంతకు మించిన స్కామ్ జరిగిందని చెప్పేందుకే భేతాళ కథలు చెబుతున్నారు.

అసలు వాస్తవం: జగన్ సర్కారు చంద్రబాబుపై స్కిల్ కేసు పెట్టి... అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆయన ఆ కేసులో మాత్రమే బెయిలుపై ఉన్నారు. అయితే... ఆయన ఇలా బెయిలుపై రాగానే అలా మళ్లీ మళ్లీ అరెస్టు చేసేందుకు లిక్కర్ కేసు, రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు వంటివి అప్పటికప్పుడు బనాయించారు. ఈ విషయాన్ని చంద్రబాబు న్యాయవాదులు గ్రహించి... ముందుగానే కోర్టును ఆశ్రయించారు. ఒక దశలో చంద్రబాబును లిక్కర్ కేసులో తాము అరెస్టు చేయడం లేదని అప్పటి జగన్ ప్రభుత్వమే కోర్టుకు తెలిపింది. అయినప్పటికీ... న్యాయవాదులు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. కోర్టు కూడా ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అంతేతప్ప... జగన్ చెప్పినట్లుగా చంద్రబాబు 'కండిషనల్ బెయిలు'పై లేరు. అరెస్టు చేశాక వచ్చేది బెయిల్. అరెస్టు చేయకుండా వచ్చేది ముందస్తు బెయిల్. ఈ రెండింటికీ చాలా తేడా ఉంది. పదికిపైగా కేసుల్లో 'కండీషనల్ బెయిలు'పై ఉన్న జగన్‌కు ఈ తేడా తెలియదంటే నమ్మలేం!

జగన్ మాట: ధనుంజయ్ రెడ్డి మంచి అధికారి. పీఎస్సార్ ఆంజనేయులు మంచి ఆఫీసర్. కొల్లి రఘురామి రెడ్డి, రిశాంత్ రెడ్డి లాంటి వారికి పోస్టింగ్ ఇవ్వకపోవడం అన్యాయం. ఇంకా ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లను చంద్రబాబు ప్రభుత్వం వేధిస్తోంది.

అసలు వాస్తవం: వేధింపుల గురించి జగన్ మాట్లాడటమే ఒక చోద్యం! జగన్ సీఎంగా ఉన్నప్పుడు, ఆయన ఆదేశాల మేరకు అడ్డగోలు పనులు చేసి, ఆరోపణలు ఎదుర్కొన్న వారిపై ఇప్పుడు కేసులు నమోదయ్యాయి. కొందరిపై చర్యలు తీసుకున్నారు. కానీ... జగన్ హయాంలో పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఉద్దేశపూర్వకంగా పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు. సీనియర్ ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్రకు ఏడాదిపాటు పోస్టింగ్ ఇవ్వలేదు. మరో ఐఏఎస్ అధికారి ఎస్.సత్యనారాయణను ఏడాదిపాటు ఏపీలోనే లేకుండా చేశారు. మరో ఐపీఎస్ అధికారి, ప్రస్తుతం ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్‌కూ ఇదే పరిస్థితి. సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు విషయంలో దేశ సర్వోన్నత న్యాయస్థానం చెప్పినా సరే ఐదేళ్ల పాటు పోస్టింగ్ ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు.


ఐదేళ్లూ ముంచి... అమరావతిపై మళ్లీ విషం

జగన్ మాట: అమరావతిని బంగారంతో కడుతున్నారా? చదరపు అడుగు నిర్మాణానికి రూ.2500 సరిపోతుంది. కానీ... దానిని గతంలో రూ.4880లుగా పేర్కొన్నారు. ఇప్పుడు ఇంకా పెంచేశారు. ఈ ధరతో బొంబాయి. బెంగళూరులో హైరైజ్ బిల్డింగ్‌లలో ఫ్లాట్లు వస్తాయి. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ అంటూనే భారీగా అప్పులు ఎందుకు చేస్తున్నారు?

అసలు వాస్తవం: ఐదేళ్లపాటు అమరావతిని అటకెక్కించి, నిర్మాణాలను గాలికి వదిలేసి... ఇప్పుడు 'వామ్మో అంతా ఖర్చా' అని వాపోవడం జగన్‌కే చెల్లింది. ఐకానిక్ టవర్లకు అప్పట్లో రూ.2276 కోట్లకు టెండర్లు పిలిస్తే, ఇప్పుడు 4,668 కోట్లకు పెంచారన్నది జగన్ ఆరోపణ. అప్పట్లో ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్ లేకుండా రూ.2276 కోట్లకు టెండరు పిలిచారు. ఇప్పుడు... ఆ పనులతో కలిపి ధర నిర్ణయించారు. జగన్ నిర్వాకం కారణంగా ఐదేళ్లగా ఈ నిర్మాణాలు నీళ్లతో నానుతూ ఉన్నాయి. ఇన్నేళ్లలో ఎన్నిసార్లు ఎస్ఎస్ఆర్ రేట్లు పెరిగాయో జగన్‌కు తెలియదా అన్నది ప్రశ్న. హైదరాబాద్‌లో కట్టిన తెలంగాణ సచివాలయానికీ, ఇక్కడ అమరావతిలో నిర్మించ తలపెట్టిన సచివాలయం, జీఏడీ టవర్లకూ మధ్య సంబంధమే లేదు. అయినా... దానికీ, దీనికీ మధ్య జగన్ పోలిక తెచ్చారు. ఇక... ఇప్పటికే ఉన్న అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు భవనాలు వృథా అవుతాయన్నట్లుగా ఆయన వాపోయారు. నిజానికి... ఈ భవనాల్లో ఇతర శాఖల కార్యాలయాలు, ప్రస్తుతమున్న హైకోర్టు భవనంలో 'జిల్లా కోర్టుల కాంప్లెక్స్' ఏర్పాటు చేయాలని గతంలోనే నిర్ణయించారు. జాతీయ రహదారుల నిర్మాణానికి అయ్యే వ్యయంతో అమరావతిలో రహదారుల ఖర్చును పోల్చుతూ... 'ఇంత దోపిడీనా' అని జగన్ ఆరోపణలు గుప్పించారు. నిజానికి... హైవేల నిర్మాణంలో రహదారి ఖర్చు మాత్రమే ఉంటుంది. అమరావతిలో రోడ్ల పనుల్లో అనేక కాంపోనెంట్స్ ఉన్నాయి. డ్రెయినేజీ, వాటర్ సప్లై, వీధి దీపాలు, రెయిన్ వాటర్ రీయూసేజ్, విద్యుత్, ఇంటర్నెట్ తదితర కేబుళ్లను భూగర్భంలో వేసే కాంక్రీట్ డక్ట్స్, పాత్‌వేలు, సైకిల్ ట్రాక్స్, వాకింగ్ ట్రాక్స్ వంటివన్నీ ఇందులో భాగమే. అందుకే... నిర్మాణ వ్యయం ఎక్కువ. దోపిడీ కోసమే 'జ్యుడీషియల్ ప్రివ్యూ'ను చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేసిందని జగన్ మరో ఆరోపణ చేశారు.

అమరావతి పునర్నిర్మాణ పనులను సింహభాగం ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి తీసుకుంటున్న రుణంతో చేపట్టారు. ఈ సంస్థలు టెండర్ల ప్రక్రియ నుంచి పనుల పూర్తిదాకా ప్రతి దశనూ నిశితంగా పరిశీలించి, పర్యవేక్షిస్తాయి. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అని చెబుతూ వేల కోట్ల అప్పులు ఎందుకు తెస్తున్నారని జగన్ మరో ప్రశ్న సంధించారు. అప్పులు తేవడం నిజమే. వాటిని ప్రభుత్వం చెల్లించదు. అమరావతిలో భూములు విక్రయించడం ద్వారానే రుణాలు తిరిగి చెల్లించేలా ఇప్పటికే ప్రణాళిక రచించారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి



ITE & C Dept.: Approval of the Council of Ministers is sought for -

1. Approval for allotment of 3.5 acres of land at IT Park in Hill No.3 (SEZ) to M/s URSA Clusters Private Limited as per existing rules in vogue, and directed IT,E&C Department to process the application as per GO MS No.4 dated 24.3.2025. SIPB forwarded the request for the firm for allotment of lands at concessional price at INR 1 Cr per acre against the present price of INR 11.30 Cr per acre, to the Cabinet for consideration.

2. Approval for allotment of 56.36 acres land at IP Kapuluppada to M/s URSA Clusters Private Limited as per existing rules in vogue, and directed IT,E&C Department to process the application as per GO MS No.4 dated 24.3.2025. SIPB forwarded the request of the firm for allotment of lands at concessional price at INR 50 Lakh per acre against the existing price of INR 10.45 Cr per acre to Cabinet for consideration.

మళ్లీ అదే ఇడ్లీ వడ కథ

జగన్ మాట: 'ఊరూ పేరూ లేని ఉర్సా అనే కంపెనీకి ఎకరం రూపాయికే కట్టబెట్టారు. రూపాయికి ఇడ్లీ వడ కూడా రావు!'

అసలు వాస్తవం: జగన్ ఈ అబద్ధం చెప్పడం ఇది తొలిసారి కాదు. ఆయన చెబుతున్నట్లుగా ఉర్సా... అనేది ఊరూ పేరూ లేని కంపెనీ కాదు. తెలుగు వారికే చెందిన అంతర్జాతీయ కంపెనీ. ఏపీలో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. దీనికోసం ఇక్కడ స్పెషల్ పర్పస్ వెహికిల్ ఏర్పాటు చేసింది. ఉర్సాకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయికే భూమి ఇచ్చిందనడం వచ్చి అబద్ధం. కాపులుప్పాడలో ఎకరం రూ.50 లక్షలు, ఐటీ పార్కులో రూ.కోటి చొప్పున ధర నిర్ణయించి భూమి కేటాయించింది. ఇదీ అసలు వాస్తవం. అయినా సరే... అన్నీ తెలిసీ.. 'ఇడ్లీ వడ' కబుర్లు చెప్పడం జగన్‌కే చెల్లింది.

ఎవరీ 'క్రాంతిలాల్ రాణా'

ఐపీఎస్ అధికారులు పీవీ సునీల్, సంజయ్, పీఎస్సార్ ఆంజనేయులు, విశాల్ గున్నీలాంటి వారిని సస్పెండ్ చేశారని చెబుతూ... 'క్రాంతిలాల్ రాణా' అనే పేరూ జగన్ ప్రస్తావించారు. దీంతో... క్రాంతి లాల్ రాణా ఎవరా అని అంతా అయోమయానికి గురయ్యారు. ఇవి... 'కాంతిరాణా తాతా' అనే అధికారి పేరుకు వచ్చిన తిప్పలు. ముంబై నటి జెత్వానీ కేసులో కాంతిరాణాను ప్రభుత్వం సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. జగన్ చెప్పినట్లుగా... 'క్రాంతి లాల్ రాణా' పేరుతో అధికారులెవరూ లేరు. ప్రస్తుతం ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ఐఏఎస్ అధికారి పేరు... కాంతిలాల్ దండే!

స్కామ్‌లు బయటపడేకొద్దీ జగన్‌లో భయం



» **అస్తిత్వం కోసమే అవాస్తవాలు: పయ్యావుల**

అనంతపురం, మే 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ దుర్మార్గపు పాలనలో చేసిన స్కామ్‌లు బయటపడేకొద్దీ జగన్‌లో భయం పుడుతోందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. తన అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు తమ ప్రభుత్వంపై అవాస్తవాలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. అనంతపురంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'అమరావతి మీద విషం చిమ్మడానికి.. అభివృద్ధిని అడ్డుకోవడానికే జగన్ ప్రెస్‌మీట్ పెట్టినట్టుగా ఉంది' అని అన్నారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం భూములిస్తుంటే వారిని భయపెట్టేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. 'రాష్ట్రానికి కంపెనీలను తీసుకురావడానికి మేం శ్రమ పడుతుంటే.. మీరు అప్పుడప్పుడు తెరపైకి వచ్చి అసత్యాలు మాట్లాడుతుంటే కంపెనీలు భయపడతాయి. మీరు కనిపిస్తే.. మీ అక్రమ పాలన, అవినీతి, ఇసుక దోపిడీ, లిక్కర్ కుంభకోణం, మీ అనుచరుల దౌర్జన్యాలు, దాడులు, భూ కుంభకోణాలు, అక్రమ కేసులు అన్నీ గుర్తుకు వస్తాయి. సిగరెట్ ప్యాకెట్‌పైన పొగతాగడం హానికరం అని ముద్రించినట్టుగా.. వైసీపీ పాలన ఈ రాష్ట్రానికి హానికరమని ప్రజలకు మళ్లీ మళ్లీ చెప్పాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. 'మా లిక్కర్‌లో ఏదో స్కాం ఉందని జగన్‌రెడ్డి అంటున్నారు. 50 ఏళ్లకుపైగా అమలులో ఉన్న పాలసీనే అమలు చేస్తున్నాం. ఓపెన్ ఆక్షన్‌లో మద్యం షాపులు కేటాయిస్తే.. అందులో ఏం తప్పు కనబడింది? ఇసుకలో ఏదో స్కాం జరిగిందని ఫొటోలు చూపించి మాట్లాడుతున్నావ్. కప్పం కట్టి ఇసుక తీసుకునే పరిస్థితి మీ పాలనలో ఉండేది. మీ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్‌లో అవినీతి బయటకొస్తోంది. గతంలో గాలి జనార్దన్‌రెడ్డితో నాకేం సంబంధమన్నారు. ఇప్పుడు రాజ్ కసిరెడ్డితో నాకేం సంబంధం అనే పరిస్థితి వచ్చింది. అమరావతిలో రివర్స్ టెండరింగ్ తీసేశారని అంటున్నారు. రివర్స్ టెండరింగ్ చేసి మీరు సాధించిందేమిటి? 3.50 లక్షల ఎకరాలకు ఎలాంటి రికార్డులు.. ఆధారం లేకుండా ఫ్రీ హోల్డ్ చేసేశారు.. ఈ భూములన్నీ ఎవరి చేతుల్లోకి వెళ్లాయి? ఏడాదిలోనే చంద్రబాబు అప్పులు విపరీతంగా చేశారని మాట్లాడుతున్నారే.. ఎందుకు చేశాం.? మేం తినడానికి చేశామా?. గత ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల అప్పులు చేయడంతోపాటు రూ.1.50 లక్షల కోట్లు బకాయి పెట్టారు. రూ.9,600 కోట్ల పరిశ్రమల ప్రోత్సాహక బకాయిలు ఉన్నాయి. మీరు చేసిన అప్పులు, వాటికి వడ్డీలు కట్టేందుకే ఇప్పుడు అప్పులు చేయాల్సి వస్తోంది' అని కేశవ్ అన్నారు.

లిక్కర్ సిరీస్‌పై జగన్‌కు భయం పట్టుకుంది



» **దర్యాప్తునకు సిద్ధపడటం లేదంటే తప్పు చేశారనే అర్థం: షర్మిల**

అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్‌లో నిజానిజాలు తేలేందుకు మాజీ సీఎం జగన్ విచారణను కోరాలని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. దర్యాప్తునకు సిద్ధపడటం లేదంటే ఆయన తప్పు చేశారని అర్థమవుతోందన్నారు. వైసీపీ హయాంలో డిజిటల్ పేమెంట్ ఎందుకు జరగలేదో, వచ్చిన ఆదాయం ఎటుపోయిందో వెల్లడించాలన్నారు. లిక్కర్ మాఫియా థ్రిల్లర్ సిరీస్‌తో వైసీపీకి, జగన్‌కు భయం పట్టుకుందన్నారు. ఆ భయాన్ని దూరం చేసేందుకు, కేడర్‌లో స్థైర్యం నింపేందుకే జగన్ మీడియా సమావేశాన్ని నిర్వహించారని చెప్పారు. గురువారం విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. 'సీఎంగా పనిచేసిన వ్యక్తి పోలీసులు, పోలీసు వ్యవస్థపై మాట్లాడిన తీరు బాధాకరం. పోలీసుల బట్టలు ఊడదీయిస్తాననడం ఏమిటి? విదేశాల్లో ఉన్నా పట్టుకుంటామని బెదిరించడం ఏమిటి? ఆయన సీఎంగా ఉన్న రోజుల్లో పోలీసులను ఎలా వాడుకున్నారో ప్రజలందరికీ తెలుసు. రఘురామరాజును అడిగితే మొత్తం చెబుతారు. నటి కాదంబరిని అడిగితే చెబుతుంది. 40 రోజుల పాటు ఆమెను బంధించలేదా? రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆరోపణలు వస్తే హుందాగా తీసుకునేవారు. లిక్కర్‌లో అవినీతి జరిగిందని జగన్‌పై ఆరోపణలు ఉన్నాయి. అసెంబ్లీ సమావేశాలకు హాజరై స్కామ్‌పై వివరణ ఇవ్వాలి' అని అన్నారు.

అప్పుల గొప్పలు.. జగన్ తిప్పలు!

» **చంద్రబాబు ఐదేళ్లలో రూ.2,49,530 కోట్లు తెస్తే.. నేను రూ.3,32,671 కోట్లు తెచ్చా: మాజీ సీఎం**

» **ఇందులో ఏది ఎక్కువో ఆయనకు తెలుసా?**

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నాలుగు రకాల అంకెలు చూపించాలి.. ఏదో ఒకటి సృష్టించాలి.. ఏది తప్పో ఏది ఒప్పో పట్టించుకోని సోషల్ మీడియాలో హల్‌చల్ చేయాలి.. ఈ ఒక్క లక్ష్యంతోనే వైసీపీ అధ్యక్షుడు జగన్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ప్రెస్‌మీట్‌లో అబద్ధాలు చెప్పారు. తెచ్చుకున్న పేపర్లను చూస్తూ ఆయన ఇంగ్లీషులో చదివిన స్క్రిప్టునకు, టీవీ మైకుల్లో తెలుగులో చెప్పిన మాటలకు సంబంధమే లేదు. ఉదాహరణకు.. 12 నెలల్లో సీఎం చంద్రబాబు రూ.1,37,546 కోట్ల అప్పులు చేశారని చెప్పారు. కానీ సదరు ఇంగ్లీషు స్క్రిప్టులో.. అమరావతి కోసం తేవాలనుకుంటున్న రుణాలు రూ.31,000 కోట్లు, ఏపీఎండీసీ తెచ్చుకోవాలనుకుంటున్న అప్పు రూ.3,489 కోట్లు అని స్పష్టంగా రాసి ఉంది. అంటే అది తేవాలనుకుంటున్నదే తప్ప తెచ్చింది కాదు. జగన్ మాత్రం తెచ్చేశారని అసత్యమాడారు. పేపర్లు చూసిన జనాలకు ఏం అర్థమవుతుందిలే అన్న ధీమానో.. లేక ఆయనకే ఇంగ్లీషు అర్థం కాలేదో! జగన్ చెప్పిన రూ.1,37,546 కోట్ల లెక్కలో ఇంకా తీసుకురాని రూ.35,089 కోట్లను పక్కన పెడితే మిగిలేది 1,02,457 కోట్లు. ఇందులో 2024 ఏప్రిల్, మే నెలలతోపాటు జూన్ 4వ తేదీ వరకు జగనే సీఎం. ఆ సమయంలో ఆయన రూ.23,000 కోట్ల అప్పులు తెచ్చారు. వీటిని తీసేస్తే.. మిగిలేది రూ.79,457 కోట్లు. ఇందులో మార్క్‌ఫెడ్, పౌరసరఫరాల సంస్థ, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సొంత అవసరాల కోసం తెచ్చుకున్న అప్పులు దాదాపు రూ.8,700 కోట్లు. జగన్ హయాంలో రాజ్యాంగ విరుద్ధంగా కార్పొరేషన్ల డబ్బులను ప్రభుత్వ పథకాలకు వాడినట్టుగా వీటిని వాడడం లేదు. అందుకేనేమో జగన్‌కు ఇందులో తప్పు కనిపించేసింది.

జగన్: 2019 నాటికి రాష్ట్ర అప్పు రూ.3,90,247 కోట్లు. ఇందులో రాష్ట్ర విభజన వల్ల సంక్రమించిన అప్పు రూ.1,40,717 కోట్లు. అంటే 2014-19 మధ్య ఐదేళ్లలో చంద్రబాబు చేసిన అప్పులు రూ.2,49,530 కోట్లు. 2024లో నేను దిగిపోయే నాటికి రూ.7,21,918 కోట్లు ఉంది. నా ఐదేళ్ల హయాంలో రూ.3,32,671 కోట్లే అప్పులు చేశాను.

అప్పులు చేయడంలో చంద్రబాబు కంటే తానే గొప్పని జగన్ చెప్పదలచుకున్నట్లుగా ఉంది. తాను దిగిపోయేటప్పుడు వదిలేసివెళ్లిన రూ.1,30,000 కోట్ల పెండింగ్ బిల్లులు.. కార్పొరేషన్లను అడ్డం పెట్టుకుని బ్యాంకుల నుంచి తెచ్చిన రూ.2,00,000 కోట్ల అప్పుల గురించి కూడా చెప్పి ఉంటే.. జగన్ అప్పుల రికార్డు తన మాటల్లోనే ఇంకా ఘనంగా ఉండేది. ఇప్పుడీ అడ్డగోలు అప్పులకే చంద్రబాబు ప్రభుత్వం అసలు, వడ్డీ కలిపి నెలకు రూ.70,000 కోట్ల వరకు చెల్లిస్తోంది. జగన్ తెచ్చిన అప్పులకు వడ్డీరేట్లు తగ్గించండంటూ బ్యాంకుల చుట్టూ తిరుగుతోంది.

అబద్ధాలు.. నిజాలు



జగన్: రాజ్యాంగ ఉల్లంఘనలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 436 గనులపై హక్కులను ఏపీఎండీసీకి కట్టబెట్టి వాటి విలువను రూ.1,91,000 కోట్లుగా లెక్కగట్టి.. వాటిని తాకట్టు పెట్టి రూ.9,000 కోట్లు అప్పులు తేవాలనుకుంటున్నారు.

ఇది అసత్య ఆరోపణ కావడంతో కేంద్రం ఇదివరకే కొట్టిపారేసింది. ఆ అక్కసుతో.. జగన్ దానినిప్పుడు జనం మీదకు వదిలారు. రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఏపీఎండీసీ ద్వారా బాండ్లు జారీ చేయించి.. వచ్చిన డబ్బును రాజ్యాంగ విరుద్ధంగా ప్రభుత్వ అవసరాలకు వాడుతున్నారంటూ కేంద్రానికి ఇటీవల కొందరు (జగన్ సన్నిహితులు) ఫిర్యాదు చేశారు. దానిపై పీయూష్ ఇచ్చిన వివరణతో కేంద్రం ఏకీభవించి ఆ లావాదేవీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సీఎం చంద్రబాబు తాజాగా ప్రభుత్వ ఆస్తులైన కొన్ని గనులను కంపెనీల చట్టం ప్రకారం ఏర్పడిన ఏపీఎండీసీకి ఇస్తున్నారు. నిబంధనల ప్రకారం జరుగుతున్న స్పష్టమైన లావాదేవీ ఇది. గనులు ఇస్తున్నందుకు ప్రభుత్వానికి ఏపీఎండీసీ నుంచి కూడా ప్రయోజనం ఉండాలి. అందుకే బాండ్లు జారీ చేసి ప్రయోజనం కల్పించాలని ఏపీఎండీసీ భావిస్తోంది. దీనిని ప్రభుత్వం ఎక్కడా దాచడం లేదు. ఈ వివరాలన్నీ పబ్లిక్ డొమైన్‌లోనే ఉన్నాయి. రాజ్యాంగాన్ని ఉల్లంఘించి అప్పులు పుట్టించడం జగన్‌కు మాత్రమే తెలిసిన విద్య. ఏపీఎండీసీలో వాటాలను ఒక విదేశీ ఇన్వెస్టర్‌కు విక్రయించే ఉద్దేశంతో 2024 ఎన్నికలకు ముందు షార్ట్ సర్క్యులేషన్ ద్వారా కేబినెట్ ఆమోదం తీసుకున్న సంగతి ఆయన ఉద్దేశపూర్వకంగా మరచిపోయారు. తన నిర్వాకాలన్నీ దాచి పదేపదే అబద్ధాలను ప్రచారం చేస్తే ప్రజలు నమ్ముతారన్నది ఆయన ఉద్దేశంగా కనబడుతోంది.

జగన్: 2023-24లో నేను రూ.67,720 కోట్ల అప్పు మాత్రమే తెచ్చా. కానీ 2024-25లో చంద్రబాబు 81,597 కోట్లు తెచ్చారు.

ఇదో పెద్ద అబద్ధం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జూన్ 4వ తేదీ వరకు జగన్ తెచ్చిన మంగళవారం అప్పులు రూ.23,000 కోట్లు. చంద్రబాబు తెచ్చారని చెబుతున్న రూ.81,597 కోట్ల అప్పులో జగన్ వాటా తీసివేస్తే నికరంగా ప్రస్తుత సీఎం తెచ్చిన అప్పు రూ.58,597 కోట్లు మాత్రమే. 2023-24లో జగన్ తెచ్చిన రూ.67,720 కోట్ల అప్పుల కంటే తక్కువే. పైగా చంద్రబాబు తెచ్చిన అప్పులన్నింటికీ కేంద్రం అనుమతి ఉంది. అయినా జగన్ తప్పుబడుతున్నారంటే.. బురద జల్లడానికేనని తేలిపోతోంది.

జగన్: ఈ అధిక అప్పులు ఎవరి జేబుల్లోకి పోతున్నాయి?

ఇవేమైనా లిక్కర్ మాఫియా డబ్బులా.. ఎవరో ఒకరి జేబులోకి పోవడానికి! ప్రతి పైసాకు ఆడిటింగ్ ఉంటుంది. ఏజీ నివేదికల్లో, ఆర్బీఐ వెబ్‌సైట్లో ఈ మంగళవారం అప్పుల లెక్కలు స్పష్టంగా ఉంటాయి. కేంద్రం అనుమతితో ఆర్బీఐ ప్లాట్‌ఫాం ద్వారా అత్యంత పారదర్శకంగా రాష్ట్రానికి వచ్చే అప్పులివి. ఇలా రాష్ట్రాలకు వచ్చే అప్పులకు కేంద్రం హామీగా ఉంటుంది. వీటిని ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చెల్లించేందుకు వీలుగా రాష్ట్ర ఖజానా ఆర్బీఐ వద్ద తాకట్టులో ఉంటుంది. ఇవన్నీ తెలియక జగన్ ఆ ప్రశ్న అడిగారా.. లేక కుట్రపూరితంగా ప్రభుత్వాన్ని బద్నాం చేద్దామనా?

జగన్: 2023-24లో మేం రూ.23,330 కోట్లు మూలధన వ్యయం చేశాం.. చంద్రబాబు రూ.19,177 కోట్లే ఖర్చుచేశారు.

2024-25లో చంద్రబాబు ప్రభుత్వం చేసిన మూలధన వ్యయం రూ.24,286 కోట్లు. ప్రభుత్వం ఇచ్చే లోన్లు, అడ్వాన్సులను మూలధన వ్యయం నుంచి కావాలనే తీసేసి రూ.19,177 కోట్లే ఖర్చు పెట్టారని జగన్ బురదజల్లాలని చూశారు.

కిక్కుపై కట్టుకథలు

(మొదటి పేజీ తరువాయి)

వాటిపై నానాయాగీ చేశారు. 2019 నుంచి మార్కెట్‌లో ఉన్న గుడ్‌ఫ్రెండ్స్ మొదలు సుమో, కేరళ మాల్ట్, రాయల్ లాన్సర్ విస్కీ.. ఇలా అనేక బ్రాండ్ల ఫొటోలు చూపిస్తూ అవన్నీ ఊరూపేరు లేనివన్నట్లుగా పచ్చి అబద్ధాలు వల్లించారు. నిజానికి.. అవన్నీ ప్రముఖ కంపెనీల ఉత్పత్తులే. ప్రీమియం బ్రాండ్లతోపాటు... ధర తక్కువ ఉండే లిక్కర్‌నూ అందుబాటులోకి తెచ్చాయి. మార్కెట్ వ్యూహంతోపాటు రూ.99కే మంచి మద్యం ఇవ్వాలన్న ప్రభుత్వ విధానం మేరకు వీటిని ఉత్పత్తి చేస్తున్నాయి. ఇదీ వాస్తవం. అయినా సరే... జగన్ ఈ బ్రాండ్లపై ఆరోపణలు చేశారు. దీంతోపాటు తన హయాంలో మద్యం స్కామ్ జరగలేదని చెప్పుకొనేందుకు రకరకాల విన్యాసాలు చేశారు. ఇవీ ఆ వివరాలు...

జగన్: ఎవరైనా అమ్మకాలు పెంచితే లంచాలు ఇస్తారు. అమ్మకాలు తగ్గిస్తే లంచాలు ఇస్తారా?

వాస్తవం: వైసీపీ హయాంలో రెండో సంవత్సరం మాత్రమే అమ్మకాలు తగ్గాయి. మిగిలిన నాలుగేళ్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. అయితే అమ్మకాలు తగ్గినా, పెరిగినా అసలు అమ్మిన మద్యం ఎవరిదనేది మాత్రం జగన్ చెప్పలేదు. ఉదాహరణకు 2020-21లో అతి తక్కువగా 1.87కోట్ల కేసుల లిక్కర్, 0.57కోట్ల కేసుల బీరు అమ్మారు. ఆ మద్యం విలువ రూ.17,948కోట్లు. అంటే అందులో సుమారు రూ.4వేల కోట్లు ఉత్పత్తి వ్యయం ఉంటుంది. ఆ రూ.4వేల కోట్లు ఏ కంపెనీలకు వెళ్లాయి? ఎంతసేపూ అమ్మకాలు తగ్గించాం అని చెప్పిన జగన్, తన హయాంలో కొత్తగా తెరపైకి తీసుకొచ్చిన బ్రాండ్ల గురించి చెప్పనే లేదు. ఉదాహరణకు టీడీపీ హయాంలో లక్షల కేసులు అమ్మకాలున్న ఆఫీసర్స్ చాయిస్, మెక్‌డోవెల్స్, హెచ్.డి.హెవెన్స్ డోర్ విస్కీ, ఇంపీయల్ బ్లూ, 999 పవర్‌స్టార్ ఫైన్ విస్కీ బ్రాండ్లు వైసీపీ హయాంలో అడ్రస్ లేకుండా పోయాయి. కానీ సిరి క్లాసిక్ బ్లూ ఫైనెస్ట్ విస్కీ, గ్రేసన్స్ సిల్వర్ స్ట్రిప్స్, రాయల్ ప్యాలెస్ బ్రాందీ, ఓల్డ్ టైమర్ బ్లూ క్లాసిక్ విస్కీ, గ్రేసన్స్ కింగ్స్‌వెల్ బ్రాందీ అనూహ్యంగా తెరపైకి వచ్చాయి. ఈ ఐదు కంపెనీలు కలిపి ఒక్క 2023-24లో 78లక్షల కేసులు అమ్మాయి. 2018-19లో ఈ ఐదు కంపెనీలు కలిపి రాష్ట్రంలో అమ్మింది సున్నా. మరి ఈ కంపెనీల గురించి జగన్ ఎందుకు చెప్పలేదు?

జగన్: అమ్మకాలు తగ్గించాం. ఆదాయం పెంచాం.

వాస్తవం: సంపూర్ణ మద్యపాన నిషేధం హామీతో వైసీపీ అధికారంలోకి వచ్చింది. మద్యనిషేధం చేయకపోగా షాక్ కొట్టేలా ధరలు పెంచుతామని చెప్పి 100శాతం ధరలు పెంచారు. దీనివల్ల 2020-21లో 1.87కోట్ల కేసుల లిక్కర్, 57లక్షల కేసుల బీరు అమ్మారు. దాంతో ఆదాయం పడిపోయింది. వెంటనే అధికారులను పిలిపించుకుని మాట్లాడిన జగన్ ఆ తర్వాత ధరలు తగ్గించారు. ఫలితంగా ఆ తర్వాత ఏడాది 1.87కోట్ల కేసుల లిక్కర్, 82లక్షల కేసుల బీరు, 2023-24లో ఏకంగా 3.32కోట్ల కేసుల లిక్కర్, 1.12కోట్ల కేసుల బీరు అమ్మారు. మరి నాలుగేళ్లలో అమ్మకాలు ఇంత లా ఎలా పెరిగాయి? తగ్గించిన ధరలు ఎందుకు కొనసాగించలేదు? ఈ విషయాన్ని జగన్ ఎక్కడా ప్రస్తావించలేదు.

జగన్: ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే లంచాలు ఇస్తారా? లేక ప్రభుత్వం ద్వారా అమ్మితే లంచాలు ఇస్తారా?

వాస్తవం: తమ ప్రభుత్వ హయాంలో లాభాపేక్ష లేకుండా మద్యం అమ్మకాలను చేపట్టామని జగన్ చెబుతున్నారు. ప్రైవేటు వ్యక్తులకు మద్యం షాపులు ఇస్తేనే లంచాలు ఇస్తారని, ప్రభుత్వం అమ్మితే లంచాలు ఎక్కడుంటాయని ప్రశ్నించారు. కానీ వ్యాపారంలో అసలు కిటుకును బయటపెట్టలేదు. ప్రైవేటు వ్యక్తుల చేతిలో మద్యం షాపులు ఉంటే వారు వ్యాపార కోణంలోనే ఆలోచిస్తారు. ఏ బ్రాండ్లు అమ్ముడుపోతే వాటినే ప్రభుత్వం నుంచి కొంటారు. అందువల్లే వైసీపీ.. ప్రభుత్వ మద్యం షాపులు తీసుకొచ్చింది. అందులో పనిచేసే సిబ్బంది ప్రభుత్వం చెప్పినట్లే చేశారు. వినియోగదారులు అడిగింది కాకుండా పైనుంచి ఆదేశించినవే అమ్మారు. పైస్థాయిలో ఏ బ్రాండ్లు అమ్మమంటే వాటినే ఇండెంట్ పెట్టి షాపుల్లో విక్రయించేలా చేశారు. అసలు ఏ బ్రాండ్ అమ్మాలనేది తాడేపల్లి ప్యాలెస్ నిర్ణయించిన తర్వాత ఇక అది ప్రభుత్వ షాపు, ప్రైవేటు షాపు ఏదైతే ఏముంటుంది?

జగన్: చంద్రబాబు చేతుల్లోనే ప్రైవేటు మద్యం మాఫియా ఉంది. ఆ షాపుల సైన్యంతో ఇండెంట్ పెడతారు. ఏ డిస్టిలరీకి మేలు చేయాలనుకుంటే వారికే ఆర్డర్లు ఇస్తారు.

వాస్తవం: ప్రైవేటు వ్యక్తులను చంద్రబాబు మేనేజ్ చేసి ఇండెంట్లు పెట్టిస్తున్నారని, గతంలో పెట్టించారని జగన్ ఆరోపించారు. ప్రైవేటు వ్యక్తులను బాబు మేనేజ్ చేయగలిగితే... ప్రభుత్వ అధీనంలోనే ఉన్న ప్రభుత్వ షాపులను సీఎంగా జగన్ మేనేజ్ చేయలేరా? ఈ లాజిక్ మిస్ అయిన జగన్... అమ్మకాలు ప్రభుత్వం చేతిలో ఉంటే ఏంచేయలేమని, ప్రైవేటులో అయితే ఏదైనా చేయొచ్చని, తన కింద పనిచేసిన వారు తన మాట వినలేదు అన్నట్టుగా చెప్పుకొచ్చారు. పైగా వైసీపీ హయాంలో ఆన్‌లైన్ ఆర్డర్ల విధానం తొలగించారు. ఆన్‌లైన్ విధానంలో అయితే డిమాండ్‌కు తగ్గట్టుగా ఆటోమేటిక్‌గా ఆర్డర్లు ప్లేస్ అవుతాయి. ఉదాహరణకు ఒక నెలలో ఏ బ్రాండ్ అమ్మకాలు ఎంత ఉన్నాయనే రికార్డుల ఆధారంగా ఆటోమేటిక్‌గా ఆర్డర్లు వెళ్తాయి. టీడీపీ ప్రభుత్వం నుంచి కొనసాగింపుగా చూస్తే పాపులర్ బ్రాండ్లకు తప్ప జే బ్రాండ్లకు అవకాశం రాదు. అందుకే ఆన్‌లైన్ తొలగించి, మాన్యువల్ ప్రవేశపెట్టారు.

జగన్: రాజ్ కసిరెడ్డి ఒక సలహాదారు. ఆయనకు మద్యంతో సంబంధం ఏంటి?

వాస్తవం: లిక్కర్ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి రాజ్ కసిరెడ్డి. ఏ కంపెనీకి ఆర్డర్లు ఇవ్వాలి? షాపుల్లో ఏ రోజు ఏ బ్రాండ్లు అమ్మాలి? అనేది నిర్ణయించింది ఆయనే. కంపెనీలకు బిల్లులు చెల్లించిన వెంటనే హైదరాబాద్ కేంద్రం గా ముడుపులు తీసుకుంది కసిరెడ్డి మనుషులే. మద్యం కుంభకోణంలో ఆయనది అత్యంత కీలక పాత్ర. ఇప్పటికే సిట్ విచారణలో అనేక అంశాలు వెలుగులోకొచ్చాయి. అయినా రాజ్ కసిరెడ్డి ఒక మంచి వ్యక్తి అని, అసలు ఆయనకు మద్యం అంటేనే తెలియదన్నట్టుగా జగన్ చెప్పుకొచ్చారు. ఇక ఎస్పీవై, ఇతర డిస్టిలరీల ద్వారా పిచ్చి బ్రాండ్లు ఉత్పత్తి చేయించి లాభం పొందినట్లు ఆరోపణలున్న ఎంపీ మిథున్‌రెడ్డికి కూడా ఏ పాపం తెలియదని ఆయన చెప్పారు. మద్యం కుంభకోణం వాస్తవమేనని అంగీకరించిన విజయసాయిరెడ్డి... చంద్రబాబుకు లొంగిపోయారంటూ ఆయనపై టీడీపీ ముద్ర వేశారు. ఇంకా ఆయన నియమించిన అప్పటి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డిపై కూడా వైసీపీ విడుదల చేసిన మద్యం వాస్తవాల ప్రజెంటేషన్‌లో ప్రతికూలంగా రాసుకొచ్చారు. కానీ వాసుదేవరెడ్డి అప్పటి సీఎం కార్యదర్శి, లిక్కర్ స్కామ్‌లో నిందితుడు ధనుంజయరెడ్డికి అత్యంత సన్నిహితుడు.



జగన్: మా హయాంలో డిస్టిలరీలకు లాభాలు తగ్గించాం.

వాస్తవం: మద్యం కంపెనీలకు (జగన్ చెబుతున్న డిస్టిలరీలు) లాభాలు తగ్గించారనేది పచ్చి అబద్ధం. ఎందుకంటే వారికిచ్చే మొత్తం పెంచారు కాబట్టే ఆ అదనంగా పెంచింది ముడుపుల రూపంలో వెళ్లింది. అయితే ప్రస్తుత బ్రాండ్‌కు అప్పటికప్పుడు ధరలు పెంచలేరు కాబట్టి సిమిలర్ సౌండింగ్ బ్రాండ్స్ పేరుతో కొత్తవాటిని సృష్టించారు. ఉదాహరణకు ఒక బ్రాండ్ ధరను ఎలా పెంచారంటే మాన్సన్ హౌస్ ఫ్రెంచ్ బ్రాందీని... మాన్సన్ హౌస్ సుపీరియర్ బ్రాందీగా కొత్త పేరుతో తీసుకొచ్చారు. వాస్తవానికి రెండు బ్రాండ్లు ఒకే కంపెనీవి. కొత్తగా వచ్చిన సుపీరియర్ బ్రాందీకి ఇచ్చే రేటును ప్రభుత్వం పెంచేసింది. తెలంగాణతో పోలిస్తే రూ.600 అదనంగా చెల్లించింది. అయితే వినియోగదారులకు మాత్రం మాన్సన్‌హౌస్ అనేది మాత్రమే పెద్దగా కనిపిస్తుంది. సుపీరియర్ అనేది కనిపించీ కనిపించకుండా చిన్నగా ఉంటుంది. కేసు రూ.1,300గా ఉన్న బ్రాండ్ ధరను రూ.1,697గా, రూ.696 ఉంటే దానిని రూ.1,009గా ఇలా పేరు మార్చి అదే బ్రాండ్‌కు ధర పెంచారు. అలా పెంచిన మొత్తం తిరిగి తాడేపల్లి ప్యాలెస్‌కు ముడుపుల రూపంలో చేరింది.

జగన్: పన్నులు బాది డిస్టిలరీలకు లాభాలు లేకుండా చేశాం.

వాస్తవం: జగన్ చెప్పినట్లు వైసీపీ హయాంలో పన్నులు భారీగా పెంచారు. అయితే దానితో డిస్టిలరీలకు ఎలాంటి సంబంధం లేదు. డిస్టిలరీల్లో తయారుచేసిన మద్యంపై ప్రభుత్వం పన్నులు విధిస్తుంది. ఆ పన్నులను చెల్లించాల్సింది వినియోగదారులు. ఇందులో మద్యం కంపెనీలకు ఒక్క రూపాయి నష్టం ఉండదు. వైసీపీ హయాంలో స్పెషల్ మార్జిన్, రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్, అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ అనే పన్నులను ప్రవేశపెట్టారు. ఫలితంగా సుమారు రూ.120గా ఉన్న మద్యం సీసా రూ.200కు చేరింది. అదనంగా పెంచిన దాంట్లో కొంతమొత్తం తాడేపల్లి ప్యాలెస్‌కు చేరిందని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. అయినా ఈ బాదుడును జగన్ గొప్పగా చెప్పుకొన్నారు.

మద్యంలో మరో 'లీల'!

(మొదటి పేజీ తరువాయి)

చాలా వరకూ అప్పటి అధికార పార్టీ పెద్దలకు, మద్యం మాఫియాకు చేరింది. వరుణ్ ప్రస్థానం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ నుంచి మొదలై పాండిచ్చేరి, గోవా మీదుగా ముంబై దాకా వెళ్లింది. అక్కడి నుంచి విదేశాలకు వెళ్లిపోయినట్లు అనధికారిక సమాచారం.

డాక్టర్ పరిచయంతో...

వరుణ్ 2016లో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఉద్యోగాన్వేషణలో చతికిలపడి బంజారాహిల్స్‌లోని ఒక కాఫీ షాపులో రూ.32 వేల జీతానికి పనికి చేరాడు. అమెరికాలో స్థిరపడ్డ డాక్టర్ రమేశ్‌రెడ్డి అనే తెలుగు ఎన్‌ఆర్‌ఐ 2019 ఎన్నికలకు ముందు హైదరాబాద్ వచ్చినప్పుడు అక్కడ వరుణ్ పరిచయమయ్యాడు. అమెరికా వెళ్లి లక్షలు సంపాదించే ఉద్యోగం చేయాలన్నది తన లక్ష్యమని వరుణ్ ఆయనకు చెప్పాడు. కొన్ని రోజుల తర్వాత ఢిల్లీకి రమ్మంటూ రమేశ్‌రెడ్డి నుంచి ఫోన్ రావడంతో వరుణ్ వెళ్లాడు. అయితే ఒక మద్యం కంపెనీలో మంచి ఉద్యోగం ఉందంటూ డాక్టర్ ఆఫర్ చేశారు. అప్పటికి ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఆ ప్రభుత్వంలో మద్యం మాఫియాకు కమీషన్లు ఇవ్వలేక, వ్యాపారం సవ్యంగా చేసుకోలేక లీలా డిస్టిలరీస్ అనే కంపెనీ ఇబ్బంది పడుతోంది. దీన్ని లిక్కర్ మాఫియా స్వాధీనం చేసుకుంది. పాండిచ్చేరిలో లీలా డిస్టిలరీస్ ఉత్పత్తుల వ్యవహారాలు చూసుకునే ఉద్యోగంలో వరుణ్‌ను నియమించారు. అనతి కాలంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ఆ కంపెనీకి ఇన్‌చార్జిని చేశారు. అతడితో రూ.వందల కోట్ల విలువైన మద్యం వ్యాపారాలు చేయించారు. విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్‌లో ఆఫీసు తెరిచారు. మద్యం ఉత్పత్తి నుంచి రిటైల్ విక్రయాల వరకూ మద్యం మాఫియా అన్నీ తమ చేతుల్లోకి తీసుకుంది. వారి సూచనలకు అనుగుణంగా పనిచేస్తూ లీలాస్ బ్రిలియంట్ బ్లెండ్ విస్కీ లాంటి కొన్ని చెత్త బ్రాండ్లను పంపిణీ చేశాడు. కమీషన్లు ఇచ్చేందుకు నిరాకరించిన పెరల్స్ డిస్టిలరీస్, బీవీఎస్ డిస్టిలరీ, ఇతర మద్యం ఉత్పత్తి సంస్థలు రాజ్ కసిరెడ్డి, ఇతర గ్యాంగ్ దెబ్బకు కుదేలయ్యాయి. కసిరెడ్డి సూచనల మేరకు వైసీపీ నాయకులకు కొంత అందజేసిన వరుణ్ మిగతా మొత్తాన్ని షెల్ కంపెనీల ద్వారా మళ్లించేశాడు. ఏపీలో మద్యం కుంభకోణంపై విచారణకు ఆదేశిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన వెంటనే వరుణ్ దేశం వదిలి పారిపోయాడు. అమెరికాలో స్థిర పడేందుకు వెళ్లాడా అనే కోణంలో సిట్ అధికారులు విచారించగా, దుబాయ్ వెళ్లినట్లు కొంత సమాచారం లభించింది. నిర్ధారణ కాకపోవడంతో టెక్నాలజీ సాయంతో అన్వేషించారు. వరుణ్ జాడ తెలియరాలేదు. అతడు క్షేమంగానే ఉన్నాడా... లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అమాయకుడి పేరు వాడేశారు...

గుంటూరుకు చెందిన ఒక మైనారిటీ యువకుడూ మద్యం మాఫియా వలలో పడి విలవిల్లాడుతున్నాడు. బీర్లు ఉత్పత్తి చేసే ఒక కంపెనీ నుంచి ఏపీ డీలర్‌షిప్‌ను ఆయన పేరుతో మాఫియా నడిపించింది. ఆయనకే తెలియకుండా ఆయన పేరు ఎక్కడెక్కడ అవసరమో అక్కడ వాడేశారు. ఏపీలో ఆ యువకుడి పేరుతో వందల కోట్ల బీర్ల వ్యాపారం చేసి... వచ్చిన సొమ్మును విదేశాలకు మనీలాండరింగ్ ద్వారా చేరవేసినట్లు సిట్ గుర్తించింది. ఈ విషయం చెప్పడంతో బాధితుడు గగ్గోలు పెడుతున్నట్లు తెలిసింది.

పెద్దిరెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ

- అటవీ భూముల ఆక్రమణ వ్యవహారంలో క్రిమినల్ కేసులపై స్టేకు నిరాకరణ

అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): అటవీ భూముల ఆక్రమణ వ్యవహారంలో వైసీపీ నేత, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అటవీ శాఖ అధికారులు తమపై ప్రారంభించిన క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను నిలుపుదల చేయాలంటూ పెద్దిరెడ్డి, ఆయన సోదరుడు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకానాథ్‌రెడ్డి, కుమారుడు, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి తమ్ముడి సతీమణి పి. ఇందిరమ్మ వేసిన అనుబంధ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. క్రిమినల్ కేసులపై స్టే విధించేందుకు నిరాకరించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ గురువారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. పిటిషనర్ల అధీనంలో ఉన్న భూముల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని భావిస్తే చట్టనిబంధనలు అనుసరించాలని రెవెన్యూ, అటవీ శాఖ అధికారులను ఆదేశిస్తూ గతంలో ఇదే హైకోర్టు ఉత్తర్వులిచ్చిందని గుర్తుచేశారు. చిత్తూరు జిల్లా మంగళంపేట పరిధిలోని వివిధ సర్వే నంబర్లలో తమ అధీనంలో ఉన్న 75.74 ఎకరాల భూమి నుంచి ఖాళీ చేయించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని పేర్కొంటూ పెద్దిరెడ్డి, ఆయన కుటుంబసభ్యులు హైకోర్టును ఆశ్రయించారు.



బుగ్గమఠం భూములపై 'దేవదాయ ట్రిబ్యునల్'ను ఆశ్రయించండి

- వైసీపీ నేత పెద్దిరెడ్డికి హైకోర్టు ఆదేశం

అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): బుగ్గమఠం భూములు ఖాళీ చేయాలంటూ మఠం అసిస్టెంట్ కమిషనర్/ ఈవో ఇచ్చిన ప్రొసీడింగ్స్‌పై దేవదాయ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని హైకోర్టు ఆదేశించింది. అభ్యంతరాలన్నింటినీ ట్రిబ్యునల్ ముందే లేవనెత్తాలని స్పష్టం చేసింది. భూములు, నిర్మాణాల వ్యవహారంలో 2వారాల పాటు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని దేవదాయశాఖ అధికారులకు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. తిరుపతి, ఎం.ఆర్‌పల్లి, మారుతి నగర్ ఎక్స్‌టెన్షన్ పరిధిలో సర్వే నం. 261/1, 261/2లోని 3.88 ఎకరాల బుగ్గమఠం భూములను పెద్దిరెడ్డి ఆక్రమించారని నిర్ధారిస్తూ, ఆ భూములు ఖాళీ చేయాలంటూ బుగ్గమఠం అసిస్టెంట్ కమిషనర్/ఈవో మే 16న ప్రొసీడింగ్స్ ఇచ్చారు. వాటిని సవాల్ చేస్తూ పెద్దిరెడ్డి గురువారం అత్యవసరంగా పిటిషన్ దాఖలు చేశారు. న్యాయమూర్తి లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్, న్యాయవాది నర్సిరెడ్డి.. రాష్ట్ర ప్రభుత్వం, బుగ్గమఠం తరపున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు.

అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్!

జగన్‌పై టీడీపీ ఫైర్.. అప్పుల నుంచి మద్యం వరకు అన్నీ అసత్యాలే

- 2019లో టీడీపీ దిగిపోయేనాటికి రాష్ట్రం అప్పులు రూ.3.75 లక్షల కోట్లు
- 2024లో వైసీపీ వెళ్లిపోయేనాటికి రూ.9.74 లక్షల కోట్లు
- రాష్ట్రాన్ని ఆయన మద్యం మాఫియాకు అప్పగించారు

అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ సత్యహరిశ్చంద్రుడికి తమ్ముడిలా మాట్లాడుతున్నారని, నీతి నిజాయితీ అంటూ ప్రజలను మోసం చేయడంలో ఆయన పీహెచ్‌డీ చేశారని టీడీపీ విరుచుకుపడింది. గురువారం జగన్ నిర్వహించిన రెండున్నర గంటల సుదీర్ఘ మీడియా సమావేశంలో అబద్ధాలు, అసత్యాలు తప్ప ఒక్క నిజం కూడా లేదని మండిపడింది. ఆయన ఆరోపణలను గణాంకాలతో తిప్పికొట్టింది.

అప్పులు.. అబద్ధాలు

2019 మార్చి 31న టీడీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రం అప్పులు రూ.3.75 లక్షల కోట్లు మాత్రమే. 2024 జూన్ 12న జగన్ దిగిపోయే నాటికి రూ.9.74 లక్షల కోట్లు అప్పు చేశారు. ఈ వాస్తవాన్ని దాచి కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ ధ్వజమెత్తింది.2023-24లో కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా రూ.31,838.14 కోట్లు ఉండగా 2024-25లో రూ.36,869.53 కోట్లకు పెరిగింది. ఈ నిజాన్ని దాచి పెట్టి జగన్ అబద్ధాలు చెబుతున్నారని టీడీపీ విమర్శించింది.

ఉర్సాపై కక్షసాధింపు

రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేయడమే జగన్ లక్ష్యమని, అందులో భాగంగానే పరిశ్రమలపై అసత్యప్రచారాలు చేస్తున్నారని టీడీపీ దుయ్యబట్టింది. 'గత నెల 15న ఉర్సా క్లస్టర్స్‌కు భూకేటాయింపునకు కొన్ని నిబంధనలతో కేబినెట్ ఆమోదం తెలిపిందనే విషయం తెలిసి కూడా జగన్ విషం చిమ్ముతున్నారు. మధురవాడ ఐటీ హిల్స్‌లో ఎకరం రూ.కోటి చొప్పున 3.5 ఎకరాలు, కాపులుప్పాడులో ఎకరం రూ.50 లక్షల చొప్పున 56.5 ఎకరాలను ఉర్సాకు ప్రభుత్వం కేటాయించింది. ఈ వాస్తవాలన్నీ తెలిసి కూడా కేవలం ప్రజలను తప్పుదారి పట్టించేందుకే జగన్ ఉర్సాకు ఎకరా 99 పైసలకే కేటాయించినట్లు అసత్య ప్రచారం చేస్తూ తప్పుడు రాతలు రాయిస్తున్నారు. మాట్లాడితే ఊరుపేరు లేని కంపెనీ అంటూ ఉర్సాపై ఫేక్ ప్రచారం చేస్తున్నారు. ఉర్సా సంస్థ నెట్ వర్త్ 2.5 బిలియన్ డాలర్లు. ఈ సంస్థ ప్రమోటర్ల నెట్‌వర్త్ రూ.3,700 కోట్లు. అవగాహన, అర్థం లేని మాటలతో ప్రజలను మభ్యపెట్టాలని జగన్ ప్రయత్నిస్తున్నారు' అని విమర్శించింది. సెకీ నుంచి విద్యుత్ కొనుగోలు విషయంలోనూ జగన్ అడ్డగోలుగా అబద్ధాలు చెప్పారని ఆక్షేపించింది. 'తాడేపల్లి ప్యాలెస్‌లో చీకటి ఒప్పందాలు చేసుకుని ఒక్క రోజులోనే కేబినెట్‌లో ఆమోదింపజేసుకుని.. ముడుపులు దండుకుని సిగ్గు లేకుండా యూనిట్ రూ.2.49కే కొన్నామని గొప్పలు చెప్పుకొంటున్నారు. వైసీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడానికి ముందే గుజరాత్‌తోపాటు పలు రాష్ట్రాలు సోలార్ పవర్‌ను యూనిట్ రూ.1.99కే కొన్న విషయం జగన్ ఎందుకు చెప్పలేదు' అని పేర్కొంది.

మద్యం మాఫియా గుట్టు రట్టు

దశలవారీగా మద్యపాన నిషేధమంటూ 2019లో అధికారంలోకి వచ్చిన జగన్.. దశలవారీగా అవినీతికి తెరదీశారు. మొత్తం రూ.3,200 కోట్లు దోపిడీ చేసినట్లు సిట్, ఈడీ దర్యాప్తులో తేలిందని టీడీపీ గుర్తుచేసింది. 'మద్యం తయారీ కంపెనీల నుంచి నెలకు రూ.50-60 కోట్ల ముడుపులను అప్పటి ప్రభుత్వ ఐటీ సలహాదారు రాజ్ కసిరెడ్డి వసూలు చేసి షెల్ కంపెనీల ద్వారా విదేశాలకు తరలించారు. దోచుకున్న సొమ్ములో రూ.400 కోట్లు బంగారం రూపంలో ముడుపు తీసుకున్నారని సిట్ తేల్చింది. మాన్షన్ హౌస్ బ్రాందీని సరఫరా చేసే తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ నుంచి కేస్‌కు రూ.20 చొప్పున రూ.280 కోట్లు ముడుపులు తీసుకున్నారు. దానిలో సుమారు రూ.196 కోట్లు బంగారం రూపంలో దోచుకున్నారు' అని పేర్కొంది.

మీరు చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నాం: నారాయణ

కాకినాడ/కలెక్టరేట్, మే 22(ఆంధ్రజ్యోతి): 'గత సీఎం జగన్ రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను అథోగతి పాల్జేశారు. రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు. వాటికి మేం వడ్డీలుగా కడుతున్నాం' అని రాష్ట్ర మంత్రి నారాయణ చెప్పారు. గురువారం కాకినాడ జిల్లా మినీ మహానాడులో ఆయన మాట్లాడుతూ.. త్వరలో కాకినాడ, రాజమహేంద్రవరం, నెల్లూరుల్లో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామన్నారు.

జగన్‌ను నమ్ముకుంటే జైలుకే: వర్ల

ఇబ్రహీంపట్నం, మే 22(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ అవినీతికి కొమ్ము కాసిన ఐపీఎస్ అధికారి పీఎస్సార్ ఆంజనేయులు, ఐఏఎస్ ఆఫీసర్ ధనుంజయ్ రెడ్డి విజయవాడలో గంజాయి బ్యాచ్‌తో కలిసి జైలులో కటిక నేలపై పడుకుంటున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. ఎన్టీఆర్ జిల్లా మినీ మహానాడులో ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా పేరుతో రూ.172 కోట్లు కాజేసిన రోజా జైలుకెళ్లక తప్పదన్నారు.

లిక్కర్ స్కామ్‌తో జగన్‌లో వణుకు: మంత్రి సత్యకుమార్

అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్‌లో జగన్ సన్నిహితులు పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతుంటే.. ముందు తన పరిస్థితి ఏమిటో? అన్న భయం జగన్‌లో స్పష్టంగా కనిపిస్తోందని మంత్రి సత్యకుమార్ అన్నారు. మద్యం స్కాంపై అసంబద్ధ వాదనలతో జగన్ రెడ్డి ప్రజల ముందు చులకన అయ్యారన్నారు.

జగన్‌కు మానసిక సమస్య: కలిశెట్టి

న్యూఢిల్లీ, మే 22(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ మానసిక సమస్యతో బాధపడుతున్నారని, తక్షణమే వైద్యం చేయించుకోవాలని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సూచించారు. జగన్ పాలనలో దేశంలోనే అతిపెద్ద మద్యం కుంభకోణం జరిగిందని చెప్పారు.

మద్యం కేసుతో జగన్‌కు నిద్ర పట్టడం లేదు

- 99 పైసలకే భూములిచ్చామని నిరూపిస్తావా.. రాజీనామా చేస్తావా?
- సోమిరెడ్డి, ఆనంద్‌బాబు



అమరావతి, మే 22(ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమాల్లో దోషులు జైలుపాలవుతుంటే జగన్‌రెడ్డికి నిద్ర పట్టడం లేదని, అబద్ధాలను పదే పదే చెప్పడం ద్వారా వాటిని ప్రజలు నమ్ముతారనుకోవడం జగన్ పిచ్చితనమని టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నక్కా ఆనంద్‌బాబుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 'జగన్ మాటల్లో ఒక్కటీ నిజం లేదు. గ్రోత్ రేట్‌కు అర్థం తెలియని జగన్‌రెడ్డి.. రాష్ట్రంలో గ్రోత్ రేట్ దారుణంగా పడిపోయిందని చెప్పడం సిగ్గుచేటు. ఉర్సాకు 99 పైసలకే భూములిచ్చామన్న జగన్.. దాన్ని నిరూపించాలి, లేకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి' అని సోమిరెడ్డి డిమాండ్ చేశారు. నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ నిన్నటి దాకా జగన్ పంచనే ఉన్న విజయసాయిరెడ్డి.. టీడీపీ వాడు ఎలా అయ్యాడని ప్రశ్నించారు.

కొడాలి నానిపై లుక్ అవుట్ నోటీసులు

- ఎయిర్‌పోర్టులు, ఓడరేవులకు ఆన్‌లైన్‌లో అలర్ట్
- ఇప్పటికే మాజీ మంత్రిపై పలు కేసులు
- అమెరికాకు పరారు కాకుండా అప్రమత్తం?



గుడివాడ, మే 22(ఆంధ్రజ్యోతి) : పలు కేసుల్లో నిందితునిగా ఉన్న మాజీ మంత్రి కొడాలి నానిపై లుక్ అవుట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ నోటీసులు ఆన్‌లైన్ ద్వారా అన్ని ఎయిర్‌పోర్టులు, ఓడరేవులకు అందాయి. వాస్తవానికి కొడాలి నానికి రాష్ట్రంలో పాస్‌పోర్టు లేదు. రైతు మోసే కేసులో జైలుశిక్ష ఖరారుకావడం, పలు కేసుల్లో నిందితునిగా ఉండటంతో ఆయనకు పాస్‌పోర్టు జారీ కాలేదు. అయితే, హైదరాబాద్ చిరునామాతో పాస్‌పోర్టును పొంది ఉంటారని అనుమానిస్తున్నారు. అమెరికాకు పరారయ్యే అవకాశం ఉందని సందేహిస్తున్నారు. కృష్ణాజిల్లా గుడివాడ పరిధిలో నానిపై ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. వలంటీర్లతో బలవంతంగా రాజీనామాలు చేయించడం, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు, ఎన్నికల కోడ్ ఉల్లంఘన, విశాఖపట్నంలో కేసుకు సంబంధించి నాని ముందస్తు బెయిల్ పొందారు. గుడివాడ మండలం మల్లాయిపాలెం జగనన్న కాలనీకి మెరక పేరుతో రూ.కోట్లు దోపిడీ చేసిన వ్యవహారంలో నమోదైన కేసులో నానిపై దర్యాప్తు పురోగతిలో ఉంది.

వంశీ ముందస్తు బెయిల్‌పై విచారణ 29కి వాయిదా

- అక్రమమైనింగ్ కేసులో హైకోర్టు ఉత్తర్వులు
- నకిలీ ఇళ్ల పట్టాల కేసులో పోలీసు కస్టడీకి వంశీ
- ఉత్తర్వులు జారీ చేసిన నూజివీడు కోర్టు



అమరావతి/నూజివీడు, మే 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో అక్రమ మైనింగ్ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు ఈనెల 29కి వాయిదా వేసింది. గురువారం వ్యాజ్యంపై విచారణ జరిపేందుకు తగిన సమయం లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకుంది. పీటీ వారెంట్ అమలును నిలుపుదల చేస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులనూ అప్పటివరకు పొడిగించింది.

రెండు రోజుల పోలీస్ కస్టడీకి వంశీ

నకిలీ ఇళ్ల పట్టాల కేసులో వల్లభనేని వంశీని రెండు రోజులు పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ నూజివీడు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గురువారం తీర్పు చెప్పారు. బాపులపాడు మండలంలో నకిలీ ఇళ్ల పట్టాల కేసులో మరింత విచారణకు ఈనెల 23, 24 తేదీల్లో వంశీని పోలీస్ కస్టడీకి జడ్జి అనుమతించారు.

దర్యాప్తునకు ఆటంకం కలిగిస్తున్నారనే అరెస్టు

- ఏవిధంగా ఆటంకం కలిగిస్తారో చెప్పండి: హైకోర్టు
- పీఎస్ఆర్ బెయిల్ పిటిషన్‌పై విచారణ 29కి వాయిదా
- గ్రూప్-1 కేసులో నిందితులను కస్టడీకి ఇవ్వండి
- విజయవాడ కోర్టులో పోలీసుల పిటిషన్



అమరావతి/విజయవాడ, మే 22(ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ కేసులో బెయిల్ కోసం సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... పిటిషనర్, ఇతర పోలీసు అధికారులు కేసు నమోదుకు ముందే జెత్వానీ విషయంలో కుట్ర పన్నారన్నారు. అప్పటి ఇంటెలిజెన్స్ డీజీ సూచనలు మేరకే తాను ముంబై వెళ్లానని ఐపీఎస్ అధికారి విశాల్ గున్ని డిపార్ట్‌మెంట్ విచారణలో కమిషనర్ ముందు వాంగ్మూలం ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్పందిస్తూ.. ఉన్నతస్థానాల్లో ఉన్న అధికారులు జాగ్రత్తగా ఉండకపోతే ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని పేర్కొన్నారు. పిటిషనర్ దర్యాప్తును ఏవిధంగా ఆటంకం కలిగిస్తారు? సాక్షులను ఏవిధంగా ప్రభావితం చేస్తారో? వాదనలు వినిపించాలని ఏజీకి సూచిస్తూ విచారణను ఈనెల 29కి వాయిదా వేశారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష మూల్యాంకనంలో అక్రమాలు, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ పీఎస్ఆర్ ఆంజనేయులుపై నమోదు చేసిన కేసు వివరాలు తమ ముందు ఉంచాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈనెల 27కి వాయిదా వేసింది.

పీఎస్ఆర్ రిమాండ్ పొడిగించిన విజయవాడ కోర్టు

ఏపీపీఎస్సీ గ్రూప్-1 డిజిటల్ మూల్యాంకనంలో అక్రమాలపై కేసులో ఐపీఎస్ అధికారి పీఎస్సార్ ఆంజనేయులుకు రిమాండ్‌ను పొడిగిస్తూ విజయవాడ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. కాగా, ఈ కేసులో మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఏ1, ఏ2గా పీఎస్ఆర్, పమిడికాల్వ మధుసూదన్‌ను వారం రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని సూర్యారావుపేట పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై వాదనలు విన్న అనంతరం తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

మా భూమిలో జోక్యం చేసుకోకుండా చూడండి

- వైవీ సుబ్బారెడ్డి భార్య స్వర్ణలతారెడ్డి పిటిషన్

హైదరాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ గ్రామ పరిధిలోని 87/2 సర్వే నంబర్‌లోని తమ 2.08 ఎకరాల భూమిలోకి ప్రైవేటు వ్యక్తులు ప్రవేశించకుండా రక్షణ కల్పించేలా పోలీసులను ఆదేశించాలని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి భార్య స్వర్ణలతారెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది. విచారణను జూన్ 23కు వాయిదా వేసింది.

రెండు రోజుల పోలీసు కస్టడీకి తురకా కిశోర్

మాచర్లటౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): భూకబ్జా, హత్యాయత్నం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్, వైసీపీ నాయకుడు తురకా కిశోర్‌ను రెండు రోజులు పోలీసు కస్టడీకి మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అనుమతించింది.

సజ్జల, పైలా బెయిల్‌పై విచారణ 27కు వాయిదా

విజయవాడ, మే 22(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డి, పైలా దిలీప్ బెయిల్ పిటిషన్ల విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు ఈనెల 27కు వాయిదా వేసింది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.